thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 140 కరీంనగర్ మంగళవారం, 29 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కొచ్చి తీరంలో హై అలెర్ట్

కొచ్చి : కొచ్చికి సమీపంలో కంటెయినర్ల నౌక మునిగిపోవడంతో కోస్ట్‌గార్డ్, కేరళ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మునిగిన కొన్ని కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు ఉండడంతో కొచ్చి తీరంలో హైఅలెర్ట్ ప్రకటించాయి. ఒడ్డుకు కొట్టుకువచ్చే కంటెయినర్లనుగానీ, చమురుతెట్టునుగానీ తాకకూడదని ప్రజలను హెచ్చరించాయి. ఆఫ్రికా ఖండంలోని లైబేరియా దేశానికి చెందిన ఆ సరకు రవాణా నౌక అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిని ఇండియన్ కోస్టు గార్డు కాపాడింది. 180మీటర్ల పొడవున్న ఆ నౌకలో మొత్తం 640 కం టెయినర్లు ఉన్నాయి. అవన్నీ సముద్రంలో మునిగిపోయినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.




# శత్రువుల వెన్నులో... వణుకుపుట్టించాం

## 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశాం: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత సైన్యం సత్తాకు 'ఆపరేషన్ సిందూర్' నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకంగా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టుబెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు. 2025 మే 10వ తేదీని మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు.

**పాక్ ఓటమిని అంగీకరించింది...** పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకుపడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

**ఎలాంటి ఒత్తిడి లేదు...** ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు.

**విమానాల కూల్చివేతపై..** ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమాధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.




## మహిళల చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్.. కోనేరు హంపి ఓటమి..

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. ఈ రోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోనేరు హంపిపై దివ్య దేశ్‌ముఖ్ విజయం సాధించింది. ఈ విజయంతో 19 ఏళ్ల దివ్య భారతదేశానికి చెందిన ఎనభై ఎనిమిదో గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జరిగిన తొలి ర్యాపిడ్ ట్రై బ్రేకర్ డ్రాగా ముగిసింది. అయితే ఆ తర్వాత రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో కోనేరు హంపిపై దివ్య గెలుపొందింది. 2025 ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా దివ్య నిలిచింది. చివరకు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దివ్యకు 1.5 పాయింట్లు లభించగా, కోనేరు హంపికి 0.5 పాయింట్లు వచ్చాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దివ్యకు హంపీ గట్టి పోటీనిచ్చింది. దీంతో ఫలితం ట్రైబ్రేకర్‌కు చేరింది. సోమవారం దూకుడుగా ఆడిన దివ్య టోర్నీ విజేతగా నిలిచి గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకుంది.

## మెడికల్ కౌన్సిల్ ఏం చేస్తోంది?.. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటనలో విస్తుపోయే విషయాలు




సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిర్వాహకురాలు డాక్టర్ అట్లూరి నమ్రత అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అనుమతులు లేకుండా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను నిర్వహించడమే కాకుండా సరోగసి పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్ చేసి రూ. లక్షలు గడించినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఇంత పెద్దఎత్తున ఈ రాకెట్ నడుస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందనే అంశం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**గతంలోనే పలు కేసులు..** సికింద్రాబాద్, కొండాపూర్, విశాఖ పట్నం, విజయవాడల్లో ఫెర్టిలిటీ సెంటర్లు నిర్వహిస్తున్న డాక్టర్ నమ్రత 1995 నుంచి వైద్య వృత్తిలో ఉన్నారు. 1998 నుంచి ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ రంగంలోకి దిగారు. కాసుల కక్కుర్తికి అలవాటు పడిన ఆమె సంతానం కోసం వచ్చే దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. గతంలోనే ఆమెపై అనేక ఆరోపణలు ఉండగా పలు కేసులు సైతం నమోదు అయ్యాయి. అక్రమంగా పసిపిల్లలను విక్రయిస్తూ పట్టుబడిన యూనివర్సల్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసును సుమోటోగా స్వీకరించి విచారించాలని నాలుగేళ్ల క్రితమే ఏపీ మెడికల్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ కేసులో కీలక నిందితురాలిగా ఉన్న డా.నమ్రత వైద్యడిగ్రీని తక్షణమే సస్పెండ్ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో తెలంగాణలోనూ ఆమెపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహణ లైసెన్స్‌ను 2021లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పొడిగించలేదు. కానీ తాజాగా సికింద్రాబాద్ యూనివర్సల్ ఫెర్టిలిటీ కేంద్రంలో వెలుగు చూసిన ఘటనతో నమ్రత అక్రమ దందా ఏ రేంజ్‌లో కొనసాగుతోందో అర్థం అవుతున్నది. అనుమతులు నిరాకరించి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? ఇంటర్నెట్‌లో బహిరంగంగానే డాక్టర్ నమ్రత సరోగసీ రాకెట్ నడిపిస్తుంటే మెడికల్ కౌన్సిల్‌తో పాటు పోలీసులు, ఇతర నిఘా సంస్థలు, ఏం చేస్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఆ పిల్లల తల్లిదండ్రులు ఎవరు?..** సరోగసీ నిర్వహించకుండానే ఇతరుల పిల్లలను తీసుకొచ్చి సంతానం కోసం వచ్చేవారికి అప్పగిస్తుండం వెనుక పలు సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారనే అరోపణల నేపథ్యంలో ఇప్పటివరకు సరోగసి పేరెంట్స్‌కు అప్పగించిన చిన్నారుల అసలు తల్లిదండ్రులు ఎవరు? వారికి ఎక్కడి నుంచి తెచ్చారు? అనేది తెలియాల్సి ఉంది. అయితే ఇల్లీగల్ దందాపై ఎవరికైనా ఏదైనా సందేహం కలిగి ప్రశ్నిస్తే వెంటనే నమ్రత కుమారుడు, న్యాయవాది జయంత్ కృష్ణ రంగంలోకి దిగుతారని తెలిసింది. సృష్టి ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న జయంత్ కృష్ణ ఈ వ్యవహారంపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురు తిరగడమే కాకుండా ఈ అంశంలో నేరం మీదేనని, బయటకు వస్తే అరెస్టు అవుతారంటూ బెదిరింపులకు పాల్పడుతాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా వీరి బారిన పడి మోసపోయిన వారి సంఖ్య భారీగా ఉన్నట్లు తెలుస్తోంది.

# బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ధర్నా

# క్లారిటీ వచ్చాకే స్థానిక ఎన్నికలు



## తెలంగాణ సర్కార్ నిర్ణయం

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఆమోదముద్ర వేయకపోవడతో స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేయడం సాధ్యం కావడం లేదని తెలంగాణ మంత్రివర్గం భావిస్తోంది. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.

ఆగస్టు ఐదో తేదీన తెలంగాణ సీఎం సహా మంత్రులందరూ ఢిల్లీకి వెళ్లి నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అపాయింట్ మెంట్ ను సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నా పట్టించుకోవడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభలో ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులకు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రపతి ఆమోదం ఇంకా పెండింగ్లో ఉంది. ఈ బిల్లులు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, మరియు ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను కల్పించే లక్ష్యంతో ఉన్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేంద్రం ఆలస్యాన్ని నిరసిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 5, 2025న మంత్రులతో కలిసి ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని కేబినెట్ నిర్ణయించామన్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే ఉండి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులను కలిసి బిల్లులకు ఆమోదం కోరనున్నారు. ఇండియా కూటమి నాయకుల నుండి మద్దతు కూడా కోరతారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 2025 చివరి నాటి నిర్వహించాలని, రిజర్వేషన్ ను ఈ నెలాఖరు నాటికి ఖరారు చేయాలని ఆదేశించింది. అయితే, బీసీ రిజర్వేషన్ బిల్లులు పెండింగ్లో ఉండటం వల్ల, రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. రిజర్వేషన్ ఖరారుపై హైకోర్టు గడువు సమీపించిన సమయంలో ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించడానికి ఢిల్లీలో ఒత్తిడి తెచ్చేందుకు ఈ ధర్నా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

బిల్లు చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నా.. ఎందుకు ఆమోదింపచేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నేతల్ని ప్రశ్నించారు. ధర్నాలు చేయడానికి తమతో కలిసి రావాలన్నారు. ధర్నాల కోసం మిత్రపక్షాలన్నింటితో కలిసి వెళ్తామన్నారు. బీజేపీ నేతలు..బీసీ రిజర్వేషన్లతో రాజకీయాలు చేయవద్దన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలలోని బీసీ నాయకులను 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం సహకరించాలని పొన్నం కోరారు. తెలంగాణ ఉద్యమం తరహాలో జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, మరియు కుల సర్వే ఆధారంగా కులగణన న్యాయపరమైన చిక్కులు లేకుండా జరిగిందని, ఈ సర్వే ప్రకారం బీసీలు ..ముస్లిం బీసీలు మినహా.. 46.2 శాతం జనాభాను కలిగి ఉన్నారన్నారు. ఇండియా కూటమి నాయకుల నుండి కూడా ఈ అంశంలో మద్దతు కోరనున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం నినాదానికి అనుగుణంగా ఉందని ఉందన్నారు. రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం నేరుగా ఢిల్లీ ధర్నా చేయాలనుకోవడంతో .. రాజకీయం మరింత వేడెక్కనుంది.




## ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి చేశారు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: నెక్లెస్ రోడ్డులోని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్మారకం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పలువురు నేతలు నివాళి అర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని చెప్పారు. కేంద్రం ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు.

హైదరాబాద్‌కు మెట్రో జైపాల్‌రెడ్డి కృషి వల్లే వచ్చిందని చెప్పారు. దేశం మొత్తం మీద నిజాయతీగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను తెలంగాణ మరువదని చెప్పారు.

## సీఎం వద్దే విద్యాశాఖ ఉన్నా అలాంటి ఘటనలు జరగడమేంటి?: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



హైదరాబాద్: ప్రతివారం ఏదో ఒక ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని.. విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ఇలాంటి ఘటనలు జరగడమేంటని భాజపా నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై వస్తున్న వార్తలు కొన్నే ఉన్నాయని, బయటకు రాని సంఘటనలు చాలా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో మీడియాతో ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. "గత ప్రభుత్వం బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని చెప్పింది. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా అదే చెప్పింది కానీ.. ఎక్కడా మూసివేసిన దాఖలాలు లేవు. మద్యం అమ్మకాల ద్వారానే ఆదాయం సమకూర్చుకోవాలనే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించింది.. ఈ ప్రభుత్వం దాన్నే కొనసాగిస్తోంది. గతం కంటే మూడు రెట్లు పెంచింది. మద్యం మత్తులో ప్రజలను ఉ ంచి 6 గ్యారంటీలను మర్చిపోయేలా చేయాలని చూస్తోంది. ఏ శాఖలో చూసినా అవినీతి విపరీతంగా పెరిగిపోయింది. కురుస్తున్న వర్షాలకు జీహెచ్ఎంసీ పరిధిలో మోకాలు లోతు నీళ్లు నిలుస్తున్నాయి. పరిస్థితి మారట్లేదు. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొంటున్నారు.. కానీ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకుడే లేరు. పరిపాలన చేతకాకుంటే దిగిపోండి"అని ప్రభాకర్ అన్నారు.

## ఐదేళ్లలో రూ.362 కోట్లు.. మోడీ సార్ టూర్లతో ప్రయోజనమెంత?



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వచ్చిన బహుమతులను, జ్ఞాపికలను వేలం వేసి ఆ మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇవ్వడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారు. అదే సమయంలో, ఆయన విదేశీ పర్యటనలపై అవుతున్న భారీ ఖర్చు ఇప్పుడు సంచలన చర్చకు దారితీసింది. కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకు సమర్పించిన లెక్కల ప్రకారం, గత ఐదేళ్లలో మోదీ విదేశీ పర్యటనలపై దాదాపు రూ.362 కోట్లు ఖర్చయినట్లు వెల్లడైంది.

**– పార్లమెంటుకు సమర్పించిన ఖర్చుల వివరాలు...** 2021 నుంచి 2024 మధ్యకాలంలో ప్రధానమంత్రి విదేశీ పర్యటనలపై రూ.295 కోట్లు ఖర్చు కాగా.. 2025లో యూఎస్ఏ, ఫ్రాన్స్ సహా ఐదు దేశాల పర్యటనల కోసం రూ.67 కోట్లు అదనంగా వెచ్చించారని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ మొత్తాల్లో విమాన ప్రయాణం, భద్రతా ఏర్పాట్లు, హోటళ్ల ఖర్చులు, స్థానిక రవాణా, ఇతర లాజిస్టిక్స్ ఖర్చులు అన్నీ కలిపి ఉంటాయి.

**– దాచిన వివరాలు.. పెరుగుతున్న అనుమానాలు...** ఈ ఖర్చులపై విపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ అడిగిన ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం ఇచ్చినా.. మారిషస్, కెనడా, బ్రెజిల్ వంటి తొమ్మిది దేశాల పర్యటనల ఖర్చుల వివరాలను మాత్రం బహిర్గతం చేయలేదు. అంతేగాక ఏ ఖర్చు ఎలా జరిగిందన్న స్పష్టత లేకపోవడం ఈ వ్యవహారంపై మరింత అనుమానాలను పెంచుతోంది.

**– దౌత్య సంబంధాల బలోపేతం.. న్యాయమైన ఖర్చు?...** బీజేపీ, ఎన్డీఏ నేతలు మాత్రం మోదీ విదేశీ పర్యటనల వల్ల భారతదేశానికి గణనీయమైన లాభాలు చేకూరాయని వాదిస్తున్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పడ్డాయని, కీలకమైన వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని, రక్షణ, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో భారత్‌కు ప్రయోజనం దక్కిందని పేర్కొంటున్నారు. ఈ పర్యటనల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతి పెరిగిందని కూడా వారు చెబుతున్నారు.

**– ప్రజాధనాన్ని ఖర్చు చేసినప్పుడు లెక్కలు అవసరం...** అయితే దేశంలో ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం, రుణభారంతో ప్రజలు బాధపడుతున్న ఈ తరుణంలో ఈ రూ.362 కోట్ల ఖర్చు సమర్థనీయమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రజాధనం కాబట్టి ప్రతి రూపాయికి పూర్తి పారదర్శకంగా లెక్కలు ఉండాలన్నది విపక్షాల ప్రధాన డిమాండ్. మోదీ విదేశీ పర్యటనల వల్ల భారత్‌కు లాభాలు వచ్చి ఉండవచ్చు. కానీ, ఖర్చు చేసిన భారీ మొత్తం, దాని ఉపయోగం పట్ల మరింత పారదర్శకత అవసరం. ప్రజల నిధులు ఎలా ఖర్చవుతున్నాయో వారికి స్పష్టంగా తెలిసేలా ఉండాలి. అప్పుడే ప్రజల్లో ప్రభుత్వ పట్ల విశ్వాసం బలపడుతుంది. లేదంటే ఈ విదేశీ పర్యటనలు ఖర్చు పేరుతో వివాదాలకు దారితీస్తూనే ఉంటాయి.




హైదరాబాద్-విజయవాడ రూట్‌లో రాకపోకలు సాగించేవారికి తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆయా బస్సుల్లో టికెట్ ధరలపై భారీ తగ్గింపును ప్రకటించింది.

కనీసం 16శాతం నుంచి గరిష్ఠంగా 30శాతం వరకు టికెట్ ధరల్లో ప్రత్యేక ఆఫర్ ఇస్తున్నట్లు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దీని ప్రకారం.. గరుడ ప్లస్ బస్సుల్లో టికెట్ ధరపై 30శాతం, ఈ-గరుడ బస్సుల్లో 26శాతం ప్రత్యేక ఆఫర్ ఇవ్వనుంది. అలాగే, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ బస్సుల్లో 20శాతం, రాజధాని, లహరి ఏసీ బస్సుల్లో టికెట్లపై 16శాతం మేర తగ్గిస్తున్నట్లు పేర్కొంది.

ఈ రాయితీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్‌లకు వర్తించనున్నాయి. ఈ టికెట్లను తమ అధికారిక వెబ్‌సైట్ http://tgsrtcbus.inద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించింది.




హైదరాబాద్: సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "సిగాచీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని సీఎం చెప్పారు. రోజులు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిహారం అందలేదని బాధిత కుటుంబసభ్యులు ఆందోళనలో ఉన్నారు. ఎప్పుడు పరిహారం ఇస్తారని నిలదీస్తున్నారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కొన్ని కుటుంబాలకు రూ.లక్ష పరిహారమే అందింది. మృతులు, క్షతగాత్రుల వివరాలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.




బాటసింగారం: రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం ఈగల్ టీమ్, రాచకొండ పోలీసులు తనిఖీలు చేపట్టి.. 935 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని 455 ప్యాకెట్లుగా చేసి పండ్ల ట్రేలల్లో ఉంచి డీసీఎంలో తరలిస్తున్నట్లు వెల్లడించారు. ముగ్గురు అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

## హెచ్‌సీఏ అక్రమాలపై సీబీఐ విచారణ చేయించాలి.. హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్: సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో చోటు చేసుకున్న ఆర్థిక అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఈ పిటిషన్ వేశారు. హెచ్‌సీఏ బాధ్యతలను బీసీసీఐకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని ఇందులో కోరారు. ఈ నెల 19వ తేదీన నిర్వహించిన వార్షిక సమావేశం చెల్లదని ప్రకటించాలని అభ్యర్థించారు. హెచ్‌సీఏ బాధ్యతలను విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నవీన్ రావుకు అప్పగిస్తూ గత విచారణ సందర్భంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మధ్యంతర ఉత్తర్వులు మూడు వారాల వరకు కొనసాగనున్నాయి.



## హైదరాబాద్‌లో చిరుత సంచారం.. సీసీ కెమెరాల్లో రోడ్డు దాటుతున్న దృశ్యాలు



హైదరాబాద్: నగరంలో చిరుత సంచారం కలకలం రేపింది. గోల్కొండలోని ఇబ్రహీంబాగ్ మిలిటరీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. తారామతి వెనుక భాగం మూసీ వైపు చిరుత వెళ్లినట్లు సమాచారం. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు గోల్కొండ పోలీసులు సమాచారం ఇచ్చారు. కొన్ని రోజులుగా మంచిరేవుల, నార్సింగి ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోంది. గ్రేహౌండ్స్ ప్రాంతంలో 4 బోన్లు, ట్రాప్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. బోన్లకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతోంది. ఈ క్రమంలోనే ఇబ్రహీంబాగ్ మిలిటరీ ప్రాంతంలో చిరుత రోడ్డుదాటినట్లు సమాచారం.




శ్రీవారి దర్శనార్థం వచ్చే ప్రముఖులు సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకొని ఏడాదికి ఒకసారి మాత్రమే తిరుమల పర్యటన చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. తిరుమల శ్రీవారిని కుటుంబసభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారికి ఇచ్చే కానుకలను ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రభుత్వ లేదా ఇతర కార్యక్రమాలకు మళ్లించకూడదన్నారు. ప్రతి ఊరిలో బడి, గుడి నిర్మించాలన్నారు.

# శ్రావణ శుక్ల పంచమి విధుశేఖర భారతీ తీర్థ స్వామి జయంతి

**శ్లో. "భారతీ కరుణా పాత్రం భారతీ పద భూషణం భారతీ పదమారూఢం భారతీతీర్థ మాశ్రయే"...**
**శ్లో. "విద్యావినయ సంపన్నం వీతరాగం వివేకినంబీ వందే వేదాన్త తత్వజ్ఞం విధుశేఖర భారతీమ్".**



అద్వైత మత స్థాపనాచార్యులైన ఆది శంకరులు తూర్పున జగన్నాథంలో "గోవర్ధన మఠం" పడమర ద్వారకలో "శారదామఠం", ఉత్తరాన కేదారంలో "జ్యోతిర్మఠం ", దక్షిణాన శృంగేరి యందు" శృంగగిరి మఠం "స్థాపించారు. దుష్టాచారాలను నశింప చేసేందుకే కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివన్యాసం" స్పష్టపరుస్తున్నది. ఆదిశంకరులు స్థాపించిన శృంగగిరి మఠానికి 1989 నుండి తంగిరాల సీతారామ ఆంజనేయులు 36 వ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి, ఆయన ఉత్తరాధికారిగా కుప్ప వేంకటేశ్వర ప్రసాద శర్మ "విధుశేఖర భారతీ తీర్థ స్వామి" గా 23 వ జనవరి 2015 న నియమితులయ్యారు. శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామీజీ శ్రావణ శుక్ల పంచమి నాగ పంచమి రోజు, జూలై 24, 1993 న ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుపతిలో కౌండిన్య గోత్రానికి చెందిన కుప్ప శివ సుబ్రహ్మణ్య అవధాని, శ్రీమతి సీత నాగలక్ష్మి దంపతులకు వేంకటేశ్వర ప్రసాద శర్మగా జన్మించారు. ప్రసాద శర్మ కుటుంబీకులు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా అనంతవరంకు చెందినవారు. ప్రసాద శర్మ పుట్టేనాటికి.. తండ్రి తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో వేద పారాయణ దారుగా పని చేస్తున్నారు. శనివారం పూట అందునా శ్రీగోవింద రాజస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రంలో పుట్టడం వల్ల కుమారుడికి వేంకటేశ్వర ప్రసాద శర్మగా నామకరణం చేశారు. ఆ వేంకటేశ్వర స్వామి పేరు పెట్టుకోవడం.. తండ్రి వేదాధ్యయన కేంద్రాల్లో ఉద్యోగం చేయడం వెరసి ప్రసాదశర్మ భవిష్యత్తును నిర్దేశించాయి. వేదాభ్యాసం దిశగా ఆసక్తిని కలిగించాయి. చిన్న వయస్సు నుండే, శ్రీ ప్రసాద శర్మ శ్రీకృష్ణుని పట్ల గ్రాఢమైన భక్తిని పెంపొందించు కున్నారు. ప్రతిరోజూ తన ఇంటికి సమీపంలో ఉన్న కృష్ణ దేవాలయాన్ని సందర్శించే వారు. తన కుమారుని భక్తిని చూసిన శ్రీ శివసుబ్రహ్మణ్య అవధాని తన ఐదవ ఏటనే తన ఉపనయన సంస్కారం నిర్వహించారు. ప్రసాద శర్మ విద్యాభ్యాసం ... ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు సికింద్రాబాద్ సైనిక్‌పురి లోని భవాన్స్ శ్రీరామకృష్ణ విద్యాలయంలో చదివారు. చిన్నతనంలోనే ప్రసాద శర్మను సాధారణ విద్యనుంచి వేద విద్యకు మళ్లించారు. తాతగారు కుప్పారామగోపాల వాజపేయ యాజి దగ్గర కృష్ణ యజుర్వేదం అధ్యయనం చేయించారు. అలా ప్రసాద శర్మ తొలిగురువు తాతగారే అయ్యారు. వేగవంతమైన పురోగతిని చూపుతూ, శ్రీ ప్రసాద శర్మ తన తండ్రి కింద కృష్ణ యజుర్ వేద క్రమం వరకు తన చదువును కొనసాగించారు. గురువెంత గొప్పవాడైనా శిష్యుడిలో గురుబోధన అకళింపు చేసుకునే శక్తిసామర్థ్యాలు కూడా పుష్కలంగా ఉండాలి. ఆ సామర్థ్యం శర్మలో ఉంది కాబట్టే తొమ్మిదేళ్లలో కృష్ణయజుర్వేదం పూర్తి చేశారు. ఆయన దేవుని పట్ల భక్తి, వేద జీవన విధానానికి కట్టుబడి ఉండే వాతావరణంలో పెరిగారు. హంసలదీవి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది సముద్రంలో కలిసే పవిత్ర ప్రదేశం. అక్కడ, నది ఒడ్డున, వేణుగోపాల స్వామికి అంకితమైన అందమైన ఆలయం ఉంది. గత 95 సంవత్సరాలుగా, విరామం లేకుండా, ఆయన కుటుంబం ఈ దేవాలయంలో వార్షిక భాగవత సప్తాహాలు నిర్వహిస్తోంది. శ్రీ ప్రసాద శర్మ చిన్న వయస్సు నుండే ఈ పవిత్ర కార్యక్రమానికి హాజరయ్యారు. అయోధ్య, హరిద్వార్, హృషికేష్, కాశీ, కాలడి, మధురై, మధుర, పశుపతి నాథ్ (నేపాల్‌లో), రామేశ్వరం మరియు ఉజ్జయిని వంటి పవిత్ర స్థలాలకు కూడా ఆయన తన తండ్రితో పాటు తీర్థయాత్రలకు వెళ్లారు. 2006 నుండి, తన 13 సంవత్సరాల వయస్సులో, శ్రీ ప్రసాద శర్మ తన తండ్రి మరియు తాతతో కలిసి శృంగేరి శారద పీఠంలో ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడం ప్రారంభించారు. తన మొదటి సందర్శన సమయంలో, ప్రస్తుత జగద్గురువు, శ్రీ శ్రీ భారతీ తీర్థ మహా స్వామిజీ దర్శనం ఆయన పై తీవ్ర ప్రభావం చూపింది. ఆయన 2008 లో మళ్లీ శృంగేరిని సందర్శించారు. 2009 ప్రారంభంలో తన తదుపరి సందర్శన సమయంలో, పీఠాధితుల కింద శాస్త్రాలను అధ్యయనం చేయాలనే తన కోరికను జగద్గురువుకు వ్యక్తం చేశారు. ఆ యువకుడి నిజాయితీని చూసి, తెలివి తేటలతో ఆకట్టుకున్న జగద్గురువు ఆయనను ఆశీర్వదించారు. శ్రీ ప్రసాద శర్మ జూన్ 2009 లో జగద్గురు ఆశ్రయం పొందారు. జగద్గురువుల మార్గదర్శకత్వంలో, ఆయన వ్రాత, మాట్లాడే సంస్కృతంలో వేగంగా ప్రావీణ్యం సంపాదించారు. శృంగేరి విద్వాన్ శ్రీ తంగిరాల శివకుమార శర్మ సంస్కృత కవిత్వం, సాహిత్యం నేర్పించారు. శృంగేరి విద్వాన్ శ్రీ కృష్ణరాజ భట్ వద్ద వ్యాకరణ శాస్త్రం యొక్క ప్రాథమికాలను కూడా నేర్చుకున్నారు. ప్రసాద శర్మ గురుభక్తి, వినయం, తెలివి తేటలు, అధ్యయనాలకు అంకితభావంతో చేస్తున్న తీరును గమనించిన జగద్గురువు సంతోషించి, తామే వ్యక్తిగతంగా శాస్త్రాలు నేర్పించాలని నిర్ణయించు కున్నారు. జగద్గురువులు 2011 లో తర్క శాస్త్రాన్ని బోధించడం ప్రారంభించారు. శ్రీ ప్రసాద శర్మ బోధనలను త్వరగా గ్రహించారు. పాఠాలు తీవ్ర వేగంతో కదిలాయి. 2012-13లో విజయవంతమైన యాత్రలో కూడా, జగద్గురువు ఒక్క రోజు కూడా తప్పకుండా బోధించడం కొనసాగించారు. జగద్గురు త్వరలో ఆయన్ను గొప్ప తర్క పండితులుగా మార్చారు. జగద్గురువుల మార్గదర్శకత్వంలో, శ్రీ ప్రసాద శర్మ మీమాంస శాస్త్రాన్ని కూడా అభ్యసించారు. జగద్గురువులచే రాత్రిపూట జరిగే చంద్రమౌళీశ్వర పూజకు క్రమం తప్పకుండా హాజరయ్యే వారు. పూజ సమయంలో, కృష్ణ యజుర్ వేద మూల, మొత్తం యజుర్ వేద క్రమాన్ని కూడా పఠించే వారు. ఆయన తమ స్వంత అభ్యాసాన్ని కొనసాగిస్తూనే, వేదాలు, సంస్కృత సాహిత్యం, తర్క శాస్త్రాన్ని ఇతర విద్యార్థులకు బోధించడం ప్రారంభించారు. తరువాత జగద్గురువుల క్రింద వేదాంతంలో చదువును ప్రారంభించారు. ఐదున్నర సంవత్సరాల కఠినమైన అధ్యయనం (2009-15) ద్వారా జగద్గురువుల ప్రత్యక్ష శిక్షణలో, శ్రీ ప్రసాద శర్మ వేద సంప్రదాయంలో నిమగ్నమై విద్యార్థిగా, పండితులుగా, ఉపాధ్యాయులుగా, భక్తులుగా అనేక విధాలుగా వికసించారు. అభ్యాసంలోనే అభ్యర్థి అసలు తత్వం తెలుస్తుందన్నట్టు శర్మ చదువు సంధ్యల్లో చూపించే శ్రద్ధాసక్తులను గమనించారు పీఠాధిపతులు. ముఖ్యంగా భారతీతీర్థ తన తదరంతర వారసుడి కోసం వెతుకుతున్నప్పుడు వేదాంత శాస్త్రం అధ్యయనం చేస్తున్న శర్మలో ఆ లక్షణాలన్నీ పుష్కలంగా కనిపించాయి. పీఠానికి ఉత్తరాధికారిగా శర్మను ప్రకటించాలన్న నిర్ణయం జరిగింది. కుప్పా వేంకటేశ్వర శర్మను శృంగేరి పీఠం ఉత్తరాధికారిగా నియమిస్తున్నారన్న విషయం ఎవ్వరూ ఊహించని విధంగా తెలిసింది. శృంగేరి పీఠం వైదిక విద్యాపీఠం. ఇక్కడ వైదిక విద్యలన్నీ సంస్కృత మాధ్యమంగానే ఉంటాయి. తెలుగు, తమిళ. కన్నడ అన్న తేడా ఉండదు. ఇది పూర్తిగా పండిత పీఠం. ఎవరు తమ విద్యాభ్యసంలో అనితరసాధ్యమైన ప్రతిభా పాటవాలు చూపుతారో వారినే ఆ వరం వరిస్తుంది. 36వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి పట్టాభిషిక్తులై 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా పట్టాభిషేక రజతోత్సవాలు నిర్వహించారు. రజతోత్సవానికి శర్మ తల్లిదండ్రులు, తాతగారు, నాయనమ్మ అంతా కలిసి వెళ్లారు. అనూహ్యంగా...అమ్మవారి ఆజ్ఞగా మీ అబ్బాయిని ఉత్తరాధికారిగా నియమి స్తున్నాము... మీకు సమ్మతమేనా? అంటూ జగద్గురువు అడుగుతుంటే ఏం మాట్లాడాలో తండ్రికి అర్థం కాలేదు. తమరి ఆజ్ఞ శిరోధార్యం అంటూ శర్మ తండ్రి తలూపగలిగారు. ఆ రోజు రాత్రి అందరి సమక్షంలో శర్మ పేరును ఉత్తరాధికారిగా ప్రకటించారు మహాస్వామి. పీఠం ఉత్తరాధికారిగా శర్మను 2015 ఫిబ్రవరి 22, 23వ తేదీల్లో వైదిక కార్యక్రమాలతో ప్రకటించారు. అలా జగద్గురువు సమక్షంలో శర్మ శృంగేరీ పీఠం ఉత్తరాధికారిగా వైదిక సంస్కారాల నడుమ అధికారికంగా నియమితులయ్యారు. వందల ఏళ్ల సంవత్సరాల చరిత్ర కలిగిన పీఠానికి ప్రస్తుత పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి తరవాత వరుసగా రెండవ తెలుగు వారిగా ఉత్తధికారిగా శ్రీశ్రీశ్రీ విధుశేఖర తీర్థ స్వామి బాధ్యతలు స్వీకరించడం తెలుగువారు చేసుకున్న అదృష్టం. ఆది శంకరుల నిండు దివ్యాశీస్సులతో, భారతీ తీర్థస్వామి మార్గదర్శకత్వంలో, విధుశేఖర తీర్థ స్వామి ద్వారా మన దేశ ఘన వారసత్వాన్ని, సాంస్కృతిక విలువలు కొనసాగించబడి, ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాలు పరి రక్షించ బడాలని ఆది శంకర భగవత్పాదులను వేడుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అనివార్యమైన పులుల సంరక్షణ - జూలై 29...అంతర్జాతీయ పులుల దినోత్సవం




29 జూలైన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తారు. పులుల ఆవాసాల రక్షణ, విస్తరణకు ప్రోత్సహించడానికి... పులుల పరిరక్షణపై అవగాహన ద్వారా పొందే మద్దతుకోసం 2010 నుండి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించ బడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ఈ దినాన్ని పురస్కరించుకొని పులుల సంరంక్షకణ, వాటి సంతతి వృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి ప్రణాళికలు ప్రభుత్వాలు సిద్ధం చేసుకుంటాయి. పులులు పుట్టాక... ఎక్కువ కాలం తమ తల్లిదండ్రులపై ఆధారపడవు. తమకు తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇష్టపడతాయి. రెండేళ్లు కాగానే విడిగా వెళ్లిపోతాయి. మగ పులులకు మూడేళ్ల తర్వాత సెక్సువల్ మెచ్యూరిటీ వస్తుంది. ఆడ పులులకు నాలుగేళ్ల తర్వాత అది వస్తుంది. పులులు 20 ఏళ్ల దాకా బతుకుతాయి. పులి పిల్లలు పుట్టినప్పుడు వాటికి కళ్లు కనపడవు. తమ తల్లు నుంచి వచ్చే వాసనను బట్టీ తల్లిని అనుసరిస్తాయి. పులి పిల్లల్లో సగం ఆకలితో చనిపోతాయి. చలికి వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక చనిపోతాయి. ప్రతీ పులికీ చారలు వేర్వేరుగా ఉంటాయి. మనుషుల్లో ఏ ఇద్దరికీ ఒకేలాంటి వేలి ముద్రలు ఉండనట్లే... ఏ రెండు పులులకూ ఒకేరకమైన చారలు ఉండవు. పులులు బాగా ఈదగలవు. ఆహారం కోసం చాలా దూరం ఈదుతూ వెళ్లగలవు. సింహాలు గుంపులుగా జీవిస్తాయి. పులులు విడివిడిగా జీవిస్తాయి. ప్రతీ పులీ తనకంటూ ప్రత్యేక ప్రాంతాన్ని ఎంచుకుంటుంది. బాగా పెరిగిన పులి 140 కేజీల నుంచి 300 కేజీల దాకా ఉంటుంది. పులులు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి. పులుల పాదాల కింద మెత్తగా ఉండి, నడిచేటప్పుడు శబ్దం రాదు. వేటాడేటప్పుడు నిశ్శబ్దంగా వచ్చి పరుగెడతాయి. పులిని, 1986 నుండి ఐయుసిఎన్ రెడ్ జాబితాలో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు. గత 100 సంవత్సరాలలో, 97 శాతం అడవి పులులను ప్రపంచం కోల్పోయింది. 20వ శతాబ్దపు ప్రారంభంలో పులి లెక్కింపులో లక్ష ఉన్నట్లు తెలగా, 2013 లో 3274 కు తరువాత 2014 లో 3200 తగ్గిపోయాయి. మానవులు నగరాల విస్తరణ, వ్యవసాయం తదితర కారణాల వల్ల పులుల 93శాతం మేర సహజ ఆవాసం కోల్పోయాయి. అంతే కాకుండా, మానవ - వన్యప్రాణి సంఘర్షణ, వాతావరణ మార్పు కూడా పులుల జనాభా క్షీణతకు, మనుగడ నష్టానికి కారణాలు. ప్రపంచ దేశాల్లో, అత్యధిక సంఖ్యలో 2226 పులులతో భారత దేశం ఉంది. భారత దేశం తర్వాత 500 పులులతో మలేషియా అనుసరిస్తున్నది. 2004 లో 440 పులులతో మూడో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, టైగర్ సెన్సస్ 2015 లో 106 కు పులుల జనాభా క్షీణతను చవిచూసింది. పులులు అంతరించి పోకుండా రక్షించడానికి 2010 లో రష్యాలోని సెయింట్ పీటర్స్బర్గ్ టైగర్ సమ్మిట్ వద్ద పులుల దినోత్సవం స్థాపించ బడింది. ఈ సమ్మిట్ 2022 కల్లా ప్రపంచ పులుల జనాభా రెట్టింపు చేసేందుకు ప్రతినపూనింది. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ- ఎన్‌టీసీఏ) దేశవ్యాప్తంగా పులులను లెక్కిస్తుంది. రాష్ట్రాల్లోని అన్ని అడవుల్లో నాలుగేళ్లకో సారి ఈ గణన జరుగుతుంది. వన్యప్రాణుల గణాంక సేకరణ దేశంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో జరుగుతుంది. అటవీ సిబ్బంది రోజూ సుమారు నాలుగు కిలోమీటర్లు నడుచు కుంటూ వెళ్లి, పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆధారాలను అన్వేషిస్తారు. 2014 నుండి ఎన్‌టీసీఏ వన్యప్రాణుల లెక్కింపులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలను వాడుతోంది. వీటిని వన్యప్రాణులు తిరిగే ప్రదేశాల్లో ఎదురెదురుగా చెట్లకు అమరుస్తారు. ఒకటి నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉంచే ఈ కెమెరాలు 24 గంటలూ వాటంతటవే పనిచేస్తాయి. చిత్రాల్లోని జంతువుల ఎత్తు, చారలు, నడకను పరిగణన లోకి తీసుకొని వాటి సంఖ్యను లెక్క గడతారు. భారత దేశంలో దాదాపు 3 వేల పులులు ఉన్నాయని లెక్కలు చెపు తున్నాయి. పులుల ఆవాసానికి ప్రపంచంలోనే భారత దేశం అనువైన ప్రాంతం. దేశంలో క్రమంగా పులుల జనాభా పెరిగి పోతోంది. 2006లో 1,411, 2010లో 1,726, 2014లో 2,226 పులులు ఉండగా, 2018లో ఆ సంఖ్య 2,967కు చేరుకుంది. ప్రతి నాలుగేండ్లకు ఒకసారి పులుల గణన చేపడుతారు. 2014లో అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్‌లో పులుల సంఖ్య 68 కాగా, 2018 నాటికి ఏపీ, తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య 74కు చేరింది. ఏపీలో 48, తెలంగాణలో 26 పులులు ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. దేశం లోని అతిపెద్ద అభయారణ్యాల్లో ఒకటైన నాగార్జునసాగర్ - శ్రీశైలం పులుల అభయారణ్యంలో 2006లో 95 పులులు ఉండేవి. 2010లో వీటి సంఖ్య 72కు, 2014 నాటికి 68కి తగ్గింది. అయితే, 2018 లెక్కల్లో ఈ సంఖ్య పెరిగింది. రాచ ఠీవికి పెట్టింది పేరైన పులి భారతదేశ జాతీయ జంతువు. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించిన భారత్ మరుసటి ఏడాది ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చింది. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ అడవుల్లో 26 పులులు ఉన్నట్లు తేలింది. గతంలో 20 పులులు ఉన్నట్లు ఓ అంచనా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చేపట్టిన అటవీ రక్షణ చర్యల వల్లే పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయి. తెలంగాణలో పులుల సంఖ్య పెంచే కార్యక్రమాలను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడు తున్నారు. రాష్ట్రంలో కవ్వాల్, ఆమ్రాబాద్ రెండు అభయా రణ్యాలున్నాయి. రాబోవు రోజుల్లో పులుల అభివృద్ధికి మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమే కాకుండా వాటి రక్షణ కోసం వ్యవస్థను కట్టుదిట్టం చేయడానికి, చర్యలు తీసుకుంటున్నారు. పులి చర్మం, గోళ్ల కోసం వాటిని చంపే వారి పట్ల శిక్షలను కఠిన తరం చేసేందుకు కార్యాచరణ అనుసరిస్తున్నారు.

# "సంతాన వరదాయిని గరుడ పంచమి"


## (శ్రావణ శుక్ల పంచమి గరుడ పంచమి సందర్భంగా)



శ్రావణ శుక్ల పక్ష పంచమి "నాగ పంచమి"తోపాటు "గరుడ పంచమి" అని కూడా పేరు. ఈ దినం నాడు నాగుల నుంచి రక్షణ పొంది, నాగదోషం తగులకుండా పిల్లలను కాపాడుకొనేందుకు, నిర్మలమైన మనస్సు, తెలివైన పిల్లలు పుట్టడం కోసం చేసే గరుడ పంచమి నాడు గరుడ పూజ ఆచారంగా ఉంది. మేరు పర్వతంతో సమానమైన శరీరం కలవాడు, సప్త సముద్రాల్లోని జలాన్నంతటినీ ఒక్కరెక్క విసురుతో ఎగరగొట్టగల రెక్కల బలం కలవాడు. అందువలనే గరుడునికి సుపర్ణుడు అను పేరు సార్ధకమైనది. గరుత్మంతుడు మహా విష్ణువుకు వాహనంగా ప్రసిద్ధుడు. మహాబలశాలి. విష్ణువు ఎక్కడికి వెళ్ళాలన్నా గురుడవాహనుడై వెళ్ళి, ఆపన్నుల రక్షణ గావిస్తారు. వ్యాస మహర్షి విరచిత అష్టాదశ పురాణాలలో మరణానంతర నరక లోక వర్ణన, పాపాలకు విధించ బడే శిక్షలు, ప్రాయశ్చిత్తాలు, పుణ్య సాధనా మార్గాలు, పితృకార్య వివరాలతో 18 వేల శ్లోకాలు గల గరుడ పురాణం ఒకటి. అధర్వణ వేదంలో గరుడోపనిషత్తులో విషదహార అని వైనతేయ ప్రస్తావన ఉంది. గరుడ పంచమికి సంబంధించి భవిష్యత్ పురాణంలో ప్రస్తావన ఉంది. సముద్ర మధనంలో " ఉచ్చైశ్రవం" అనే గుఱ్ఱం ఉద్భవించింది. అది శ్వేతవర్ణం కలది. కశ్యపుడు, వినతల కుమారుడు గరుడుడు. ఓ రోజు వినత ఆమె తోడు కోడలు కద్రువ విహార సమయంలో ఆ తెల్లటి గుఱ్ఱాన్ని చూశారు. కద్రువ, వినతతో గుఱ్ఱం తెల్లగా ఉన్న తోకమాత్రం నల్లగా ఉంది అని చెప్పగా, వినత గుఱ్ఱం మొత్తం తెల్లగానే ఉంది అని చెప్పింది. వాళ్ళిద్దరు ఒక పందెం వేసుకొన్నారు. గుఱ్ఱపు తోక నల్లగా ఉంటే వినత కద్రువకు దాస్యం చేయాలని, గుఱ్ఱం మొత్తం తెల్లగా ఉంటే వినతకు కద్రువ దాస్యం చేయాలని పందెం. కద్రువ తన కపటబుద్ధితో, తన సంతానమైన నాగులను పిలిచి అశ్వవాలాన్ని పట్టి వ్రేలాడమని కోరగా. దానికి వారెవ్వరు అంగీకరించలేదు. అందుకు కోపగించిన కద్రువ " జనమేజయుని సర్పయాగంలో నశించాలని" శపించింది. ఒక్క కర్కోటకుడు అనే కుమారుడు అశ్వవాలాన్ని పట్టి వ్రేలాడి తల్లి పందాన్ని గెలిపించాడు. కశ్యప ప్రజాపతి తన భార్యలైన వినత, కద్రువకు సంతాన ప్రాప్తికై పుత్ర కామేష్టి యాగం చేసిన ఫలితంగా, సతుల కోరికలపై కద్రువకు వెయ్యి అండాలు, వినతకు రెండు అండాలు పుడ తాయి. కద్రువ అండాల నుండి వాసుకి, ఆది శేషుడు, ఆదిగా వేయి పాములు జన్మిస్తాయి. వినత తొందర పడి ఒక అండాన్ని చిదమగా కాళ్ళు లేని, మొండెం మాత్రమే గల అనూరుడు జన్మిస్తాడు. దానితో తన సవతికి, తన తల్లి దాసీగా ఉండాలని అనూరుడు శాపమిచ్చి, రెండవ అండం జాగ్రత్తగా దాచితే, దానినుండి జన్మించిన వాడే దాస్య విముక్తి కలిగిస్తాడని చెపుతూ, సూర్యునికి అనూరుడు రథ సారధిగా వెళతాడు. తర్వాత గరుత్మంతుడు జన్మిస్తాడు. శ్రావణ శుద్ధ పంచమి నాడు గరుత్మంతుడు అమృతాపహరణం చేసినందున గరుడ పంచమి అనే పేరు వచ్చింది. గరుడుడు అమృతం తెచ్చి తన సవతి తల్లికి ఇచ్చి కన్నతల్లికి దాస్య విముక్తి గావించాడు. అయితే ఇంద్రునితో గరుడుని ఒడంబడిక కారణంగా, అమృతం నాగులకు లభించలేదు. కనుక వారు అసంతృప్తులైనారు. అసంతృప్తులైన నాగులకు తృప్తి కలిగించడం కోసం వాటికి పూజలు జరపడం విరోధితో జతపడిన పర్వంగా భావిస్తారు. పురాణ గాథలు చూస్తే నాగులకు, గరుడుడికి విరోధమున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విరోధంలో గరుడుడు విజేతగా నిలుస్తాడు. భారత దేశంలో కొన్ని చోట్ల గరుడుడు పరాజి తుడైనట్లు గాథలున్నాయి. గరుత్మంతుడికి, నాగరాజైన తక్షకునికి ఒకసారి యుద్ధం జరగగా, గరుడుడు ఓడి పోవడం జరిగింది. నాగ ప్రతిమ గల యంత్రపు బిళ్ళను మెడలో వేలాడ తీసుకుని ఉండే షరతుపై ఇరువురికి రాజీ కుదిరింది. వంగదేశంలో ఈ పురాణ కథ ఉంది. సర్పరాజుకు, గరుత్మంతుడు నమస్కరిస్తూ ఉన్నట్లు శిల్ప ఖండాలు కూడా నేపాళం తదితర ప్రాంతాలలో ఉన్నాయి. వ్రత రత్నాకరంలో గురుడ పంచమి ప్రస్తావన ఉంది. పంచాంగాలలో సైతం నాగ పంచమి, గరుడ పంచమి రెంటినీ పేర్కొంటారు. విష్ణువుకు గరుడుడు వాహనం కావడం వల్ల, వైష్ణవాలయాలలో ఆ వాహనాలు ఉండడం వాటి మీద స్వాముల ఊరేగింపులు జరపడం పరిపాటి. దేవాలయాల్లో గరుడ వాహనాలను గమనిస్తే, ఒక మోకాలు వంచి, మరో మోకాలు మీద నిటారుగా కూర్చొని రెండు చేతులనూ చాచి మూలవిరాట్టును చూస్తూ ఉంటాడు. దాని అంతరార్థం " స్వామి నా కర్తవ్య నిర్వహణ కోసం నేను ఏ క్షణంలోనైనా సిద్ధమే" అని. సర్వశక్తి సంపన్నుడు అయి ఉండీ, సవతి సోదరులను వీపున మోస్తూ, అవమానాలను ఓర్చి, తల్లికీ, తనకూ గల దాస్య బంధనాలను తెంపి, మహా విష్ణువుకు వాహనంగా వినుతికెక్కిన వినతా పుత్రుడైన వైనతేయుడు ప్రాతఃస్మరణీయుడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# స్వాతంత్ర్యోద్యమ గ్రాండ్ ఓల్డ్ లేడీ అరుణా అసఫ్ అలీ - జూలై 29...అరుణా అసఫ్ అలీ వర్ధంతి




స్వాతంత్ర్య ఉద్యమంకు సంబంధించి 'గ్రాండ్ ఓల్డ్ లేడీ' గా వన్నె కెక్కిన అరుణా అసఫ్ అలీ (జూలై 16, 1909 - జూలై 29, 1996) ప్రసిద్ధ భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర మరవని గొప్ప నాయకురాలు. 1942లో గాంధీజీ జైలుకెళ్ళినపుడు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన మహిళ. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బొంబాయిలోని గవాలియా టాంకు మైదానంలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మహిళగా చిరస్మరణీయురాలు. ఢిల్లీ నగరానికి మెట్టమొదటి మేయర్. ఆమెకు మరణానంతరం భారతరత్న అవార్డు లభించింది. అరుణా గంగూలీ, హర్యానాలోని కాల్కాలో ఒక బెంగాలీ బ్రహ్మ సమాజ కుటుంబంలో జన్మించింది. ఈమె విద్యాభ్యాసం లాహోరు, నైనీతాల్ లలో జరిగింది. చదువు పూర్తయిన తర్వాత ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. దేశములోని అప్పటి పరిస్థితుల్లో అది ఒక మహిళకు గొప్ప ఘనతే. ఆమె కలకత్తాలోని గోఖలే స్మారక పాఠశాలలో బోధించింది. అరుణకు భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడైన అసఫ్ అలీతో అలహాబాదులో పరిచయ మేర్పడింది. ఆ పరిచయం పెళ్ళికి దారి తీసింది. అరుణ తల్లితండ్రులు మతాలు వేరు (తల్లి హిందూ, తండ్రి ముస్లిం), వయోభేదము (ఇద్దరికీ వయసులో 20 ఏళ్ళకి పైగా తేడా) ఎక్కువన్న భావనతో ఆ పెళ్ళిని వ్యతిరేకించినా 1928లో అరుణ, అసఫ్ అలీని వివాహమాడింది. అరుణ తండ్రి ఉపేంద్రనాథ్ గంగూలీ తూర్పు బెంగాల్లోని బరిసాల్ జిల్లాకు చెందినవాడు. సంయుక్త రాష్ట్రాల్లో (యునైటెడ్ ప్రావిన్స్)లో స్థిరపడ్డాడు. ఆయన ఒక రెస్టారెంటు యజమాని, సాహసికుడు. ఆమె తల్లి అంబాలికా దేవి, అనేక హృద్యమైన బ్రహ్మసమాజ ప్రార్థనాగీతాలు రచించిన ప్రముఖ బ్రహ్మజ నాయకుడు త్రైలోక్యనాథ్ సన్యాల్ కూతురు. ఉపేంద్రనాథ్ గంగూలీ యొక్క చిన్న తమ్ముడు ధీరేంద్ర నాథ్ గంగూలీ తొలితరం భారతీయ సినిమా దర్శకుడు. మరో సోదరుడు నాగేంద్రనాథ్, ఒక మృత్తికా జీవశాస్త్రజ్ఞుడు, రవీంద్ర నాథ్ టాగూర్ ఏకైక కుమార్తె మీరా దేవిని పెళ్ళి చేసుకున్నాడు. కానీ, కొన్నాళ్ళ తర్వాత వాళ్ళు విడిపోయారు. అరుణ సోదరి, పూర్ణిమా బెనర్జీ భారత రాజ్యాంగ సభలో సభ్యురాలు. వివాహము తర్వాత అరుణ భారత జాతీయ కాంగ్రెస్ లో క్రియాశీలక సభ్యురాలై ఉప్పు సత్యాగ్రహములో నిర్వహించిన బహిరంగ ప్రదర్శనలలో పాల్గొన్నది. ఆమెను దేశదిమ్మరి అనే అభియోగము మోపి అరెస్టు చేశారు. రాజకీయ ఖైదీలందరి విడుదలకు తోడ్పడిన గాంధీ - ఇర్వింగ్ ఒప్పందముతో 1931లో ఆమెను విడుదల చేయలేదు. అరుణతో పాటు ఖైదులో ఉన్న ఇతర మహిళా ఖైదీలు అరుణను విడుదల చేసే వరకు జైలును వదిలి వెళ్ళేది లేదని పట్టు బట్టారు. మహాత్మా గాంధీ కలుగ జేసుకోవటంతో కానీ వీరు తమ పట్టును సడలించలేదు. ఆ తరువాత ప్రజా ఆందోళన వలన ఆమెను విడుదల చేశారు. 1932లో తీహార్ జైల్లో రాజకీయ ఖైదీగా ఉండగా అరుణ జైల్లో రాజకీయ ఖైదీల పట్ల చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష నిర్వహించింది. ఆమె ప్రయత్నం ఫలితంగా తీహార్ జైల్లో రాజకీయ ఖైదీల పరిస్థితి మెరుగైంది. కానీ ఆమెను అంబాలా జైలుకు తరలించి ఒంటరి ఖైదులో ఉంచారు. జైలునుండి విడుదలైన తర్వాత ఆమె రాజకీయాలలో పాల్గొనలేదు. ? ఆమె 1996, జూలై 29న 87వ ఏట తనువు చాలించింది. 1987లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1996లో భారతరత్న (మరణానంతరం) ఆమెను వరించాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

## సంపాదకీయం

# డ్రాగన్ ఫేక్ మార్కెటింగ్... హెచ్.క్యూ-9 సంగతేమిటి చైనా?

'నీ ఫ్రెండ్ ఎవరో చెప్పు నీ గురించి నేను చెబుతాను' అని అంటారు. ఈ విషయంలో పాకిస్థాన్ ని అడిగినా, చైనాను అడిగినా.. ఇరు దేశాల గురించి ఈజీగా చెప్పెయ్యొచ్చు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఆ రెండు దేశాలు చేస్తోన్న ఫేక్ ప్రచారాలు, ఫేక్ మార్కెంటింగ్ లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. అదేమిటనేది ఇప్పుడు చూద్దామ్..! అవును... ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. పాక్ లోని ఉగ్రశిబిరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత వైమానిక దళం 23 నిమిషాల్లోనే పాక్ లోని 9 ఉగ్రశిబిరాలను నేలమట్టం చేసింది. ఆ సమయంలో.. పాకిస్థాన్ లోని గగనతల రక్షణ వ్యవస్థలు హెచ్.క్యూ-9 జామ్ అయిన పరిస్థితి. దీంతో.. ఆ 23 నిమిషాల్లోనూ పాకిస్థాన్ గగనతలంలో భారత క్షిపణులు విధ్వంసం సృష్టించాయి. ఆ దేశానికి ఊహించని నష్టాన్ని కలిగించాయి. ఈ సమయంలో రక్షణగా నిలవాల్సిన చైనా మేడ్ హెచ్.క్యూ-9 క్షిపణి వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయి. వాటి ఎయిర్ బేస్ లు గట్టి దెబ్బలే తిన్నాయి. .భారత్ కు చెందిన ఒక్క క్షిపణిని కూడా అవి ఆపలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్, రఫీకి ఎయిర్ బేస్ సహా 11 పాక్ ఎయిర్ బేస్ లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. దీనిపై ఇటీవల రాజస్థాన్ సభలో స్పందించిన ప్రధాని మోడీ.. భారత దాడి తర్వాత రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్ ఇంటెన్సివ్ కేర్ లోకి వెళ్లిందని వ్యాఖ్యానించిన పరిస్థితి. ఈ క్రమంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ అనంతరం పాక్ కొన్ని ఫేక్ ప్రచారాలకు తెరలేపింది. ఇందులో భాగంగా.. భారత్ కు చెందిన యుద్ధ విమానాలను కూల్చేశామని చెప్పుకొంది. దీనిపై ఆ దేశ రక్షణ మంత్రిని మీడియా నిలిదీస్తే... సోషల్ మీడియాలో ఆ మేరకు ప్రచారం జరుగుతుందని చెప్పుకొన్న పరిస్థితి. ఈ నేపథ్యంలో చైనా ఫేక్ మార్కెంటింగ్ కు తెరలేపింది. ఇందులో భాగంగా... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఫైటర్ జెట్లను పాకిస్థాన్ పేల్చేసిందని.. ఆ సమయంలో తాము సరఫరా చేసిన జే-10సీ ఫైటర్ జెట్లనే పాక్ ఉపయోగించిందనే భ్రమను.. ప్రపంచం ముందు వాస్తవంగా ప్రజెంట్ చేయాలనుకుంటుంది చైనా. ఈ నేపథ్యంలో చైనా జే-10సీ ఫైటర్ జెట్లపై డాక్యుమెంటరీలు రూపొందిస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... చైనా తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు భారత్ కు ఏ మేరకు నష్టం కలిగించిందనే సంగతి కాసేపు పక్కనపెడితే... పాక్ నమ్ముకున్న హెచ్.క్యూ-9 గగనతల రక్షణ వ్యవస్థ మాత్రం భారత క్షిపణులను ఏమాత్రం అడ్డుకోలేకపోయింది.. నేడు పాక్ లో 11 ఎయిర్ బేస్ లు ధ్వంసం అవ్వడానికి హెచ్.క్యూ-9 కారణం. అయితే... ఈ విషయాన్ని చైనా వ్యూహాత్మకంగా దాచే ప్రయత్నం చేస్తూ... తాము తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చూపించాయని చెప్పుకుంటూ ఓ డాక్యుమెంట్ తీసి, ప్రపంచంతో నకిలీ మార్కెంటింగ్ చేయాలని భావిస్తోంది! ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ ఉపయోగించిన బ్రహ్మోస్ క్షిపణి, ఎస్-400 రక్షణ వ్యవస్థ గురించి ప్రపంచం మొత్తం చర్చించుకుటోన్న పరిస్థితి. మరోపక్క ఈ యుద్ధంలో పాకిస్థాన్ వాడిన ఆయుధాల్లో 80శాతం చైనా తయారు చేసినవే అని అంటున్నారు. దీంతో.. ప్రపంచ వ్యాప్తంగా చైనా రక్షణ పరిశ్రమ విశ్వసనీయతమపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో.. తన ఆయుధాలను మరోమారు ప్రపంచం ముందు ప్రదర్శనకు పెట్టుకొంటుంది చైనా.

# "విశ్వ మానవుడు సి.నా.రె"



డా. సి. నారాయణరెడ్డి అవిభక్త కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజిపేట గ్రామంలో కర్షక కుటుంబంలో (గురుపూర్ణిమ)నాడు 29.7.1931 నాడు జన్మించారు. తల్లి బుచ్చమ్మ, తండ్రి మల్లారెడ్డి. నారాయణరెడ్డి ఇంటిపేరు సింగిరెడ్డి. దేవుని మొక్కు వల్ల కొడుకు పుట్టాడని, సత్య నారాయణరెడ్డి అని పేరు పెట్టుకున్నారు. అయితే సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో కొడుకును చేర్పించే సమయాన 'సి.నారాయణరెడ్డి' %-% అని నమోదు చేయించడం చేత, అదే పేరు స్థిర పడింది. హనుమాజిపేటలో ఆనాడు ప్రభుత్వ పాఠశాల లేనందువల్ల, వ్యక్తిగతంగా ఒక ఉపాధ్యాయుడు నడిపిన వీధి బడిలో ఆయన చదువుకు శ్రీకారం చుట్టి, ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశారు. తరువాత సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో తెలుగును ఒక ఐచ్ఛిక విషయంగా గ్రహించి, మాధ్యమిక స్థాయి విద్యను అభ్యసించారు. 1948లో కరీంనగర్ లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. సినారెలో సహజంగా సృజనాత్మకశక్తి, లయాత్మకత, చిన్ననాటి నుండే ఉన్నాయి. చిన్నప్పటి నుండి మట్టిలో పుట్టిన జానపదగీతాలను ఆలపించే వారు. హరికథలు, బుర్రకథలంటే చెవి కోసుకునేవారు. హరికథా కథనాన్ని ఆశువుగా, సంగీతాత్మకంగా అనుకరించేవారు. వేములవాడ వాస్తవ్యులు చౌటి నరసయ్య హరికథాగానం ఆయనకు ఛందస్సు పట్ల మక్కువ, అభిరుచి కలగడానికి ప్రేరకమైంది. ఆరేడు తరగతుల నుండే కవితలు వ్రాయడం మొదలు పెట్టారు. ఛందస్సంటే తెలియని దశ అది. ఏడవ తరగతిలో సీస పద్యమని తెలియని దశలో "ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో పొట్ట కోసర మెటో పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం వ్రాస్తే – అది సీసపద్యమని తెలిసి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను తెలిపారు దూపాటి వేంకట రమణాచార్యులు. తొమ్మిదవ తరగతి చదువు తున్నప్పుడు వ్రాసిన..."మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో" అనేది సినారె తొలి గేయం. పదవ తరగతిలో ఉన్నప్పుడు "వెన్నవంటి మనసున్నవానికి, అన్నమేమొ కరువాయె ఉన్నవానికింతన్న వీడుదా మన్న గుండె లేదాయె" వంటి పాటలు రాశారు. కరీంనగర్ విద్యార్థి మహాసభలో –విజయంబు సాధించినావా %-% విద్యార్థి, నీ వీర భావాలు నింగి వ్యాపించగాబీ నీ వైరి చిత్తాల నేల కంపించగా" వంటి గేయాలు రచించి పాడారు. ఉన్నత పాఠశాల విద్యాభ్యాస కాలంలోనే, నైజాం రాష్ట్రానికి స్వాతంత్ర్యం రావాలని జరిపిన విద్యార్థుల సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హైదరాబాదు ఛాదర్ఘాట్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో ఇంటర్ మీడియటును (1948%-%49) ముగించారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో వెలువడే 'జనశక్తి' పత్రికలో ఆయన కవిత తొలిసారిగా ప్రచురితమైంది. ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం అనే పద్య నాటికలను వ్రాశారు. 'భలే శిష్యులు' వంటి సాంఘిక నాటికలను రచించారు, ప్రదర్శించి, నటులుగా తామూ పాత్రధారణ చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే 'బి.ఏ.' (1952) చదివారు. బి.ఏ. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక %-% 'శోభ'కు సంపాదకత్వం నిర్వహించారు. 1954లో ఎం.ఏ. పట్టా పొందారు. ఎం.ఏ. విద్యార్థిగా 'సినీకవి' అనే నాటికను వ్రాసి, 'మకరంద మూర్తి' అనే పాత్రను ధరించి, దర్శకత్వం వహించి, ఉత్తమ బహుమతిని అందుకున్నారు. 'ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య పల్లా దుర్గయ్య, ఆచార్య దివాకర్ల వేంకటావధాని తదితరులు ఆయన గురువులు. ఎం.ఏ. పూర్తి చేసి, 1954%-%55లో కొంతకాలం, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరరుగా పనిచేసి, అదే కాలేజీలో 1955లో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం ఆరంభించారు. 1958%-%59లో నిజాం కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేస్తునే 1957 నుండి 1962వరకు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సూచనను అనుసరించి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో %-% 'ఆధునికాంధ్ర కవిత్వము %-% సంప్రదాయములు, ప్రయోగములు' అనే విషయంపై పరిశోధన సాగించి, 1962లో పిహెచ్.డి. పట్టాను పొందారు. 1963లో ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో 'రీడర్' అయ్యారు. 1976లో ఆచార్యులై,1981 వరకు బోధన సాగించారు. నారాయణరెడ్డి భార్య సుశీల కాగా, నలుగురు కూతుళ్ళకు %-% గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి అని పేర్లు పెట్టు కున్నారు. ఆయన 50వ జన్మదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాషా సంఘాధ్యక్ష పదవిని అందించింది. ఆ జన్మదినోత్సవ సన్మాన సభలో నారాయణరెడ్డి %-%"ఎవరికి ఈ సన్మానం, ఎందుకు ఈ సన్మానం, చెట్టంతటి పేరొందిన చిగురుకు ఈ సన్మానం'' అని ప్రారంభించి..."పేరేమో సింగిరెడ్డి, నారాయణరెడ్డి కాని, కులం కీలు ృ విరిచే నాకలానికీ సన్మానం" అంటూ ఒక గేయకవిత చదవగాబీ సభంతా హర్ష ధ్వానాలతో మారుమ్రోగింది. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా 4%-9-%1981 నుండి 7%-8-%1985వరకు, సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, తర్వాత దేశంలో ప్రథమ సార్వత్రిక విశ్వ విద్యాలయమైన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులై, 8.8.1985 నుండి 20.6.1989 వరకు, విధులను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్ష పదవిని 21.6.1989 నుండి 4.11.1992 వరకు నిర్వహించారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ స్నాతకోత్సవం తెలుగులో నిర్వహింపబడిన సందర్భంలో, అప్పటి ఛాన్స్ లర్, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పాల్గొనగా, ఉప రాష్ట్రపతి డా. శంకర్ దయాళ్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 7.7.1991నాడు జరిగిన రెండవ స్నాతకోత్సవంలో, నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. 1990 మార్చి 10, 11, 12 తేదీలలో బెంగుళూరులో 'మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు' నిర్వహింప బడ్డాయి. అంతేకాక, మారిషస్ లో 1990 డిసెంబర్ లో "మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు"నిర్వహించింది ఈ తెలుగు విశ్వ విద్యాలయమే. సినారె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆ తరువాత 1997 జులై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేశారు. ఆ సమయంలోనే భారత రాష్ట్రపతి రాజ్యసభ సభ్యునిగా నామనిర్దేశం చేయగా, 27.8.1997 నుండి 26.8.2003 వరకు కొనసాగారు. దక్షిణ భారతం నుండి రాజ్యసభ సభ్యులుగా నియమింప బడిన ప్రథమకవి ఆయనే కావడం విశేషం. నవ్వని పువ్వు" (1953) మొదలుకొని, %-% 'అలలెత్తే అడుగులు' (2013), నింగికెగిరే చెట్లు (2014) వరకు 18 ప్రక్రియలలో సుమారు 90 గ్రంథాలు రచించారు. మాకందా'లను అందించడంలో, వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో 'ప్ర'పంచ పదులను నిర్మించడంలో %-% తెలుగు గజళ్ళకు మానవీయ దృక్పథాన్ని అనుసంధించడంలో, ప్రతీకాత్మకంగా వచన కవితలో 'ఇతిహాస కావ్యాన్ని'%-%'విశ్వంభర'ను నిర్మించడంలో,'మట్టీ%-%మనిషీ%-%ఆకాశం' వంటి వచనకవితా 'కావ్యేతి హాసాన్ని' సంవిధాన సంపన్నంగా సృజించడంలో, 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' వంటి స్వీయ చలన చిత్ర గీతికా వ్యాఖ్యా రచనలో, ఋతువర్ణనలను జీవితానికి సమన్వయిస్తూ 'ఋతుచక్రం' వంటి కావ్యరచనలో, గేయ కావ్యాలకు పద్య కావ్య ప్రౌఢిని, ప్రామాణికతనూ సంతరించడంలో, శతశతాధిక నూతన పదబంధ కల్పనంలో మహాకవి సినారె ప్రయోగశీలం ప్రస్ఫుట మవుతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపన్యాసకులుగా ఉంటూనే, 1962లో ఎన్టీ రామారావు ఆహ్వానంపై చలనచిత్ర రంగంలో ప్రవేశించారు. తొలి సినీ గీతం %-% "నన్ను దోచుకొందువటే". 'గులేబకావళి కథ' చిత్రంలోని పాటలన్నీ ఆయన వ్రాసినవే. ఆనాటి 'గులేబకావళి కథ' చిత్రం నుండి ఇటీవలి 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు, మూడున్నర వేలకు పైగా సినిమా పాటలు రచించి, చలనచిత్ర జగత్తులో తమ ప్రత్యేక స్థానాన్ని భద్రపరచు కున్నారు. 'ఏకవీర', 'అక్బర్ సలీమ్ అనార్కలీ' అనే రెండు చిత్రాలకు సంభాషణలు కూడా రచించారు. తెలుగువారే కాక శంకర్ జైకిషన్, సి. రామచంద్ర, ఓ.పి. నయ్యర్, రవీంద్రజైన్, ఉషాఖన్నా, బప్పీలహరి %-% వంటి ప్రముఖ హిందీ సంగీత దర్శకులు 50 మందికి పైగా కలిసి పనిచేశారు. ఘంటసాల గళం నుండి సినారె గీతాలధికంగా జాలు వారాయి. మూగజీవులు, శభాష్ పాపన్న, మొగుడా పెళ్ళామా, తూర్పు పడమర చిత్రాలలో కావ్య సంబంధమైన పాత్రలలో ఆయన కనిపించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# అణుశక్తిని నాశనానికి కాదు, మానవాళి శ్రేయస్సుకు ఉపయుక్తంగా ఉండాలి - జూలై 29, 1957 ... అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఏర్పాటైన దినం


రెండో ప్రపంచ మహా యుద్ధం మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన పరిణామాలను మిగిల్చింది. 1945లో జపాన్ దేశంలోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా సంయుక్త రాష్ట్రాలు వేసిన అణు బాంబుల ధ్వంసం లక్షలాది మంది అమాయక ప్రజల ప్రాణాలను హరించడమే కాదు, అక్కడి జీవ వ్యవస్థను శాశ్వతంగా ప్రభావితం చేసింది. ఈ ఘోర ఘట్టాల తరువాత అణుశక్తి అనే పదానికి ప్రపంచ వ్యాప్తంగా ఒక భయానక భావం ఏర్పడింది. ఇదే సమయంలో అదే శక్తిని మానవాభివృద్ధికి శాంతియుతంగా వినియోగించ వచ్చని విశ్వాసంతో, 1953 డిసెంబరు 8న అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఐజెన్ హవర్ ఐక్యరాజ్య సమితి ప్రధాన సభలో "శాంతి కోసం అణుశక్తి" అనే ప్రసంగం ద్వారా ఒక అభూత పూర్వమైన ఆలోచనను ప్రపంచ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రసంగం ప్రభావంతో అనేక దేశాలు అణుశక్తిని నియంత్రితంగా, శ్రేయస్సుకు అనుకూలంగా వినియోగించాలనే సంకల్పాన్ని పొందాయి. దీని ఫలితంగా 1956లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 82 దేశాల ప్రతినిధులు సమావేశమై అంతర్జాతీయ స్థాయిలో ఒక అణుశక్తి సంస్థను ఏర్పరచాల్సిన అవసరాన్ని గుర్తించి దాని కోసం చట్టబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఈ చట్టం ప్రకారం 1957 జూలై 29న అనేక దేశాలు అంగీకార పత్రాలపై సంతకాలు చేయగా, అదే తేదీని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఆవిర్భావ దినంగా గుర్తించారు. ఆగస్టు 1, 1957న ఈ సంస్థ కార్యనిర్వాహకంగా తన విధులను ప్రారంభించింది. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం 178 దేశాలను సభ్యులుగా కలిగి ఉంది. అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేయాలనే సంకల్పంతో ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అణుశక్తి వినియోగంపై పర్యవేక్షణ, నియంత్రణ, సహకారం వంటి కర్తవ్యాలను నిర్వర్తిస్తోంది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అణుశక్తిని నాశనానికి కాదు, మానవాళి శ్రేయస్సుకు ఉపయుక్తంగా మలచడం. విద్యుత్ ఉత్పత్తి, వ్యాధి నివారణ, వ్యవసాయ పరిశోధన, నీటి శుద్ధి వంటి అనేక రంగాలలో అణుశక్తిని వినియోగించేందుకు మార్గదర్శకత్వం కల్పించడం సంస్థ ధ్యేయంగా ఉంది. ఈ లక్ష్యాల సాధనకు ప్రపంచం లోని అణుశక్తి కేంద్రాలపై తనిఖీలు నిర్వహించడం, భద్రతా ప్రమాణాలను రూపొందించడం, సాంకేతిక సహకారాన్ని అందించడం, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం వంటి




కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అణు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, ఆయుధాల తయారీని నిరోధించేందుకు సంస్థ నిరంతరంగా చర్యలు తీసుకుంటోంది. ఈ సంస్థ అణుశక్తిని శాంతికోసం వినియోగించే దిశగా చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2005లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఇది ఈ సంస్థతోపాటు అప్పటి ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఎల్ బరదైకి కూడా వరించింది. అణుశక్తి వ్యాప్తిని నిరోధించడంలో, శాంతియుత అవసరాలకు దాన్ని వినియోగించడంలో, ప్రపంచ దేశాల మధ్య నమ్మకాన్ని పెంపొందించడంలో చేసిన కృషికి ఇది ప్రశంసాపాత్రమైన గుర్తింపు. భారత దేశం ఈ సంస్థలో 1957 నుంచే సభ్య దేశంగా కొనసాగుతోంది. భారత దేశానికి అణుశక్తి రంగంలో విశేష అనుభవం, స్వావలంబన ఉన్నప్పటికీ, అణుశక్తి వ్యాప్తిని నిరోధించే ఒప్పందంపై అభ్యంతరాలు ఉన్నందున దాని పక్కన నిలిచి, ఐఎఇఏతో సాంకేతిక, శాస్త్రీయ పరంగా సహకార బంధం కొనసాగిస్తూ ఉంది. 2008లో భారత దేశం అమెరికాతో శాంతియుత అణుశక్తి ఒప్పందం చేసుకున్న సందర్భంగా, ఐఎఇఏతో ప్రత్యేక పర్యవేక్షణ ఒప్పందానికి అంగీకరించింది. దీని ప్రకారం భారత దేశంలోని కొన్ని అణుశక్తి కేంద్రాలు ఈ సంస్థ పర్యవేక్షణకు లోబడి ఉన్నాయి. భారత దేశంలో ప్రస్తుతం 22 అణు విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని కేంద్రాలు అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉన్నాయి. భారత అణుశక్తి శాఖ, భాభా అణు పరిశోధన సంస్థ, అణు విద్యుత్ సంస్థ, అంతరిక్ష పరిశోధన సంస్థ తదితర శాస్త్రీయ సంస్థలు ఐఎఇఏ సహకారంతో అనేక అంతర్జాతీయ పరిశోధన కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలో విత్తనాల అభివృద్ధి, కీటక నాశక పరిశోధనలు, నీటి పరిశుద్ధత విశ్లేషణ, వ్యాధి నిర్ధారణ పరికరాలు, క్యాన్సర్ చికిత్సల్లో న్యూక్లియర్ వైద్యం వంటివి ఈ సంస్థ సహకారంతో భారత దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు పదిశాతం వరకు అణుశక్తిపై ఆధార పడుతున్నది. శుద్ధమైన, కాలుష్య రహిత శక్తి మూలంగా అణు శక్తికి ప్రాధాన్యం పెరుగుతున్నది. కానీ, అణు ప్రమాదాల భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఐఎఇఏ భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేసింది. ఉక్రెయిన్‌లోని జాపొరిజ్యా అణుశక్తి కేంద్రంపై యుద్ధ భయాలు నెలకొన్న సందర్భంలో ఐఎఇఏ నేరుగా తన పరిశీలకులను పంపించి భద్రతా నివేదికలు అందజేయడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నమ్మకాన్ని ఏర్పరిచింది. ఇరాన్ అణుశక్తి ఒప్పందం, ఉత్తర కొరియా అణు పరీక్షలపై పర్యవేక్షణ వంటి వ్యవహారాలలో కూడా సంస్థ తన పాత్రను బలంగా నిలబెట్టుకుంది. 1957 జూలై 29న స్థాపితమైన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నేడు శాంతికోసం శాస్త్రీయంగా, నియంత్రితంగా అణుశక్తిని వినియోగించే దిశగా విశ్వ వ్యాప్తంగా మార్గనిర్దేశకంగా నిలుస్తోంది. శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించాలన్న సంకల్పాన్ని నెరవేర్చే దిశగా వ్యవహరించిన ఈ సంస్థ అణుశక్తికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. నాశనానికి మార్గమైంది అన్న నెగిటివ్ అభిప్రాయాన్ని తొలగించి, శాంతి కోసం వినియోగించే శక్తిగా అణుశక్తిని మలచ గలమని ప్రపంచానికి చాటి చెప్పింది. శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవ సంక్షేమానికి ఉపయోగించే దిశగా ఐఎఇఏ చేస్తున్న కృషి అభినందనీయం. భవిష్యత్ తరం అవసరాల కోసం భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, జాగ్రత్తగా అణుశక్తిని వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ ఐఎఇఏ మానవాళికి సుస్థిర అభివృద్ధి దిశగా వెలుగు చూపుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "సర్ప పూజకు ఉద్దిష్ఠమైనది నాగ పంచమి"



శ్రావణ శుక్ల పక్ష పంచ మిని "నాగ పంచమి" లేదా "నాగుల పంచమి"గా పిలుస్తారు. ఇది సర్పపూజ ఉద్దిష్టమైన దినం. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెబుతున్నది. కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగరాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వార మని ప్రకటించుకునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు అనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులు నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని, బౌద్ధ వాఙ్మయంలో అనేక గాథలు తెలుపుతున్నాయి. ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. శివుడు పార్వతికి నాగ పంచమి పర్వాన్ని గురించి చెప్పినట్లు పురాణ కథనం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళి కట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజ, నాగిమల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్పరూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావ నిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాలలో పేర్కొనగా, యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లు, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన బిడ్డలు చనిపోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధించడం ఆచారంగా ఉంది. ఆదినుండీ ఆంధ్రులు నాగారాధకులుగా ఉన్నారు. ఆది శేషుడు భూభారాన్ని నిర్వహించడానికి, తమకు సేవ చేయడాన్ని మెచ్చిన విష్ణుమూర్తి, వరం కోరుకొమ్మనగా, తనను పంచమినాడు పూజించే వరమీయమని శేషుడు కోరుకున్నట్లు, విష్ణువు అట్లే వరమిచ్చి, పంచమి నాటి పూజ వల్ల సర్ప భయముండనట్లు వరమిచ్చినట్లు పురాణాధారం. పర్వదినం నాడు ఇంటి గడపలకు ఇరు పక్కలా గోమయంతో నాగుల మూర్తులు ప్రతిష్ఠించి, 12ఏళ్ళు విడవకుండా వ్రతాన్ని ఆచరిస్తే గొప్ప పుణ్యం. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టితోనైనా చేసి పూజించడం ఆహారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటిగా ఉంది. నాగపంచమినాడు బతికి ఉన్న పామును చూస్తే ఆ దృష్టమని భక్తుల విశ్వాసం. అనంత, వాసుకి, శేష, పద్మనాభ, కంబల, కర్ణాటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒకొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. తమిళులు శ్రావణ శుద్ధ పంచమి నాడే నాగపూజలు చేస్తారు. కాశీలో శేషుని అవతారంగా భావించే పతంజలిని ఈరోజే పూజి స్తారు. వంగదేశంలో నాగరాజైన వాసుకి సోదరి 'మనసా దేవి' లేదా 'విష హరి' పూజ జరుగుతుంది. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తి గ్రీకు భాషలో "స్పీరిమా" అంటారు. స్పీరియా అంటే సర్పవలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవజూపడమే నాగపూజ ప్రధానోద్దేశమని విజ్ఞుల భావన.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఖాళీ ప్లాట్లు.. ప్రజలకు పాట్లు

సిరిసిల్ల : ఖాళీ ప్లాట్లు ఎక్కువుంటే అక్కడ పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీటితో దుర్వాసనమిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. అటు ప్లాట్ల యజమానులు పట్టించుకోక, ఇటు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టక ఖాళీ ప్లాట్ల చుట్టుపక్కల ఉండే ఇళ్ల యజమానులు పాట్లు పడుతున్నారు.

**కొనుగోలు చేసి.. నిర్లక్ష్యంగా వదిలి**

సిరిసిల్ల జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరగడంతో ఆర్థికంగా ఉన్న వారు ప్లాట్లు కొనుగోలు చేశారు. కొందరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచుతుండగా పిచ్చి మొక్కలు పెరిగి, చెత్తాచెదారంతో నిండి దర్వాసనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. యజమానులు నీరు నిల్వకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా మట్టి నింపి చదును చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు ఖాళీ ప్లాట్ల యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి మధ్య నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.



**విష కీటకాల సంచారం**

జనావాసాల మధ్య ఖాళీ ప్లాట్లు ఉండటంతో వాటికి ఆనుకొని ఉన్న ఇళ్లలోకి విష కీటకాలు వస్తున్నాయి. చెట్లు ఏపుగా పెరిగి, వర్షాకాలం కావడంతో చిత్తడిగా మారుతున్నాయి. పాములు, తేళ్లు, తదితర విష కీటకాలు ఇళ్లలోకి వస్తుండగా వాటి కాటుకు గురవుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఖాళీ ప్లాట్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

**పట్టించుకోవడం లేదు**

మా ఇంటి చుట్టూ ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వాన నీరు నిల్వ ఉంటోంది. పాములు, తేళ్లు వస్తున్నాయి. ఇంతకుముందు మా ఇంట్లో ఒకరు పాము కాటుకు గురయ్యారు. ప్లాట్ల యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు.
పోరండ్ల సాయి, అంబికానగర్, సిరిసిల్ల

# భగీరథ.. లీకేజీల వ్యథ

మెట్‌పల్లి: జిల్లాలో ఇంటింటికీ శుద్ధజలం అందించేందుకు మిషన్ భగీరథ పథకం కింద ఇబ్రహీంపట్నంలోని డబ్బా వద్ద ప్రధాన నీటి శుద్ధికేంద్రం నిర్మించారు. ఇక్కడి నుంచి ఐదు పురపాలికలతోపాటు 347 ఆవాస ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డబ్బాకు నీటిని తరలించేందుకు జలాల్‌పూర్ వద్ద ఇన్‌టెక్ వెల్ ఏర్పాటు చేసి ఆరు పంపులను అమర్చారు. అక్కడి నుంచి శుద్ధి కేంద్రానికి 92 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఒక్కొక్కరికి 135 లీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో వంద లీటర్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే మోటార్ల మొరాయింపుతో ఇబ్బందులు ఏర్పడితే.. మరోవైపు తరచూ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడుతుండటంతో నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

**నీటి కలుషితంపై ఆవేదన**

జిల్లాలో ప్రధాన పైప్‌లైన్ సుమారు 1276 కిలోమీటర్లు ఉంటుంది. ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట నుంచి మెట్‌పల్లి పట్టణం మధ్యలో ప్రధాన పైప్‌లైన్ తరచూ లీకేజీకి గురవుతుంది. వివిధ ప్రాంతాల్లో లీకేజీలు గుర్తిస్తున్నా.. ప్రధానంగా వెంకట్రావుపేట సమీపంలోని ఎక్కువసార్లు లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో నీరు కలుషితమయ్యే అవకాశాలున్నాయని, అప్పుడప్పుడు రంగు మారిన నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

**హెచ్చుతగ్గులే కారణమా?**

ప్రధాన పైప్‌లైన్ లీకేజీకి సాంకేతికంగా హెచ్చుతగ్గులే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. డబ్బా నుంచి ధర్మపురి వరకు నీటిని



చేర్చాల్సి ఉండగా.. గ్రిడ్ సమీపంలో నీటి ఒత్తిడి ఎక్కువగా ఉండటమే తరచూ నాలుగైదు కిలోమీటర్ల మధ్య పైప్‌లైన్ లీకేజీకి కారణమని అంచనా వేస్తున్నారు. ఎక్కడైనా నీరు అవసరం లేదని గేట్‌వాల్వ్ మూసివేస్తే పైప్‌లైన్లో నీరంతా వెనక్కి రావడం మరో కారణంగా భావిస్తున్నారు. లీకేజీ ఏర్పడిన సమయంలో మరమ్మతుల కోసం మూడు లేదా నాలుగు రోజులు జిల్లాకు నీటి సరఫరాను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

**పథకం వివరాలిలా..**

డబ్బా గ్రిడ్ సామర్థ్యం: 145 ఎంఎల్‌డీ(2048 జనాభా అంచనాతో)
ప్రస్తుత జనాభాకు అవసరమున్న నీరు: 101 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ ఫర్ డే)
గ్రిడ్‌కు సరఫరా అవుతుంది: 92 నుంచి 102 ఎంఎల్‌డీ
ప్రధాన పైప్‌లైన్ దూరం: 1276 కిలోమీటర్లు

# పరిశ్రమల ఏర్పాటు.. ప్రగతికి తోడ్పాటు



వికారాబాద్ : దేశంలో సూక్ష్మ ఆహార శుద్ధి సంస్థల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి, పరిశ్రమల క్రమబద్ధీకరణ' (పీఎంఎఫ్‌ఎంఈ) పథకాన్ని ప్రారంభించాయి. దీని ద్వారా ఆహార శుద్ధి రంగంలో సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించడం, ఆధునికీకరించడంతో పాటు బలోపేతం చేయనున్నారు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించి, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించనున్నారు. ఇందులో భాగంగానే వ్యక్తిగత, స్వయం సహాయక బృందాలకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందజేస్తారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 71 యూనిట్ల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2021 పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 135 దరఖాస్తులు రాగా 100 యూనిట్లు ప్రారంభించారు. మిగిలిన యూనిట్లు పరిశీలనలో ఉన్నాయి.

**వ్యక్తిగతంగా..:** ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం రాయితీ ఉంటుంది. ఇందులో 10 శాతం లబ్ధిదారు చెల్లిస్తే మిగతా 90 శాతం బ్యాంకు రుణంగా అందజేస్తుంది. వ్యాపార పరిశ్రమ రంగంలో ప్రవేశించే వారు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సాంకేతిక శిక్షణతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు సహకారం అందిస్తారు. ఎంపిక చేసిన వారికి వరంగల్, జగిత్యాలలో శిక్షణ ఉంటుంది. లబ్ధిదారు గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రాయితీ పొందవచ్చు. వీరు వంటనూనెలు, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు, పండ్ల జామ్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**సంఘాలు ముందుకు వస్తే..**

సంఘాలు యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం రాయితీ ఇస్తారు. గరిష్ఠ రాయితీ రూ.3 కోట్లు వరకు ఉంటుంది. పెట్టుబడి పరిమితి రూ.10 కోట్ల లోపు ఉండాలి. స్వయం సహాయక బృందాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, కోఆపరేటివ్ సొసైటీలు, ప్రభుత్వ ఏజెన్సీలు ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పెట్టుబడికి అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటు చేసుకోవచ్చు.

**ఇలా దరఖాస్తు చేసుకోవాలి**

ఆధార్, పాన్ కార్డు యూనిట్ చిరునామా, ధ్రువీకరించే పత్రాలు, యూనిట్ నిర్వహించే భవనం యజమాని ధ్రువీకరణ, ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్ సంబంధిత వెబ్‌సైట్ పీఎంఎఫ్‌ఎంఇ.ఎంఒఎఫ్‌పీఐ.జీవోవీ.ఇన్/పీఎంఎఫ్‌ఎంఈలో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థి 8వ తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాల నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.

**యువతకు మంచి అవకాశం** యువత ఉపాధికి ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుంది. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు ఎన్నో వనరులున్నాయి. ఇతర వివరాలకు కలెక్టరేట్ కార్యాలయంలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు. – నవీన్‌కుమార్, మేనేజర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

# మందలిస్తేనే గుడ్డు!



తాండూరు : విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నాణ్యమైన భోజనంతోపాటు, గుడ్డు అందించాలి. అయితే బిల్లు బకాయిలున్నాయని గుడ్డు ఇవ్వడంలేదు. ఈ విషయాన్ని అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. సర్కారు బడుల్లో పిల్లలకు ప్రతిరోజూ ఉచితంగా మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి చిన్నారులకు ప్రతిరోజూ అందించాల్సిన మెనూను రూపొందించారు. ఈ క్రమంలో సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డు ఇవ్వాలని ఖరారు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధానోపాధ్యాయులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాండూరు మండలం చెంగోల్‌పూర్‌లో కొన్నిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినా మార్పు రాలేదు. చివరకు విద్యార్థులకు వెళ్లి మందలిస్తేనే అప్పటికప్పుడు తెప్పించి వడ్డించారు. కరన్‌కోట పాఠశాలలోనూ ఇవ్వడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వెల్లడించారు. చాలా పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి. ఏజెన్సీలకు గతంలో ఒక్కో గుడ్డుకు రూ.5 చొప్పున చెల్లించారు. గిట్టుబాటు కావడంలేదని పేర్కొనడంతో ఏప్రిల్ నుంచి రూ.6కు పెంచారు.

**పర్యవేక్షించాలని సూచించాం**

కొన్నిబడుల్లో గుడ్డు ఇవ్వడంలేదని మా దృష్టికి వచ్చింది. మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు రోజులు విద్యార్థులకు గుడ్డు అందించాలని ఏజెన్సీలను ఆదేశించాం. పర్యవేక్షణ చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. బిల్లు బకాయిలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే వారి ఖాతాల్లో జమ చేయిస్తాం.
– వెంకటయ్య, విద్యాధికారి, తాండూరు.

**ఏడు నెలలుగా బిల్లులు రాక**

ఒకటో తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోంది. 9, 10 తరగతుల భోజన ఖర్చులను రాష్ట్ర సర్కారు చెల్లిస్తోంది. అయితే గతేడాది డిసెంబరు నుంచి గుడ్లకు సంబంధించి బిల్లులను బకాయి ఉంచాయి. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఏజెన్సీ సిబ్బంది గుడ్డు వడ్డించేందుకు ఆసక్తి చూపడం లేదు. విద్యార్థులు పోషకాలను కోల్పోతున్నారు.
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: 1,066
విద్యార్థులు: 70వేలు
బకాయిలు: రూ.3.50 కోట్లకు పైగా

# వేంకటేశ్వరుడి ఆశీస్సులు అందేదెన్నడో!



కరీంనగర్ : కరీంనగర్‌లో తిరిదే వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసినా.. రెండేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ ప్రతిపాదన మేరకు పద్మానగర్‌లో 10 ఎకరాల స్థలం వేంకటేశ్వర స్వామి దేవాలయంకు కేటాయించారు. 31 మే 2023న అప్పటి తిటిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, పూజారులు, ఇతరత్రా అధికారులు వచ్చి భూమి పూజ నిర్వహించారు. అయితే రెండేళ్లు గడుస్తున్నా.. ఇంకా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరంలాంటి ఆలయాలతో ఎంతో ఖ్యాతి ఉంది. జిల్లా విభజన తర్వాత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక క్షేత్రం లేదన్న లోటు ఏర్పడింది. దీంతో కరీంనగర్ జిల్లా ఖ్యాతి పెరిగేలా ఇక్కడ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరిగితే ఆధ్యాత్మిక పర్యాటక రంగంగా ఎదుగుతుందని భావించారు. ఈ దేవాలయ నిర్మాణానికి రూ.20 కోట్లు సైతం మంజూరు చేశారు. నిర్మాణం, పూజలు, కైంకర్యాలు, ప్రసాదాలు తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించనున్నారు. **అన్ని పార్టీల నాయకుల ఒత్తిడి**
కరీంనగర్‌కు మంజూరైన తిటిదే వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పనులు చేపట్టాలని ఏడాది కిందట మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆలయ ఛైర్మన్ బి.ఆర్.నాయుడును కలిసి కోరారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇప్పటికే లేఖలతోపాటు స్వయంగా తిటిదే ఛైర్మన్‌ను కలిసి ఆలయ నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. ఇటీవల తిరుపతిని దర్శించుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తిటిదే ఆలయ ఛైర్మన్‌ను కలిసి కరీంనగర్ దేవాలయం నిర్మాణంపై చర్చించడంతోపాటు ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయం, ధర్మపురి ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తిరుమలకు వెళ్లినప్పుడు ఛైర్మన్‌ను కలిసి పనులు ప్రారంభించాలని కోరారు.

# రాయితీ.. ఇంకా రాలేదేమి?

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తోంది. అయితే కొద్ది నెలలుగా రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమకావడం లేదు. లబ్ధిదారుడికి సిలిండర్ అందిన తరువాత రూ.500 కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని ప్రభుత్వం సంబంధిత ఖాతాకు జమ చేయాల్సి ఉండగా.. జాప్యమవుతోంది.

**ధర రూ.915, రాయితీ రూ.415** ప్రస్తుతం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.915గా ఉండగా.. ఇందులో రూ.415 రాయితీ రూపంలో లబ్ధిదారుల ఖాతాలో జమ కావాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న రాయితీ రూ.40.71 సిలిండర్ తీసుకున్న రోజే జమ అవుతోంది. దీనిపై ప్రజాపాలన కేంద్రాల్లోనూ ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. మొదట్లో రాయితీ డబ్బులు జమ చేసినా, ఆరు నెలలుగా నిలిచిపోయిందని వాపోతు న్నారు.

**అర్హత ఉన్నా నమోదు కాలే..**

ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వంటగ్యాస్ కనెక్షన్ నంబర్ వివరాలు జత చేసినా చాలామంది పేర్లు నమోదు కాలేదు. దీంతో అర్హులు రాయితీ కోల్పోతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు తక్కువ సమయం ఇవ్వడంతో ఆపరేటర్లు పూర్తిస్థాయి వివరాలు నమోదు చేయకపోవడంతో అర్హుల పాలిట శాపంగా మారింది. ప్రత్యేక హెల్ప్ డెస్కును ఏర్పాటు చేయడం, ప్రజాపాలన దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం, కొత్త రేషన్ దారులకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తే సమస్యలు తీరనున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ రాయితీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమవుతుంది. నెలనెలా ఎంతమందికి జమవుతుందన్న సమాచారం తమకు రావడంలేదు. మార్చి నెలాఖరు వరకు జమ చేసినట్లు తెలిసింది. రాయితీ సర్దుబాటులో ఆధార్, బ్యాంకు ఖాతాలను సరి చూసుకోవాలి. ఇబ్బందులుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. – జితేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి
జిల్లా వివరాలు మహాలక్ష్మి లబ్ధిదారులు: 7.96 లక్షలు గ్యాస్ ఏజెన్సీలు: 12
ఇప్పటివరకు జమ అయిన సొమ్ము రూ.23.74 లక్షలు

# మీరు కొనే ఉక్కు గట్టిదేనా?

ఆత్మకూరు :సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. నిర్మాణం పటిష్ఠంగా, నాణ్యతగా ఉండాలని ఆలోచిస్తారు. గ్రామాల్లోనూ ఇటీవల ఇళ్ల నిర్మాణ పనులను బిల్డర్లకు అప్పగించి పనులు పూర్తయ్యాక గృహప్రవేశాలు చేస్తున్నారు. పలు ఇళ్లు కొద్ది నెలలకే ఇంటి నిర్మాణ లోపాలు బయటపడుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణం పది కాలాలపాటు చెక్కు చెదరకుండా ఉండాలంటే నాణ్యమైన స్టీల్ వాడాల్సిందే. ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ప్రతి గ్రామంలో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పటిష్ఠమైన ఇళ్ల నిర్మాణాలకు నాణ్యమైన స్టీల్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు సూచనలు ఇవీ..
నాణ్యమైన స్టీల్ బార్ల ఉపరితలం నునుపుగా, పగుళ్లు, అతుకులు, తుప్పు లేకుండా బూడిద రంగులో ఉంటాయి.
ప్రతి స్టీల్ బార్‌పై తయారీ కంపెనీ పేరు, లోగో స్పష్టంగా ఉండాలి. ఐఎస్ఐ, బీఐఎస్ ముద్రలను గమనించాలి.
అన్ని చువ్వల పొడవు, బరువు, వ్యాసం ఒకే విధంగా ఉండాలి. ఒక స్టీల్ బార్ సాధారణంగా 11 నుంచి 12 మీటర్ల పొడవు ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఉంటే అది సరైంది కాదని గ్రహించాలి.
స్టీల్ బార్లపై రింగుల మాదిరిగా ఉండేవాటిని రిబ్స్ అంటారు. ఈ రిబ్స్ దగ్గర దగ్గరగా ఎత్తుగా ఉండాలి.
ఇనుప చువ్వలను 135 డిగ్రీల కోణంలో వంచినపుడు వంగిన ప్రదేశంలో పగుళ్లు రాకూడదు, 180 డిగ్రీలు వంచితే విరిగి పోకూడదు. నిర్మాణంలో ఇవి పాటించాలి..
ఇంటి నిర్మాణాల్లో 6 ఎంఎం నుంచి 25 ఎంఎం ఉన్న ఉక్కు చువ్వలను వినియోగిస్తారు. వంట గదిలో దిమ్మెల నిర్మాణాలకు 6 ఎంఎం బార్లు, స్లాబ్ నిర్మాణాలకు 8 నుంచి 10 ఎంఎం సీకులు, పునాదులు, కాలమ్స్, బీమ్‌లకు 12ఎంఎం, 16ఎంఎం, 20ఎంఎం, 25ఎంఎం ఉక్కు కడ్డీలను ఉపయోగించాలి.కాలమ్స్ స్టీల్ సీకులను చుట్టి ఉంచే చువ్వల కట్టింగులు 45 డిగ్రీలు వంగేలా చూసుకుంటే కాలమ్స్‌పై లోడ్ సమానంగా పడుతుంది.ఇంటి నిర్మాణానికి టీఎంటీ (థర్మో మెకానికల్ ట్రీట్) స్టీల్ కొనుగోలు చేస్తే ఎఫ్‌ఈ 500, ఎఫ్‌ఈ 550 గ్రేడ్‌లను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు.

# ఆయిల్‌పామ్‌లోకి వచ్చారు..!

రాజపేట: ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న అన్నదాతలకు మంచి రోజులు రానున్నాయి. రైతులకు ప్రభుత్వ పరంగా అందుతున్న రాయితీ కారణంగా సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. 2022 నుంచి జిల్లా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడం ప్రారంభించారు. మొక్కలు, బిందుసేద్య పరికరాలు ప్రభుత్వం రాయితీపై ఇవ్వడంతో చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులు అదనపు ఆదాయం కోసం ఈ తోటల్లో పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, శనగ, పెసర వంటి పంటలను కూడా వేసుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1071 మంది రైతులకు గాను 4,688 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును చేపట్టినట్లుగా అధికార వర్గాలు తెలిపాయి.
ఆయిల్‌పామ్ గెలలు విక్రయించే కార్యక్రమం ఇటీవల తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రారంభించారు. ఇవే కాకుండా రానున్న రోజుల్లో



వలిగొండ, చౌటుప్పల్, రామన్నపేట, ఆలేరు ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే యోచనలో ఉన్నట్లుగా ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఖాజా మొయినొద్దీన్ 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.

**అంతర పంటలకూ ప్రోత్సాహం..**

రాష్ట్ర వ్యాప్తంగా గత ఏప్రిల్ నుంచి ఆయిల్‌పామ్‌లో అంతర పంటల నమోదుకు వ్యవసాయ శాఖ పరంగా ఆన్‌లైన్‌లో నమోదుకు ప్రత్యేక ఐచ్ఛికాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఖరీఫ్ నుంచి ఆయిల్‌పామ్‌లో సాగు చేసిన అంతర పంట వివరాలను కూడా సంబంధిత శాఖ నమోదు చేయనున్నారు. దిగుబడిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనూ అనుమతి చేయడం చేయనున్నారు. దిగుబడిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనూ అనుమతి చేసేందుకు అవకాశం కల్పించడం విశేషం. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంటల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా సాగుపట్ల మరింత మంది ఆసక్తి చూపుతుండటం గమనార్హం.

# ఎన్టీపీసీ సౌజన్యం.. విద్యార్థినులకు సౌకర్యం

గోదావరిఖని : రామగుండం ఎన్టీపీసీ సౌజన్యంతో ఎస్సీ బాలికలకు వసతి సదుపాయం కలగనుంది. శిథిలావస్థలోనున్న ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహ నిర్మాణాన్ని ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా తీసుకొంది. రూ.2.7 కోట్లతో అత్యాధునిక వసతులతో రెండంతస్తుల్లో చేపట్టిన భవన నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. జిల్లా పాలనాధికారి చొరవతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణం పనులు చేపట్టగా చివరిదశకు చేరుకొన్నాయి.

వర్షం కురిసిందంటే చాలు భవనం పైకప్పు ఉరుస్తుండడంతో ఆవరణ జలాశయంగా మారేది. పైకప్పు పెచ్చులు ఊడి కిందపడుతుండేవి. ఓ గది గోడలకు విద్యుత్తు షాక్ వచ్చేది. దీంతో ఇక్కడికి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. క్రమక్రమేణ విద్యార్థినుల సంఖ్య పడిపోయింది. వసతి గృహ సంక్షేమాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన వరుణ వసతులు కల్పిస్తామంటూ తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థినుల సంఖ్యను పెంచేందుకు కృషి చేశారు. మరో వైపు శిథిల భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారుల ద్వారా జిల్లా పాలనాధికారి, ఎమ్మెల్యేను పలుమార్లు కలిసి కోరారు. శిథిల భవనాన్ని పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని కూల్చేయాల్సిందేనని, వసతి గృహంగా వినియోగించవద్దని తేల్చిచెప్పారు. 2016లో ఇక్కడి విద్యార్థినులను మంథనిలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి తరలించారు. గోదావరిఖని ఎస్సీ బాలికల వసతి గృహ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ 2019లో జిల్లా



పాలనాధికారి ఎన్టీపీసీ అధికారులకు లేఖలు రాశారు. దీనికి స్పందించిన వారు కేంద్ర కార్యాలయం ఆమోదంతో రూ. 2.7 కోట్లు కేటాయించారు. సుమారు రెండేళ్ల కిందట భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. భవనంలోని మొదటి అంతస్తులో వంట గది, భోజనశాల, అధ్యయన గది(రీడింగ్ రూమ్)లు, రెండో అంతస్తులో విద్యార్థినుల వసతి కోసం ప్రత్యేకంగా గదులు నిర్మిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి పీజీ స్థాయి వరకు విద్యార్థినులకు వసతి సదుపాయం కల్పించాల్సి ఉండగా ఉన్నత స్థాయి వరకు మాత్రమే ఇందులో ఉండేవారు. భవన నిర్మాణం పూర్తయితే పీజీ విద్యార్థినులకు వసతి సదుపాయం కలగనుంది.

# బాల్యం.. బలహీనం

పెద్దపల్లి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల వైద్య పరీక్షల్లో పలు వ్యాధులు సోకుతున్నట్లు బహిర్గతమైంది. పరిశుభ్రత పాటించకపోవడంతో చర్మ సంబంధ వ్యాధులతో సతమతం అవుతున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య(ఆర్బీఎస్కే) కార్యక్రమంలో గుర్తించారు. ఆహారంపై సరైన అవగాహన లేకపోవడం, జన్యుపరమైన సమస్యలతో తీవ్ర పోషకాహారలోపం, బరువు తక్కువ, వయసుకు తగ్గ ఎత్తు ఉండటం లేదని తెలుతోంది.జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్బీఎస్కే బృందాలు 0–6 ఏళ్లలోపు చిన్నారులను పరీక్షించారు. జిల్లావ్యాప్తంగా 18,331 బాలికలు, 17,382 బాలురు మొత్తం 35,713 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 967 మంది పిల్లలు పలు వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆరేళ్లలోపు పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు అందించినప్పటికీ పోషకాహారలోపం బారినపడటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్రాల్లో చిన్నారులకు భోజనం, ఉడికిన గుడ్లు ఇవ్వాల్సి ఉండగా చాలా చోట్ల ఇంటికి తీసుకెళ్తుండటంతో పిల్లలకు సరిగ్గా అందడం లేదు. కొన్ని చోట్ల భోజనం ఉడకడం లేదనే ఆరోపణలున్నాయి.

**కారణాలు ఇవీ..**

తల్లిదండ్రుల నిరక్షరాస్యత, సమతుల ఆహారం తీసుకోకపోవడం.

జన్యుపరమైన సమస్యలతో పుట్టుకతో వ్యాధులు సోకడం.

అప్పుడే పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించకపోవడం. చిన్నారులకు ఉదయం వేళ సూర్యరశ్మి తగిలేలా జాగ్రత్తలు తీసుకోకపోవడం. డి విటమిన్‌తో ఎముకల బలం, వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది.

**ఇలా చేస్తే ఆరోగ్యం**ఇంట్లో చిరుధాన్యాలతో చేసిన ఆహారం ఇవ్వాలి. బెల్లం, పల్లీలు, నువ్వులతో తయారు చేసిన వంటకాలను అందించాలి. పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, తాజా ఆకు కూరగాయల భోజనంతో తినిపించాలి.కాలానుగుణంగా లభించే పండ్లను తినిపించాలి.

# నిండుకుండల్లా జంట జలాశయాలు

హైదరాబాద్: నగరానికి తాగునీటిని అందించడమే కాకుండా పర్యావరణంలో కీలకంగా ఉన్న ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు వేగంగా నిండుతున్నాయి. ఇప్పటికే హిమాయత్‌సాగర్ నిండుకుండలా ఉండగా, ఉస్మాన్‌సాగర్‌లోకి భారీగా నీరు చేరుతోంది. చేవెళ్ల, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఈసీ నదిలో ప్రవాహం పెరగడంతో వారం రోజులుగా హిమాయ



త్‌సాగర్‌లోకి నీరు భారీగా చేరింది. గురువారం 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా తాజా వర్షాలతో మరింత పెరుగుతుందని జలమండలి అధికారులు అంచనా వేస్తున్నారు. వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో మూసీలో ప్రవాహం పెరిగి ఉస్మాన్‌సాగర్ నిండుతోంది. గత జులై 24వ తేదీ కంటే రెండు జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి రెండు జలాశయాలు రోజుకు 40 ఎంజీడీల తాగునీటిని అందిస్తాయి.

# చారిత్రక జలసిరి... కొత్తందాల వారధి



హైదరాబాద్: చారిత్రక మీరాలం చెరువుపై రూ.430 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో ప్రాజెక్టును చేపట్టేందుకు పురపాలకశాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి గురువారం పరిపాలన అనుమతి మంజూరు చేశారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఉత్తర్వులో పేర్కొన్నారు. అవసరమైన భూసేకరణ, టెండరు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ఐకానిక్ బ్రిడ్జి నమూనాను ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూ, వరంగల్ నిట్ వంటి ప్రముఖ సంస్థలకు చూపించి.. నిపుణుల ఆమోదం తీసుకున్నాక.. నిర్మాణ పనులు చేపట్టాలని పురపాలకశాఖ సూచించింది.

**చారిత్రక నేపథ్యం..**

మైలార్‌దేవ్‌పల్లి, హసన్‌నగర్, శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో కురిసే వర్షపునీటితో.. నగర దాహార్తిని తీర్చేందుకు.. మూడో నిజాం ఈ చెరువును నిర్మించారు. పనులు జులై, 1804లో మొదలై, 1806లో పూర్తయ్యాయి. నిజాం సంస్థానంలో దివాన్‌గా పని చేసిన మీర్ ఆలం బహదూర్ పేరును ఈ తటాకానికి పెట్టారు. అర్ధ చంద్రాకారంలో నిర్మాణమైన చెరువు కట్ట విశేషంగా ఆకట్టుకుంటుంది. చెరువు మధ్యలో మూడు దీవులుంటాయి. ఒకప్పుడు చెరువు 600 ఎకరాల్లో విస్తరించి ఉండేది. ప్రస్తుతం 450ఎకరాలకు పరిమితమైంది. అనంతరం చెరువు దిగువన జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు ప్రధాన ఆకర్షణలను ఐకానిక్ బ్రిడ్జితో అనుసంధానం చేసి.. పర్యాటకులను ఆకట్టుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. అందులో భాగంగా.. బెంగళూరు హైవే నుంచి చెరువు అవతలి వైపున ఉన్న చింతల్‌మెట్ ప్రాంతాన్ని కలుపుతూ వంతెనను నిర్మించనున్నారు.

**ఐకానిక్ బ్రిడ్జి ఇలా..**

పొడవు: 2.5 కి.మీవెడల్పు: 16.5 మీటర్లు (నాలుగు రోడ్లు, చివరన విశాలమైన కాలిబాట)ఎక్కడి నుంచి ఎక్కడికి..: చెరువుకు పశ్చిమాన ఉన్న చింతల్‌మెట్, తూర్పున శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు జాతీయ రహదారిని కలుపుతూ ఐకానిక్ వంతెన నిర్మాణం

ఎవరికి ప్రయోజనం..: చింతల్‌మెట్, కిషన్‌బాగ్, అత్తాపూర్, బహదూర్‌పుర, శాస్త్రిపురం ప్రాంతాల్లోని వాహనదారులకు, చింతల్‌మెట్ నుంచి బెంగళూరు జాతీయ రహదారి ద్వారా విమానాశ్రయం వెళ్లే వారికి ప్రయోజనం.

# భద్రత గాలికి.. పిల్లలు బయటికి



హైదరాబాద్: ఏప్రిల్ 2024: గాజులరామారంలోని స్టేట్ జువైనల్ హోం సిబ్బంది కళ్లుగప్పి 8 మంది బాలలు పారిపోయారు. మార్చి 2025: నింబోలి అడ్డాలోని బాలికల జువైనల్ హోం నుంచి ఇద్దరు పరారయ్యారు. జులై 2025: సైదాబాద్‌లోని జువైనల్ హోంలో ఒకేసారి ఐదుగురు పారిపోయారు.

వీధిబాలలు, అనాథలు, బాల నేరస్థులకు ఆశ్రయం కల్పించే జువైనల్ హోంల నిర్వహణ నగరంలో మొక్కుబడిగా మారింది. చిన్నారులు పారిపోతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా అధికారులు గుణపాఠం నేర్వడం లేదు. దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. సైదాబాద్‌లోని జువైనల్ హోం నుంచి ఒకేసారి ఐదుగురు పారిపోవటం భద్రతా లోపాల్ని ఎత్తిచూపుతోంది.

మూడుచోట్లా అంతే.. నగరంలో మూడు ప్రాంతాల్లో జువైనల్ హోంలు ఉన్నాయి. నింబోలి అడ్డాలో బాలికల జువైనల్ హోం (వీధి బాలలు, నేరారోపణ, దోషులకు) ఉంది. సైదాబాద్‌లో చిల్డ్రన్ హోం (వీధి బాలలు, ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లో పట్టుబడిన చిన్నారులకు), అబ్జర్వేషన్ హోం(వివిధ నేరాల్లో నిందితుల కోసం) ఉన్నాయి. 18 ఏళ్లలోపు చిన్నారులు నేరాలు చేసి.. దోషిగా నిరూపితమైతే గాజులరామారంలోని ప్రత్యేక జువైనల్ హోంకు తరలిస్తారు. ఈ గృహాల్లో భద్రత గాల్లో దీపంలా తయారైంది. పిల్లల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. సిబ్బందిలో ఎవరైనా సెలవు పెడితే మిగిలిన కొద్దిమందే చిన్నారుల్ని పర్యవేక్షించాల్సిన పరిస్థితి. సైదాబాద్ జువైనల్ హోం నుంచి ఐదుగురు తప్పించుకోవడానికి ఇదే కారణమైంది. బోనాల సందర్భంగా ఒకరు సెలవు పెట్టగా.. విధుల్లో ముగ్గురే ఉన్నారు. దీన్నే అవకాశంగా తీసుకుని పిల్లలు పారిపోయారు.

**తీరని సమస్యలు..**

బాలికల సంరక్షణ కేంద్రంలో 70 మంది ఆశ్రయం పొందుతున్నారు. 33 మంది సిబ్బంది అవసరం కాగా 16 మందే ఉన్నారు. షిఫ్టుల విధానంతో కొన్నిసార్లు 4–5 మందే ఉంటున్నారు. ఇది తప్పించుకోవడానికి అవకాశంగా మారుతోంది.

చిల్డ్రన్ హోంలో 104 మంది బాలలు ఉన్నారు. ప్రస్తుతం ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుండటంతో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంది. 16 మంది సిబ్బంది అవసరం కాగా 12 మందే ఉన్నారు.

సైదాబాద్ అబ్జర్వేషన్ హోంలో 95 మంది బాలలున్నారు. ప్రస్తుతం 12 మంది సిబ్బంది ఉన్నా.. ఒక్కో షిఫ్టులో నలుగురు ఉంటున్నారు. ఈ బాలలంతా నేరారోపణలు ఎదుర్కొంటున్నవారే.

గాజులరామారంలోని ప్రత్యేక హోంలో 26 పిల్లలు ఉన్నారు. 14 మంది సిబ్బందికి గాను 12 మందే ఉన్నారు.

# ఆకట్టుకునే జలపాతం.. రోడ్డేమో బురదమయం



సైదాపూర్ : జిల్లాలోని రాయికల్ జలపాతానికి వెళ్లటానికి సరైన రోడ్డు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి సుమారు 5కిలోమీటర్ల దూరంలో ఎత్తైన గుట్టల మీద నుంచి జలధారలు జాలువారుతూ ఏటా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. విశాలమైన గొలుసుకట్టు గుట్టల మధ్య ప్రకృతి రమణీయత ఉట్టిపడే విధంగా జలపాతం కనువిందు చేస్తోంది. చుట్టూ గుట్టలు, పచ్చని పొలాలు, పక్కన మోహిన్‌చెరువు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఉత్సాహంగా గడుపుతారు. వారాంతంలో పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉంటుంది. అయితే గ్రామం నుంచి జలపాతం వరకు సుమారు 5 కిమీల మేర బురదరోడ్డే దిక్కు కావటంతో కాలు తీసి కాలు వేయలేని దుస్థితి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది.

**రూ.8.75 కోట్లు మంజూరు.. ప్రారంభం కాని పనులు**

జలపాతం అభివృద్ధికి ప్రభుత్వం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలల క్రితం చెప్పారు. ఈనెల 27న జలపాతం సందర్శించి ఏయే పనులు చేపట్టనున్నారో ప్రకటించనున్నారు. గ్రామం నుంచి జలపాతం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, రహదారికి ఇరువైపులా చెట్లు పెంచటం, పర్యాటకులు సేద తీరేందుకు విశ్రాంతి గదులు, పచ్చిక బయళ్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్ తదితర వసతుల కల్పనకు అటవీ, పర్యాటక శాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. అయితే నిధులు మంజూరు కాగా.. టెండర్లు ఇంకా పూర్తి కాలేదు. దీంతో ఈ ఏడాది సైతం సందర్శకులు జలపాతానికి బురద రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోంది.

**మందుబాబులకు అడ్డాగా..**జలపాతం వద్దకు వస్తున్న యువకులు పరిసరాల్లో మద్యం తాగుతుండటంతో పర్యాటకులకు ఇబ్బందికరంగా ఉంది. మందు బాటిళ్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విచ్చలవిడిగా పడేస్తూ పర్యావరణానికి హానీ కలిగిస్తున్నారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు జలపాతం పరిసరాలను మద్యపాన నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు.

# బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

గోదావరిఖని : రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రామగుండం ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో గురువారం ఒక్క షిఫ్టు కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బుధవారం నుంచి కురుస్తున్న వర్షంతో ఉపరితల గనుల క్వారీలన్నీ బురదమయంగా మారాయి. కోల్‌బెంచ్‌ల్లోకి వరద నీరు చేరడంతో బ్లాస్టింగ్ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన పనులు ముందుకు సాగలేదు.

సింగరేణి వ్యాప్తంగా 18 ఉపరితల గనులుండగా రామగుండం ప్రాంతంలో నాలుగు ఉన్నాయి. సుమారు 5 వేల మంది ఉద్యోగులు పనిచేసే నాలుగు ఉపరితల గనుల్లో రోజుకు 70 వేల టన్నుల బొగ్గు వెలికి తీస్తారు. పూర్తిస్థాయిలో పనులు నడిస్తే ఒక్కోసారి లక్ష టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి చేపడతారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నిలిచిపోయిన పనులను తిరిగి పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. క్వారీలకు వెళ్లే మార్గాల్లో పేరుకుపోయిన బురదను తొలగించడంతో పాటు



క్వారీల్లోకి చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేస్తున్నారు. రోజంతా కురిసిన వర్షంతో ఉద్యోగులకు ఎలాంటి పనులు కేటాయించలేకపోయారు. దీంతో ఇటు కార్మికులు, అటు యంత్రాలు ఖాళీగానే ఉండాల్సి వచ్చింది. సాధ్యమైనంత తొందరగా పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. కనీసం ఒక షిఫ్టును నడిపించేందుకు యంత్రాలు, ఉద్యోగులను సిద్ధం చేస్తున్నారు.

**లక్ష్యంపై ప్రభావం** వారం రోజుల్లో నాలుగు రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడటంతో నెలవారీ ఉత్పత్తి లక్ష్యంపై ప్రభావం పడనుంది. బొగ్గు ఉత్పత్తి తక్కువగా చేపట్టడం వల్ల భవిష్యత్తులో వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా మారే అవకాశం ఉంది. సింగరేణి సంస్థ రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం గడిచిన వారం రోజుల్లో నాలుగు రోజులు బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. అంటే సుమారు 6 లక్షల వరకు బొగ్గు ఉత్పత్తి నష్టపోయింది. దీంతో రానున్న కాలంలో ఈ ప్రభావం కంపెనీ వార్షిక లక్ష్యంపై పడే అవకాశం ఉంది.

# ‘హ్యామ్’ రోడ్లపై.. సాఫీగా ప్రయాణం

కొత్తగూడెం : రహదారుల ఉన్నతీకరణకు రంగం సిద్ధమవుతోంది. రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టే హ్యామ్(హైబ్రి డ్ యాన్యుటీ మోడల్) రోడ్ల టెండర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని రోడ్లను మొదటి విడతలో 17 ప్యాకేజీలుగా (ఆర్అండ్‌బీ సర్కిళ్లు) గుర్తించగా.. అందులో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలను రెండు ప్యాకేజీలుగా మార్చింది. వీటి పరిధిలో 648.29 కి.మీ. మేర హ్యామ్ విధానంలో రహదారులను ఉన్నతీకరించాలని స్పష్టం చేసింది. ఇందులో ట్రాఫిక్ అధికంగా ఉండి.. ప్రధాన పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లే రోడ్లను చేర్చింది.

**45 రోడ్లు, 648.29 కి.మీ., రూ.849.88కోట్లు**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ప్యాకేజీల్లో మొత్తం 45రోడ్ల పనులను రూ.849.88కోట్లతో చేపట్టాలని నిర్ణయించింది. ఖమ్మం ప్యాకేజీ పరిధిలో 35రోడ్లు, 382.29కి.మీ. మేర రహదారులను రూ.468.98కోట్లతో.. భద్రాద్రి ప్యాకేజీ పరిధిలోని పది రోడ్లు, 266 కి.మీ. మేర రహదారులను రూ.380.90కోట్లతో ఉన్నతీకరించనుంది. ఉభయ జిల్లాల్లోని కొన్ని రెండు వరుసల రోడ్లను నాలుగు వరుసలుగా, ఇంకొన్ని ఒక వరుస రోడ్లను రెండు వరుసల రహదారులుగా మార్చనుంది. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**వాహనదారులకు తప్పనున్న ఇక్కట్లు**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్ని రహదారులు అస్తవ్యస్తంగా మారటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సారపాక–ఏటూరునాగారం, భద్రాచలం–చర్ల, పాల్వంచ–దమ్మపేట, కొత్తగూడెం–తల్లాడ, అనిశెట్టిపల్లి–ఆళ్లపల్లి రహదారులు కొన్నేళ్లుగా మరమ్మతులు, విస్తరణకు నోచుకోవటం లేదు. ఈ రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఖమ్మం జిల్లాలో ఇల్లెందు–ఖమ్మం, బోనకల్లు–ఖమ్మం, రాయపట్నం–మోటమర్రి రైల్వేస్టేషన్ రోడ్డు, వైరా–జగ్గయ్యపేట, ఖమ్మం–వైరా, నేలకొండపల్లి–పాలేరు, కొత్తకొత్తూరు–వల్లభి, నేలకొండపల్లి–గాంధారి, కల్లూరు–వట్యూరు, మిట్టపల్లి–పెద్దకోరుకొండి, మార్లపాడు–పార్వతీపురం తదితర రోడ్లపై ప్రయాణం వాహనదారులకు సవాలుగానే మారుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ రహదారులు మెరుగుపడనున్నాయి.

రహదారుల ఉన్నతీకరణకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ ప్రక్రియ చేపట్టింది. భద్రాద్రి జిల్లాలో 266కి.మీ. మేర పది రహదారులు బలోపేతం కానున్నాయి. రాష్ట్రస్థాయిలో టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు మొదలవుతాయి. – వెంకటేశ్వరరావు, ఈఈ, ఆర్అండ్‌బీ, కొత్తగూడెం

# అంతర్జాలంలో రేషన్‌కార్డు వివరాలు ఇలా తెలుసుకోండి

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వీటన్నింటికీ తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి కావటంతో అవి లేని ఎంతోమంది నిరుపేదలు గతంలో అనర్హులుగా మిగిలారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్ కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. అర్హత ఉండి కార్డు లేనివారు, పాత రేషన్‌కార్డులోని పేర్ల తొలగింపు, మార్పులు చేర్పుల కోసం లబ్ధిదారులు సమీపం లోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక మాత్రం కార్డు మంజూరైందో? లేదో తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ఒక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిద్వారా ఎఫ్ఎస్‌సీ కార్డు స్థితి ఇట్టే తెలుసుకోవచ్చు. అదే https://epds.telangana.gov.in వెబ్‌సైట్. ఇందులోకి వెళ్లి మొదట ఎఫ్ఎస్‌సీ సెర్చ్ ఎంచుకోవాలి. తర్వాత కనిపించే రేషన్‌కార్డు సెర్చ్ బాక్స్‌పై క్లిక్ చేయాలి. ఎఫ్ఎస్‌సీ అప్లికేషన్ సెర్చ్‌పై క్లిక్ చేయాలి. అనంతరం కనిపించిన తెరపై మీసేవ నంబర్(మీసేవలో దరఖాస్తు చేసిన అప్లికేషన్ నంబరు), జిల్లా పేరు నమోదు చేయగానే మీ రేషన్ కార్డు స్థితి తెలుస్తుంది

చురకలు



# నదుల మాటున.. నష్టం నీడన

వేమనపల్లి : జిల్లా సరిహద్దులోని ప్రాణహిత, గోదావరి నదుల పరివాహక గ్రామాల రైతులకు ఏటా ముంపు ముప్పు పొంచి ఉంటోంది. ఏటా ప్రకృతితోపాటు నదులు శాంతించి పారాలని కోరుతూ సాగుకు శ్రీకారం చుడుతారు. అదృష్టవశాత్తు వాతావరణం అనుకూలించినా నదుల రూపంలో మరోగండం పొంచి ఉంటుంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో భారీవర్షం కురిస్తే చాలు ప్రాణహిత లో వరద ఉగ్ర రూపం దాలుస్తుంది. ఇరు తీరాలను దాటుతూ పంటచేల మీదుగా దిగువకు ఉప్పొంగి ప్రవహిస్తుంది. విత్తనాలు నాటి మొలకలు బయటికి వస్తున్న క్రమంలో ఆదిలోనే వేలాది ఎకరాల్లో పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇదీ కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని రైతుల పరిస్థితి..

పెసర, మినుము, నువ్వులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు తదితర ఆరుతడి పంటలు సాగయ్యే వెసులుబాటు ఉన్నప్పటికీ నది వరదల ఉద్ధృతిని దృష్టిలో ఉంచుకుని వాటిపై మొగ్గుచూపడం లేదు. పంట కాలంలో ఏటా ప్రాణహిత నది నాలుగైదు సార్లు ఉప్పొంగుతోంది. పత్తి ముంపునకు గురై మొక్కలు కుళ్లిపోతున్నా సరే దీని సాగు వైపే మొగ్గుచూ



పుతున్నారు. లాభాలు రాకున్నా పెట్టుబడుల నుంచైనా గట్టెక్కుతామనే ఆశతో రైతులు పత్తి తప్పితే ప్రత్యామ్నాయం వైపు చూడటం లేదని తెలుస్తోంది.

**వేలాది ఎకరాల్లో..** వేమనపల్లి మండలం కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, జాజులపేట, ఒడ్డుగూడెం, సుంపుటం, వేమనపల్లి, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల గ్రామాల్లో 4,500 ఎకరాలు కోటపల్లి మండలంలోని వెంచపల్లి మొదలు సూపాక, జనగామ, శివారాంపల్లి, ఆల్గామ, పుల్లగామ, సిర్సా, అన్నారం, అర్జునగుట్ట, రాపన్‌పల్లి, దేవులవాడ, రాంపూర్, కొల్లూరు గ్రామాల్లో ఏటా సుమారు 9,300 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. ఇదే సమయంలో గోదావరి సైతం ఉప్పొంగితే నష్టవిస్తీర్ణం పెరుగుతోంది. ఏటా నదుల మాటున తీవ్రనష్టం జరుగుతున్నా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే అవకాశం లేదు. ప్రత్యామ్నాయ పంటలసాగు వైపు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కొరవడింది. నీటిలో తేలియాడుతూ కనిపిస్తున్న ఈ పత్తి మొక్కలు వేమనపల్లి మండలం ఒడ్డుగూడెంకు చెందిన ఓ రైతు చేనులోనివి. గతేడాది వర్షాకాలం ప్రారంభంలోనే ప్రాణహిత నది ఉప్పొంగడంతో కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోనే వేలాది ఎకరాల్లో పత్తి పంటలు నీటిపాలయ్యాయి. ప్రాణహిత వరదలు తగ్గుముఖం పట్టిన అనంతరం మరోసారి రైతులు ఆలస్యంగా విత్తనాలు వేసుకున్నారు.

**పరిహారం అందలేదు**

కోటపల్లి మండలంలోని సిర్సా శివారులో గతేడాది నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ప్రారంభంలోనే ప్రాణహిత వరదలు పంటను ముంచెత్తాయి. రెండు నెలల అనంతరం రెండోసారి పంట నీటిపాలు కావడంతో దిగుబడులు రాక నష్టపోయాను. ప్రభుత్వం నష్టపోయిన పంటలకు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు అందలేదు. వరదలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి. గగ్గూరి సుమలత, మహిళా రైతు సిర్సా

# భూగర్భ జలాలు పెంచేలా..

గోలేటి : ఇప్పటి వరకు విద్యుత్తు ఉత్పత్తి కోసం నల్ల బంగారాన్ని వెలికితీస్తున్న సింగరేణి యాజమాన్యం.. దృఢ సంకల్పంతో మరో ముందడుగు వేసింది. బొగ్గు గనుల పరిసర ప్రాంతాల్లో అడుగంటి పోతున్న భూగర్భ జలాల పెంపునకు 'సింగరేణి నీటి బిందువు.. జల సింధువు' పేరుతో సింగరేణి వ్యాప్తంగా చెరువుల అభివృద్ధి పనులు చేపట్టింది. ఇప్పటికే కాలుష్యం ఎక్కువగా ఉండే బొగ్గు గనుల ప్రాంతాల్లో వేల ఎకరాల భూముల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా యాజమాన్యం పాటుపడుతోంది. కేంద్ర పర్యావరణ శాఖ సూచనల మేరకు.. తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా భూగర్భ జలాలు పెంచి పంటలకు, స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. ఫలితంగా వేసవిలో జంతువులు, పక్షులతోపాటు జీవరాశుల మనుగడకు ఎంతగానో ఉపయోగపడనుంది. వర్షాలు పడకముందే బెల్లంపల్లి ఏరియా ప్రాంతంలో చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి



చేశారు.

**నిత్య పర్యవేక్షణతో సాధ్యం**

బెల్లంపల్లి ఏరియా రెబ్బెన, తాండూరు మండలాల పరిధిలోని ఎనిమిది చెరువుల్లో నీటి సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు పూడికతీత పనులు చేపట్టారు. సింగరేణి ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు సంస్థ సీఎండీ ఎన్.బలరాం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఏప్రిల్ నెలలో పథకం అమలుపై అన్ని ఏరియాల జీఎంలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా చర్చించి మార్గదర్శకాలు జారీ చేశారు. దీంతో సంస్థ వ్యాప్తంగా 50 చెరువులకు పైగా పూడికతీత పనులు చేపట్టారు. రెబ్బెన మండల పరిధిలోని గోలేటి, దుర్గాపూర్, గోండుగూడ, తాండూరు మండల పరిధిలోని బెజ్జాల భీమన్న ట్యాంక్, నర్సాపూర్‌లోని దొడ్డిగూడెం, బెజ్జాల, నర్సాపూర్ గ్రామాల్లో మొత్తం ఎనిమిది చెరువుల్లో సుమారు రూ.40 లక్షల వ్యయంతో పనులు చేశారు. చెరువుల్లో నీటి సామర్థ్యం పెంచేందుకు లోతుగా జేసీబీ, షావల్స్ యంత్రాల సహాయంతో 83,820 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వర్షాలు కురవక ముందే పనులు పూర్తి చేసేలా ఏరియా జీఎం ఎం.విజయభాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో సంబంధిత అధికారులు అనుకున్న లక్ష్యాన్ని జూన్ మొదటి వారంలోనే పనులు పూర్తి చేశారు.

# బాధ్యతలు మరిచి.. అమ్యామ్యాలకు మరిగి




పెద్దపల్లి : పురపాలికల్లోని అధికారుల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణానికి చేసే వ్యయం కంటే అవసరమైన అనుమతులు పొందడమే ప్రహసనంగా మారింది. ప్రజలు నిబంధనలు పాటించినప్పటికీ వివిధ కారణాలు చూపుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసినప్పటినుంచి.. ఇంటి నంబర్ పొందేంత వరకు వివిధ దశల్లో అవినీతిపరుల చేతులు తడపాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది కిందట నిర్మించిన ఇంటికి.. నంబర్ కేటాయించకుండా మూడు నెలలుగా విసిగించిన అధికారులు.. అనిశాకు పట్టుబడటంతో పురపాలికల్లో వివిధ దశల్లో జరిగే అవినీతి మరోసారి తెరపైకి వచ్చింది.

**కిందిస్థాయి అధికారి నుంచి..**

పురపాలికల్లో దిగువ స్థాయి నుంచి పై స్థాయి వరకు అవినీతి పెరిగిపోయింది. ముఖ్యంగా ఉన్నతాధికారుల అవినీతితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణంలో జరిగే లోపాలను కారణంగా చూపుతూ అవినీతికి పాల్పడుతున్నారు. సెట్‌బ్యాక్‌లు, రహదారి ప్రభావిత నిర్మాణాలే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నాయి. ఒక ప్రాంతంలో ఇళ్లు నిర్మిస్తే పురపాలిక అధికారులతో పాటు సంబంధిత ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ఇలాంటి ఘటనలపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లిన బుట్టదాఖలే అవుతుండడంతో ప్రజలకు ఎవరిని సంప్రదించాలో అర్థం కావడంలేదు.

**జరిగిన ఉదంతాలు**

పురపాలికల్లో నిర్మాణాల అనుమతులతోపాటు చేపట్టే అభివృద్ధి పనులకు కమీషన్లు వసూలు చేసిన వివిధ స్థాయిల అధికారులకు వాటాలుంటాయి. పనుల నిర్వహణ మొదలు, బిల్లులు చెల్లించేంత వరకు ఎవరి వాటా వారికి చెల్లించాల్సిందే. ఇందులో తేడాలొస్తే ఇబ్బందులు తప్పవు. ఇలాంటి పరిస్థితిని తప్పించుకునేందుకు గుత్తేదారులు సైతం అధికారులను ప్రసన్నం చేసుకోవడం తప్పడం లేదు.

మూడేళ్ల క్రితం రామగుండం నగరపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించిన ఆర్డీవో శంకర్‌కుమార్ ఒక గుత్తేదారుకు బిల్లు చెల్లించేందుకు కమీషన్ తీసుకుంటుండగా.. అనిశాకు చిక్కాడు. గతంలో పెద్దపల్లి పురపాలికలో పనిచేసిన ఓ ఉద్యోగి నిర్మించని ఇళ్లకు నంబర్లు కేటాయించారు. దీనిపై విచారణ జరిపి అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల మంథనిలోనూ అవినీతి ఆరోపణలు వచ్చిన ఒక ఉద్యోగిని బదిలీ చేశారు.

# ఇంటి పంట.. ఆరోగ్య వంట



సూర్యాపేట : మిద్దెసాగుపై పురపాలికల్లో ఆసక్తి చూపుతున్నారు. సూర్యాపేట పట్టణంలో 1200 పైగా మిద్దెలపై వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. రసాయనాలు అధికంగా వినియోగించి పండించిన కాయగూరలతో ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని గుర్తించిన ప్రజలు ఇంటి వద్దనే సొంతంగా సాగు చేపడ్తున్నారు. గతంలో డీఎంఎఫ్‌టీ నిధులతో పురపాలికకు యూనిట్లు మంజూరు కాగా వాటితో తమ నివాసాలపై సాగు చేపట్టారు. వీటి బాధ్యతలను మెప్మా అధికారులకు అప్పగించారు. రూ.1500 చెల్లిస్తే సంచులు, ఎరువులు, పిచికారీ వంటి వాటిని పంపిణీ చేశారు. వీరిసాయంతో పేటవాసులు తమ ఇళ్లపై వారికి నచ్చిన రకాల కూరగాయలు పండించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు.

**నిలిచిన రాయితీ.. సొంతంగా ఏర్పాటు**

ప్రభుత్వం మారడంతో మంజూరు రాయితీ యూనిట్ల మంజూరు నిలిచిపోయింది. కొత్తగా మిద్దెసాగు చేపట్టే వారు పుర కార్యాలయానికి తిరుగుతున్నారు. నూతనంగా గృహం నిర్మించుకునేవారు ఆసక్తి కనబరుస్తున్నారు. సొంతంగా ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలను ఖరీదు చేసి వాటిలో మట్టిని నింపుతున్నారు. జూన్ మాసం అదును కావటంతో అందులో కూరగాయల విత్తనాలు నాటుతున్నారు. కానీ వాటికి కావాల్సిన ఎరువులు దొరకక, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయితీ యూనిట్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కాయగూరలు.. పండ్లు** పట్టణానికి చెందిన గుండు వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులే. స్థానిక గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రసాయనాలు లేని కూరగాయలు పండించాలనే లక్ష్యంతో ఇంటి మీద మిద్దె తోట సాగు చేపట్టారు. బెండ, దొండ, దోస, బీర, నేతిబీర, పొట్ల, టమాట, వంకాయ, చిక్కుడు వంటి కూరగాయలు, తోట కూర, బచ్చలి, గంగవాయిల కూర లాంటి ఆకు కూరలను డబ్బాల్లో పెంచుతున్నారు. మామిడి, సపోటా, అంజీర ద్రాక్ష, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, వాటర్ యాపిల్ ఇలా పలు రకాల పండ్లనూ పండిస్తున్నారు. వీరే కాకుండా పట్టణంలో 10 మంది వరకు ఇలాగే మిద్దె పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం**సీహెచ్ హనుమంతరెడ్డి, పుర కమిషనర్ గతంలో డీఎంఎఫ్‌టీ రాయితీ యూనిట్లు మంజూరైనట్లు సిబ్బంది చెప్పారు. వీటితో పట్టణంలో మిద్దెసాగు చేపట్టారు. ఏడాదిన్నర నుంచి నిలిచిపోయినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు నివేదించి పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

**ఐదేళ్ల నుంచి సాగు చేస్తున్నా**

గోదాల రేణుక, గోపాలపురం, సూర్యాపేట

ఐదేళ్ల కిందట ఒక్క దొండ మొక్కతో ప్రారంభించాను. దిగుబడి బాగుండడంతో సేంద్రియ కూరగాయల కోసం మిద్దెసాగు చేపట్టాను. కొవిడ్ సమయంలో ఇంటి కూరగాయలనే తిన్నాం. తొలుత పుర అధికారులు సహకారం ఉండేది. ప్రస్తుతం ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నాం. రాయితీలను పునరుద్ధరించాలి.

**రాయితీ ఇస్తే మరింత మేలు**


కళింగరెడ్డి, మిద్దెసాగుదారు, సూర్యాపేట

రాయితీపై విత్తనాలు, ఎరువులు మంజూరు చేస్తే ఎక్కువమంది మిద్దెలపై కూరగాయల సాగు చేపడతారు. గతంలో డీఎంఎఫ్‌టీ నిధులతో రాయితీ యూనిట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవి రాక చాలామంది ముందుకురావటం లేదు. ఆసక్తి ఉన్నవారు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

# వైద్య కళాశాల ఎక్కడో?

భువనగిరి : జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాల శాశ్వత భవన నిర్మాణ స్థలం కేటాయింపు తేలడంలేదు. అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదిత స్థలం ఎంపిక దస్త్రాలు శాఖల మధ్య తిరుగుతున్నాయి. తరగతులు ప్రారంభమై ఏడాది దగ్గర పడుతున్నా భవనం పనులు ఒక్క అడుగుకు కూడా ముందుకు పడటం లేదు.**ప్రతిపాదించిన స్థలంలో మొదలుకాని సర్వే**

యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి రెవెన్యూ పరిధిలో 20 ఎకరాల స్థలం వైద్యకళాశాల, ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించారు. వైటీడీఏ ఆధీనంలోని స్థలం రెవెన్యూ శాఖ సర్వే చేసి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్(డీఎంఈ)కు అప్పగించాల్సి ఉంది. సదరు అధికారులు వైటీడీఏకు కూడా లేఖ రాశారు. నూతన భవన నిర్మాణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు డీఎంఈ ప్రయత్నం చేస్తున్నా ముందుకుసాగడం లేదు. తుర్కపల్లి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 6న జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వాటిలో నూతన వైద్యకళాశాల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయినా ఎంపిక చేసిన స్థలం అప్పగించడంలో జాప్యం చోటుచేసుకుంది. 2024-25 విద్యా సంవత్సరంలో 50 సీట్లతో వైద్యకళాశాల మంజూరు అయింది. పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ ప్రైవేట్ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అనుబంధంగా భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రిని జనరల్ ఆసుపత్రిగా కొనసాగిస్తున్నారు. నూతన వైద్య కళాశాలను గత ప్రభుత్వం ఆలేరు నియోజకవర్గంలో యాదగిరిగుట్టలో నిర్మించేందుకు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అక్కడే కొనసాగించాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రమైన భువనగిరి కేంద్రంగా వైద్యకళాశాల నిర్మించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు.



మరోవైపు మొదట్లో ఎంపిక చేసిన యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్‌లోనే వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని అక్కడి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**స్పష్టత కరవు**

ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఎంబీబీఎస్ రెండో సంవత్సరం తరగతులు ప్రారంభ సమయం వరకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే స్థలం కేటాయింపు మార్పుపై స్పష్టత లేకపోవడంతో వచ్చే ఏడాది వరకు శాశ్వత భవన నిర్మాణంపై సందిగ్ధం నెలకొంది. వైద్యకళాశాల ఏర్పాటుపై స్థానిక అధికారులు మాత్రం తమకు తెలియదని అంతా డీఎంఈ పరిధిలో జరుగుతుందని పేర్కొంటున్నారు.

# ఏళ్లు గడుస్తున్నాయ్.. కాళ్లు అ(వి)రుగుతున్నాయ్!

కాగజ్‌నగర్ : చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు నిర్మించే క్రమంలో ముంపు భూములకు పరిహారం అందించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా కొన్నిచోట్ల రైతులు పరిహారం కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగి వేసారి పోతున్నారు. దశాబ్దం గడిచి పోయినప్పటికీ రెంటికీ చెడ్డ రేవడిలా మారింది బాధిత రైతుల పరిస్థితి. పెద్ద సార్లను కలిస్తే పరిష్కారమవుతుందనే ఆశతో వెళ్లిన ఓ రైతు కాలు ఇటీవల విరిగిపోయింది. కుమురంభీం అడ, జగన్నాథపూర్ ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం అందక బాధితులు అవస్థలు పడుతున్నారు. జలయజ్ఞంలో భాగంగా ఆసిఫాబాద్ మండలం అడ సమీపంలోని పెద్దవాగుపై కుమురంభీం ప్రాజెక్టు, కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై జగన్నాథపూర్ ప్రాజెక్టు నిర్మాణాలు



చేపట్టింది. కుమురంభీం జలాశయం పూర్తికాగా.. కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కానీ కాలువ ముంపు భూముల పరిహారం పూర్తిస్థాయిలో అందలేదు. జగన్నాథపూర్ ప్రాజెక్టు రిజర్వాయర్ పనులు పూర్తి కాగా 29 కి.మీ. మట్టి కాలువ తవ్వకాలతోపాటు 15 కి.మీ. లైనింగ్ పనులు పూర్తయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు కానందున 2019లో గుత్తేదారు పనులు నిలిపేశారు. కాలువ ముంపునకు గురైన 101 ఎకరాల రైతులకు ఇప్పటి వరకు (19 ఏళ్లుగా) పరిహారం అందలేదు.

ఈ విషయంపై డీఈఈ రమణను సంప్రదించగా.. ముంపు భూముల పరిహారం చెల్లింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఆర్థికశాఖ ఆమోదం రావాల్సి ఉందని చెప్పారు.

**రెండు విధాలుగా నష్టపోయా**

1.50 ఎకరాలు జగన్నాథపూర్ ప్రాజెక్టు కాలువలో ముంపునకు గురైంది. 19 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నా. ఓవైపు పరిహారం రాక మరోవైపు సాగు భూమి కోల్పోయి రెండు విధాలుగా నష్టపోయా. ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బాధితులకు పరిహారం చెల్లిస్తారా లేదా అనే విషయం తెలియడం లేదు. అధికారులు స్పందించి అందించేలా చర్యలు తీసుకోవాలి.

శ్యాంరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బోడెపల్లి

**కలెక్టరేట్‌కు వెళ్తే కాలు విరిగింది**

అడ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా నజ్రుల్‌నగర్ విలేజి నం.13 శివారులో నా భార్య గీతారాణి పేరున ఉన్న పట్టా సర్వే నం.22/58లో 1.80 ఎకరాలు ముంపునకు గురైంది. ఈ సర్వే నంబరు పక్కన ఉన్న సుశీల్ మండల్‌కు పరిహారం చెల్లించారు. మాకు రాలేదు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. ఇటీవల కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్ వెళ్లగా అక్కడ జారి పడ్డాను. కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాను. జిల్లా అధికారులు న్యాయం చేయాలి. ముంపు బాధితురాలు గీతారాణి భర్త మనోరంజన్ మండల్

# అక్రమాలు పుట్టుకొస్తున్నాయి!

నిర్మల్ : రెండేళ్ల వయసు పూర్తయిన తమ కుమారుడికి జనన ధ్రువపత్రం కోసం తల్లిదండ్రులు ఇటీవల నిర్మల్ ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్నారు. వారి ఆధార్‌కార్డు వివరాలను బట్టి తల్లిదండ్రులిద్దరూ ముథోల్ నియోజకవర్గానికి చెందినవారు.. లేట్ బర్త్ సర్టిఫికెట్ కావడంతో ముందుగా సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఈ దరఖాస్తును పరిశీలించి, వివరాలు నిర్ధారణ చేసుకొని ఆర్డీఓకు చేరవేయాలి. అక్కడ మరోసారి పరిశీలించి ప్రొసీడింగ్స్ జారీచేస్తారు. అయితే.. ఇక్కడ మాత్రం ఎలాంటి పరిశీలన జరగకుండా నిర్మల్ ప్రాంతవాసులే అన్నట్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం..

జనన ధ్రువపత్రం.. అప్పుడే పుట్టిన శిశువు నుంచి చదువుకునే విద్యార్థుల వరకు చాలా సందర్భాల్లో ఇదే అత్యంత కీలకం.. బడిలో చేరాలన్నా.. ఆధార్ పొందాలన్నా.. ఎక్కడైనా ఏ పథకంలోనైనా దరఖాస్తు సమర్పించాలన్నా ఇది తప్పనిసరి. సాధారణంగా మున్సిపల్, పంచాయతీ కార్యాలయాల పరిధిలో వీటిని జారీ చేస్తుంటారు. పుట్టిన బిడ్డకు ఏదైనా కారణాలతో ఏడాదిలోపు బర్త్ సర్టిఫికెట్ పొందలేకపోతే, నోటరీ ఇతర ధ్రువపత్రాలను జతచేస్తూ ఆర్డీఓ కార్యాలయం నుంచి ధ్రువపత్రం పొందాల్సి వస్తుంది. ఇప్పుడీ 'లేట్ బర్త్ సర్టిఫికెట్' వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది.. ప్రక్రియంతా పకడ్బందీగా సాగాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. సరిగా పరిశీలించకుండా గుడ్డిగా ధ్రువీకరించి చేతులు దులుపుకొంటున్నట్లు అవగతమవుతోంది..

**జారీ ఇలా..**తల్లిదండ్రుల సొంతూరు ఏదైనప్పటికీ బిడ్డ జన్మించిన ఆసుపత్రుల నుంచి అక్కడి మున్సిపల్ కార్యాలయానికి తగిన సమాచారం అందజేస్తారు.. ఆ వివరాల ఆధారంగా, పుట్టిన బిడ్డకు పేరు ఖరారుచేసి, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి ఆధార్‌కార్డు జతచేసి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేయాలి. వాటిని పరిశీలించి మున్సిపల్ నుంచి జనన ధ్రువపత్రం జారీచేస్తారు. ఒకవేళ ఇళ్ల వద్ద ప్రసవం జరిగితే అంగన్‌వాడీ కార్యకర్తలు ఆ విషయాన్ని నిర్ధారిస్తారు. వాటి ఆధారంగా పంచాయతీ, మున్సిపల్ కార్యాలయం నుంచి జనన ధ్రువపత్రం పొందవచ్చు. ఇదంతా బిడ్డ జన్మించిన ఏడాదిలోపైతేనే జరిగే ప్రక్రియ. అంతకన్నా ఎక్కువ సమయం దాటితే మాత్రం కాస్త క్లిష్టమవుతుంది.ఆలస్యంగా జనన ధ్రువపత్రం పొందే విషయంలో ఇప్పుడు అనుమానాలు తలెత్తుతున్నాయి. ముందుగా పంచాయతీ, మున్సిపల్‌లో జనన వివరాలు అందుబాటులో లేవని సర్టిఫికెట్ పొందాలి. దీంతో పాటు ఓ నోటరీని జతచేసి, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులతో మీసేవా కేంద్రంలో దరఖాస్తు సమర్పించాలి.

దాన్ని సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి, ఆపై ఆర్డీఓకు అందిస్తారు. వారు ధ్రువీకరించిన తర్వాత వచ్చే ఉత్తర్వు ఆధారంగా జనన ధ్రువపత్రం జారీ అవుతుంది. దీనికోసం అధికారిక గడువు 90 రోజులు. ఇప్పుడిదే కొందరికి కాసులు కురిపిస్తోంది. కొందరు దళారీ అవతారం ఎత్తి కార్యాలయం, వినియోగదారుడికి మధ్య వారధిగా మారుతున్నారు. డబ్బులు తీసుకొని తక్కువ సమయంలోనే ధ్రువపత్రాలను అందిస్తున్నారు.

చురకలు



## ఉచిత ప్రయాణానికి సిద్ధమేనా?

అనంతపురం : ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు అన్ని డిపోలో సన్నద్ధ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోతాయా.. లేదా? ఇంకా ఎన్ని అవసరం? తదితరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు బస్టాండుల్లో మహిళలకు వసతులు పెంచాల్సిన అవసరం ఉంది. పథకం అమల్లోకి వచ్చాక మహిళా ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అదనపు కుర్చీలు, మూత్రశాలలు, తాగునీరు, ఫ్యాన్లను అందుబాటులోకి తేవాల్సింది.

**చకచకా ఏర్పాట్లు**

ప్రతి బస్టాండు నుంచి ఎంతమేరకు డ్రైవర్లు అవసరం అవుతారో లెక్క తీశారు. 160 మందిని అదనంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. పల్లెవెలుగు బస్సుల్లో సీట్లు, అద్దాలు, మరమ్మతులు చేస్తున్నారు. డిపోల వారీగా కొత్తవి ఏర్పాటు చేసేందుకు కడప రీజియన్



కార్యాలయానికి నివేదించారు. జిల్లాలో నిత్యం 1.21లక్షల మంది ప్రయాణిస్తుండగా రూ.85 లక్షల ఆదాయం వస్తోంది. ప్రస్తుతం ఆక్యుపెన్సీ 67 శాతం ఉండగా ఉచిత బస్సులు వస్తే 140 శాతానికి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**కొత్త సర్వీసులు అవసరం**

జిల్లాలోని 456 గ్రామాలకు సర్వీసులు ఉన్నాయి. ఉచిత బస్సు పథకం నేపథ్యంలో పలు మేజర్ పంచాయతీలకు బస్సులు తిప్పాల్సి వస్తుంది. కొత్తగా 55 గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలనే డిమాండ్ ఉంది. ఇందుకు అదనంగా 30 నుంచి 40 బస్సులు అవసరం. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ధర్మవరం వైపు ఆయా డిపోల బస్సులు వెళుతుండటంతో రద్దీకి అనుగుణంగా మార్చుకోవచ్చు. ఉరవకొండ, తాడిపత్రి, బెంగళూరు మార్గాల్లో అదనపు బస్సులు అవసరమవుతాయని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి.

## దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

లేపాక్షి : మండలంలోని బిసలమానేపల్లి నుంచి వెంకటాపురం, ఓబుళాపురం గ్రామాలకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగించేవారు. వర్షం వస్తే బురదమయమై వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ఎవరికైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే 108 వాహనం సైతం గ్రామాలకు వెళ్లలేని దుస్థితి. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. 2014లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రహదారి ఏర్పాటుకు రూ.2.50 కోట్లకు పైగా నిధులు విడుదల చేయించారు. అప్పట్లో



పనులు దక్కించుకున్న గుత్తేదారు ప్రారంభించి 20శాతం మేర చేసేలోపే 2019లో ఎన్నికలు రావడం, వైకాపా అధికారం చేపట్టడం జరిగింది. అయితే రహదారి ఏర్పాటుకు వైకాపా ఐదేళ్లు పట్టించుకోలేదు. పనులు నిలిచిపోయాయి. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రహదారి ఏర్పాటుకు రూ.3కోట్ల నిధులు విడుదల చేయించారు. ప్రస్తుతం రెండు గ్రామాలకు సుందరమైన బీటీ రహదారి రూపుదిద్దుకుంది. దీంతో దశాబ్దాల కల నెరవేరినట్లైందని ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## తీరని వేదన.. మారని యాతన

సీలేరు : రోడ్డు సక్రమంగా లేక గర్భిణిని కాలినడకన కిలోమీటరు దూరం తీసుకువెళ్లిన ఘటన గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ రాంపూర్‌లో చోటుచేసుకుంది. జి.నేరేడుపల్లి నుంచి రాంపూర్ వరకు రహదారి బురదమయంగా మారింది. మధ్యలో కాలువ, కాలిబాట ఉండటంతో ద్విచక్రవాహనాలు సైతం గ్రామానికి వచ్చే వీలులేదు. ఈ పరిస్థితుల్లో గురువారం రాంపూర్ గ్రామానికి చెందిన గర్భిణి లక్ష్మికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఈమెను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు స్థానిక ఆశా కార్యకర్త జమున సీలేరు వైద్యులకు సమాచారం అందించడంతో అంబులెన్స్ పంపారు. అయితే రోడ్డు బాగోలేక అంబులెన్స్ కొంతవరకే వచ్చింది. కిలోమీటరు దూరంలో ఉన్న అంబులెన్స్ వరకు గర్భిణిని ఆశా కార్యకర్త నడిపించుకుని తీసుకువెళ్లింది. అక్కడినుంచి అంబులెన్స్‌లో సీలేరు ఆసుపత్రికి తరలించడంతో సుఖప్రసవం జరిగింది. తమ గ్రామానికి రోడ్డు సరిగ్గా లేక ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

**గర్భిణికి నెలలు నిండి ప్రసవ వేదన పడుతుండగా..** బంధువులు డోలీలో నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లిన ఘటన అనంతగిరి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. కొత్తూరు పంచాయతీ టెంకాబుడ్డి గ్రామానికి చెందిన గన్నెల సీతమ్మ గర్భిణి. నెలలు నిండటంతో గురువారం ఉదయం పురిటి నొప్పులువచ్చాయి. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో బంధువులు ఆమెను డోలీలో మోసుకుని సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లారు. అక్కడినుంచి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఉరకలేస్తున్న తుంగభద్ర.. కృష్ణమ్మ



అనంతపురం : తుంగభద్రమ్మ, కృష్ణమ్మ ఉరకలేస్తూ 'అనంత'ను ముద్దాడాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈదఫా ముందస్తుగా జిల్లాలోకి ప్రవేశించి అన్నదాతల్లో ఆనందాన్ని నింపాయి. అటు కృష్ణా జలాలు జీడిపల్లికి, ఇటు తుంగభద్ర నీరు ఎమ్పీఆర్ ప్రాజెక్టుకు చేరడం విశేషం. ఈనెల 17న నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ వద్ద కృష్ణా జలాలను హంద్రీనీవా ప్రధాన కాలువకు ఎత్తిపోసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అదే రోజున హెచ్చెల్సీ వాటా నీటిని టీబీ డ్యాం వద్ద విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వరప్రదాయినిలుగా భావించే హంద్రీనీవా, హెచ్చెల్సీ ప్రధాన కాలువల్లో ప్రవాహాలు జోరుగా సాగుతున్నాయి. జీడిపల్లికి నీరు చేరడంతో జిల్లా జలవనరుల సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ స్వరూప్‌కుమార్, తదితరులు గంగపూజ చేసి.. జలహారతి ఇచ్చారు.

**29న పీఏబీఆర్‌కు విడుదల**

ఈనెల 17న మల్యాల నుంచి హంద్రీనీవాకు నీరు విడుదల అయ్యాయి. అక్కడి నుంచి ఆరు రోజులకే అనంత జిల్లా సరిహద్దుకు చేరాయి. అదే రోజే రాగులపాడు పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోశారు. రెండు రోజుల్లో జీడిపల్లికి చేరడం ప్రస్తావనార్హం. గతంలో 10 నుంచి 12 రోజులు పట్టేది. ఈదఫా ఎనిమిది రోజులకే ప్రవేశించడం విశేషం. హంద్రీనీవా చరిత్రలోనే ఒకేసారి 1500క్యూసెక్కులు రావడం రికార్డుగా భావిస్తున్నారు. రాగులపాడు వద్ద ఐదు పంపులతో ఎత్తిపోస్తున్నారు. ఈనెల 28 దాకా జీడిపల్లిని నింపిన తర్వాత.. 29న పీఏబీఆర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తారురెండు జిల్లాల తాగునీటి అవసరాలు తీర్చే పీఏబీఆర్‌లో గరిష్ఠంగా 5.5 టీఎంసీలు నిల్వ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

**నేరుగా ఎమ్పీఆర్‌కే..**

టీబీ డ్యాం వద్ద ఇదే నెల 17న హెచ్చెల్సీ వాటా విడుదలకు శ్రీకారం చుట్టారు. అప్పటికే ఏపీ-కర్ణాటక సరిహద్దులో నిల్వ ఉన్న నీటిని 105 కి.మీ. వద్ద గేట్లను ఎత్తి హెచ్చెల్సీకి విడుదల చేశారు. ప్రస్తుతం సరిహద్దులో 926 క్యూసెక్కుల మేర ప్రవాహం సాగుతోంది. అక్కడి నుంచి నేరుగా కణేకల్లు చెరువుకు చేరుతున్నాయి. చెరువు నుంచి దిగువన ప్రధాన కాలువ ద్వారా నేరుగా ఎమ్పీఆర్ జలాశయానికి ప్రవేశించాయి. ఇక్కడికి వచ్చేసరికి 300 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 1,500 క్యూసెక్కుల మేర సరిహద్దులో తీసుకునేలా టీబీ డ్యాం అధికారులకు ఇండెంట్ పంపారు.

# వాటా స్వాహా



గుమ్మఘట్ట : కూటమి ప్రభుత్వం రాగానే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గొర్రెలు, పశువుల షెడ్ల (గోకులం షెడ్లు) నిర్మాణం చేపట్టింది. ఎక్కడా లేని విధంగా గుమ్మఘట్ట మండలంలో ఉపాధి హామీ ఉద్యోగులు అక్రమాలకు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో షెడ్డుకు లబ్ధిదారుల నుంచి వసూలు చేశారు. ఒక్కో షెడ్డు మొత్తం యూనిట్ విలువ రూ2.30 లక్షలు. అందులో రైతు వాటా పది శాతం అంటే రూ23 వేలు. ప్రభుత్వం 90 శాతం అందిస్తుంది. 10 శాతం వాటా రైతులు కట్టాల్సిన అవసరం లేదు. దాన్ని మినహాయించి సర్కారు అందిస్తుంది. ఉపాధి హామీ ఏపీఓ, ఈసీలు క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి. ముందుగా రూ.23 వేలు చెల్లిస్తేనే షెడ్డు మంజూరు చేస్తామని హుకుం జారీ చేశారు. 49 మందికి పైగా లబ్ధిదారులతో రూ.11 లక్షలకు పైగా ముక్కుపిండి రాబట్టారు. ఒప్పుకోని రైతులకు బిల్లులు పెట్టేదిలేదని బెదిరించి వసూలుకు పాల్పడ్డారు.

**బిల్లు కావాలన్నా సమర్పించాల్సిందే..**

షెడ్లు మంజూరు నాటి నుంచి నిర్మాణాలు ప్రారంభం వరకు.. బిల్లు పెట్టేందుకు ఒక్కో రైతు నుంచి రూ5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసి స్వాహా చేశారు. లబ్ధిదారుల నుంచి భారీగానే వసూలు చేశారు. అసలే పంటలు పండక అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రైతులను ఉపాధి హామీ ఉద్యోగులు జలగల్లా పీక్కుతింటున్నారు. అమాయక రైతులకు మాయమాటలు చెప్పి వసూళ్లకు తెగబడుతున్నారు.

**నిర్మాణం ప్రారంభానికి ముందే ఇచ్చా..**

నాకు షెడ్డు మంజూరైంది. ముందుగానే రూ.23 వేలు కట్టాలని ఉపాధి సిబ్బంది చెప్పారు. ప్రారంభానికి ముందే వసూలు చేశారు. ఇదేమిటని అడిగితే డబ్బు ఇవ్వాల్సిందే.. లేకపోతే బిల్లులు పెట్టమన్నారు. అందుకే ముందేగా ఇచ్చాను.

గోవిందప్ప రైతు, రంగచేడు, గుమ్మఘట్ట మండలం

**కఠినచర్యలు తప్పవు**

క్షేత్ర స్థాయిలో వసూళ్లకు పాల్పడిన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు ఇబ్బంది పడకూడదనే బిల్లులు సైతం సమయానికి రైతులకు అందిస్తోంది. ఇలాంటి పనులను ఉపేక్షించేది లేదు.సలీంబాషా, డ్వామా పీడీ

# దూరవిద్యా కేంద్రం.. మహిళలకు వరం




తిరుపతి : గతంతో పోల్చితే ప్రస్తుతం దూరవిద్య కోర్సులకు మరింత ప్రాధాన్యం పెరుగుతోంది. ఆర్థిక ఇబ్బందులతో రెగ్యులర్ కోర్సులు అభ్యసించలేని విద్యార్థినులకు, చదువుపై ఆసక్తి ఉన్న గృహిణులు, ఉద్యోగాలు చేస్తూ చదువు కొనసాగించాలనుకునే మహిళలకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ దూరవిద్యా కేంద్రం అందించే వివిధ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. విద్యార్హతలు పెంచుకోవడానికి, ఉద్యోగోన్నతులు పొందడానికి ఈ కోర్సులెంతో అనుకూలంగా ఉన్నాయి. 59 రెగ్యులర్ కోర్సులనందిస్తున్న వర్సిటీ దూరవిద్య ద్వారా పలు కోర్సులను అందిస్తూ మహిళల ఉన్నత విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. కోర్సు, ఫీజుల వివరాలను కేంద్రం సంచాలకులు ఆచార్య అరుణ వివరించారు.

పీజీ, డిప్లొమా కోర్సులు : 2025-26లో వివిధ డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. పీజీలో ఎంఏ తెలుగు, ఎంకాం, డిప్లొమాలో మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల్లో ప్రవేశానికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిప్లొమా కోర్సులకు ఏదైనా సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

ఎంఏ తెలుగు, సీట్లు : 30, ఫీజు: రూ.4వేలు (ఏడాదికి)

కోర్సు: ఎంకాం, సీట్లు 65, ఫీజు: రూ.5వేలు (ఏడాదికి)

కోర్సు: డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం), సీట్లు: పరిమితిలేదు, కోర్సు ఫీజు: రూ.3వేలు, కాలపరిమితి: 6 నెలలు.

అనుకూలతలు: ఇంటి దగ్గరే కోర్సులు అభ్యసించవచ్చు. రెగ్యులర్ కోర్సులతో పోల్చితే రుసుములు తక్కువే. రెగ్యులర్ సర్టిఫికెట్లకు ఎలాంటి గుర్తింపు ఉంటుందో దూరవిద్య కోర్సులకు అలాంటి గుర్తింపే ఉంటుంది. ఉద్యోగం/వ్యాపారం చేసుకుంటూ చదువుకోవచ్చు. ఉద్యోగోన్నతులకు దూరవిద్య కోర్సులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసినవారు సివిల్స్, గ్రూప్స్, జేఎల్, డీఎల్ వంటి అన్ని పోటీ పరీక్షలు రాయొచ్చు.

**అధ్యయన కేంద్రాలు :** రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 18 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. వర్సిటీతోపాటు శెట్టిపల్లి, నంద్యాల, శ్రీకాకుళం, రాయచోటి, గుంటూరు, కృష్ణాజిల్లా, ఒంగోలు, ఏర్పేడు, ప్రకాశం, విశాఖపట్నం, కడప, పుత్తూరు, తూర్పు గోదావరి ప్రాంతాల్లో.

**దరఖాస్తు తేదీ :** ఆగస్టు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.350 చెల్లించి నేరుగాకానీ వర్సిటీ వెబ్‌సైట్ ద్వారాకానీ దరఖాస్తు పొందవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తులను దూరవిద్యా కేంద్రానికి నిర్దేశించిన గడువులోపు చేర్చాల్సి ఉంటుంది.

**బోధన ఇలా :** కోర్సులో చేరిన వారికి తరగతులు మహిళా వర్సిటీలోనే ఉంటాయి. ఇక్కడి ఆచార్యులే పాఠాలను బోధిస్తారు. సెప్టెంబరులో మ్యూజిక్ కోర్సు అభ్యర్థులకు ఐదురోజులు, ఎంఏ తెలుగు, ఎంకాం అభ్యర్థులకు పదిరోజులపాటు తరగతులు జరుగుతాయి. డిసెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

## చదువుకున్న బడి రుణం తీర్చుకున్నారు

గోరంట్ల : ఎంత ఎత్తుకెదిగినా జన్మభూమి, చదువుకున్న పాఠశాలను గుర్తుపెట్టుకుని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చే వారు అరుదుగా ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే గోరంట్ల రంగారావు, కొండాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్. అయిదు దశాబ్దాల క్రితం ఒకరు, నాలుగు దశాబ్దాల క్రితం మరొకరు పాఠశాలలో చదువుకున్నారు. నేడు ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకుని హైదరాబాద్, బెంగళూరులో స్థిరపడ్డారు. చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని తద్వారా తమప్రాంత విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తలచి ఆదిశగా అడుగులు వేశారు. అప్పట్లో ఒకటిగా ఉన్న ఉన్నత పాఠశాల నేడు బాలికలు, బాలుర పాఠశాలలుగా విడిపోవడంతో ఒక్కోదాన్ని ఒకరు ఎంచుకుని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చారు.

**సమస్యలను పరిష్కరించిన సోమశేఖర్**

ఆ పాఠశాలలో యాభై ఏళ్ల క్రితం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకల పేరుతో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అందులో ఒకరుగా హాజరైన సోమశేఖర్ దృష్టికి పాఠశాల (ప్రస్తుతం బాలికలు)లో కొనసాగుతున్న పలు సమస్యలను ఉపాధ్యాయులు వివరించారు. పారిశ్రామికంగా బెంగళూరులో ఉంటున్న ఆయన స్పందించి తనవంతుగా ఒక్కరే సుమారు రూ.2.50లక్షలు వెచ్చించి వంటగదికి మరమ్మతులు, పైభాగంలో రేకులషెడ్డు, ప్రభుత్వం సరఫరా




చేసిన నీటిశుద్ధిప్లాంటు ఆరుబయట ఏర్పాటు చేయడంతో పాడైపోతోందని గ్రహించి వర్షానికి తడవకుండా రేకులషెడ్డు వేయించారు. మధ్యాహ్న భోజన పథకం కొనసాగడానికి అవసరమైన వంట సామగ్రిని ఇచ్చారు. దీనికి తోడు మండలంలో ఉన్న నిషాగార్మెంట్స్ పరిశ్రమ యాజమాన్యం పాఠశాలకు రూ.75వేలు సాయం చేయడంతో మరిన్ని మరమ్మతులు చేయించారు.

**బాలికల ఉన్నత పాఠశాలలో వంటగది**

**రూ.8 లక్షలతో భోజనశాల రంగారావు**

గోరంట్లకు చెందిన రంగారావు, సినీ పారిశ్రామిక రంగాల్లో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పదో తరగతి వరకు గోరంట్లలో చదివిన ఆయన ఆర్థికంగా మంచిస్థాయికి చేరుకున్నారు. తను చదువుకున్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆవరణలోనే నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం తినడానికి చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించి రూ.8 లక్షలతో భోజనశాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఆయన సోదరుడు సినీ నిర్మాత జీఎం సురేష్ పర్యవేక్షణలో పనులు పూర్తిచేయించి రంగారావు స్వయంగా ప్రారంభ కార్యక్రమానికి వచ్చారు. జన్మభూమి రుణం తీర్చుకునే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని చెప్పారు రంగారావు.

## అక్రమార్కులకు ఆక్సిజన్

కర్నూలు : వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ఆక్సిజన్ కొనుగోళ్ల పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు. కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ అవినీతి పర్వంపై అధికారులు గుట్టుగా విచారణ చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా ఆ రహస్య విచారణలో ఏం తేలిందన్న విషయాన్ని ఉన్నతాధికారులు బయటపెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిగ్గు తేల్చాల్సిన అధికారులు అంతులేని తాత్సారం చేస్తుండటంతో ఏటా రూ.2 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

**రద్దు చేసే అవకాశం లేదంటూ..**

ఆయా సరఫరా సంస్థలతో పదేళ్ల పాటు అమలులో ఉండేలా ఒప్పందాలు చేసుకోవడంతో వాటిని రద్దు చేసే అవకాశం లేదంటూ అధికారులు సరఫరా సంస్థకు వత్తాసు పలుకుతున్నారు. ఆయా ధరలకు కొనుగోళ్లు జరగడానికి మామూళ్ల మత్తే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భారీగా దోపిడీ**

ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ జీజీహెచ్ వరకు ఆక్సిజన్ రవాణా చేయడానికి అవుతున్న వ్యయాన్ని కూడా బిల్లులో చూపుతోంది. దీంతో ప్రాణవాయువు వ్యయం భారీగా పెరిగిపోతోంది. ఇలా కర్నూలులోని ఏ సంస్థ కూడా బిల్లులు వసూలు చేయడం లేదు. ఆక్సిజన్‌ను ఆసుపత్రి వరకు సంస్థ వాహనాల్లోనే ఉచితంగా తీసుకొచ్చి మరీ అందిస్తున్నారు. జీజీహెచ్‌లో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.డెలివరీ రుసుముల పేరుతో భారీగా బిల్లులను దండుకుంటున్నారు. ఆయా వ్యయాలు కూడా ఊహించలేనంత భారీగా ఉంటున్నాయి. రూ.16.99 లక్షల విలువైన ఆక్సిజన్‌ను సరఫరా చేయడానికి రూ.13.32 లక్షలు వ్యయమైనట్లు చూపుతున్నారంటే దుబారా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వివరణ కోసం 'ఈనాడు' ప్రతినిధి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఏడాదికి రూ.4.75 కోట్ల వ్యయం

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 1,050 పడకల సామర్థ్యం కలిగుంది. అత్యవసర, గుండె వైద్యం, చిన్నపిల్లల విభాగం తదితర విభాగాల్లోని ఐసీయూల్లో 200 వరకు పడకలు ఉన్నాయి. ఇతర విభాగాల్లో అవసరమైతే ఆక్సిజన్ అందించేందుకు వీలుగా పైపులైను వ్యవస్థలు ఏర్పాటు చేశారు. దీంతో 500కు పైగా పడకలకు ఆక్సిజన్ సదుపాయం ఉంది. నిత్యం సుమారు 100- 150



మంది రోగులకు ఆక్సిజన్ పెట్టి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆక్సిజన్ కొనుగోలు కోసం నెలకు రూ.33.95 లక్షలు (2022 బిల్లుల ప్రకారం) వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన సంవత్సరానికి రూ.4.75 కోట్ల వరకు వ్యయమవుతోంది.

**50 శాతం ఎక్కువ చెల్లింపులు**

2018లో వైద్యవిద్య సంచాలకుల ఆదేశాల మేరకు ఆక్సిజన్ సరఫరాకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. శ్రీభరత్ ఫార్మా, మెడికల్ ఆక్సిజన్ డిస్ట్రిబ్యూటర్స్, లిండే ఇండియా లిమిటెడ్ సంస్థలతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పంద సమయంలో క్యూబిక్ మీటర్ ఆక్సిజన్ ధర రూ.31.36 (జీఎస్టీతో కలిపి) అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 2 శాతం ధర పెంచాలన్న నిబంధన పెట్టుకున్నారు. దీంతో పాటు మరికొన్ని కొనుగోలు ఆప్షన్లు కూడా ఇచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం చెల్లిస్తున్న ధర చాలా ఎక్కువగా ఉందని.. బయట మార్కెట్లో అంత ధరల్లేవని ఆరోపణలు వెల్లువెత్తినా డీఎంఈ నుంచి వచ్చిన ఆదేశాలను సాకుగా చూపి భారీ ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు.జీజీహెచ్ కొనుగోలు చేస్తున్న ధరతో పోలిస్తే కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రులు కొనుగోలు చేస్తున్న ఆక్సిజన్ ధర ఏకంగా 50 శాతం తక్కువగా ఉండటం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రులకు సరఫరా చేస్తున్న ధరకంటే ఇంకా తక్కువ ధరకే జీజీహెచ్‌కు ఆక్సిజన్ లభ్యమయ్యే అవకాశం ఉన్నా ఆ కాంట్రాక్ట్ రద్దుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా రూ.కోట్లలో అదనపు భారం పడుతోంది.

చురకలు



## ఉపాధిలో మాయాజాలానికి చెక్

చిత్తూరు : ఉపాధి హామీ పథకంలో మస్టర్ల మాయాజాలానికి కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉదయం ఫొటో తీసి వెళ్లిపోయి పని చేసినట్లు చూపడం ఇక కుదరదు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్ కార్డులున్న శ్రామికులు ఇకపై రెండు పూటలా మస్టర్ నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో పని చేస్తున్న వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపులు చేయనున్నారు. ఉపాధి హామీ పనుల మస్టర్లలో జరుగుతున్న అవకతవకలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు క్షేత్ర సహాయకులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేవారు. సామాజిక తనిఖీలు జరిగినప్పుడు కొన్ని చోట్ల మస్టర్లలో లోపాలు ఉండటంతో క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించేవారు. కొత్త విధానంలో ఉదయం, సాయంత్రం మస్టర్ ఫొటోలు



అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తప్పనిసరిగా శ్రామికులు పని ప్రదేశంలో ఉండాల్సి వస్తోంది. ఈ విధానంతో మస్టర్ నమోదు చేసి పని ఎగ్గొట్టే పరిస్థితి ఉండదు.

అలసత్వం వహిస్తే చర్యలు: క్షేత్ర సహాయకులు తీసే చిత్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది. అలసత్వం వహించే కార్యదర్శి, మండల, జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో జాబ్‌కార్డులు: 2,67,000

వేతనదారులు: 4,79,000 మంది

అవసరాన్ని బట్టి హాజరయ్యేవారు: 2-3 లక్షల మంది

రోజూ పని చేస్తున్న శ్రామికులు: 35 వేల మంది

## కడలి.. హడలి

కాకినాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వరుసగా రెండో రోజూ యు.కొత్తపల్లి మండలం తీరప్రాంత గ్రామాలపై పడింది. ఉప్పాడ తీరంలో మత్స్యకారులను హడలెత్తిస్తోంది. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున గ్రామాలపై విరుచుకుపడుతున్నాయి. సూరాడపేట, జగ్గరాజుపేట, ఉప్పాడ, మాయాపట్నం, అమినాబాదు, కోనపాపపేట గ్రామాలు రాకాసి అలల ధాటికి కోతబారిన పడ్డాయి. రెండు రోజుల వ్యవధిలో 18 గృహాల వరకు సాగర గర్భంలో కలిసిపోయాయి. మరో 40 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. బుధవారం చక్కగా కనిపించిన రోడ్లు, గృహాలు మరుసటి రోజుకి ధ్వంసమైపోయిన పరిస్థితి.

**ఉప్పునీటి నడుమ..**

లోతట్టు గ్రామమైన మాయాపట్నం గ్రామంలోకి రెండోరోజు కూడా సముద్ర జలాలు చొరబడ్డాయి. ఉప్పునీటితో పాటు భారీగా వ్యర్థాలు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు నిరాశ్రయులయ్యారు. వలసలు వెళ్లినవారి ఇళ్లలో తాత్కాలికంగా తలదాచుకుంటున్నారు. కొంతమంది ఎక్కడ ఉండాలో తెలియక ప్రమాదమని తెలిసీ ఆ ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి వారి అవసరాలను తీర్చాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా ఆదేశాలు జారీ చేశారు. అయినా పాలకులు, అధికారులు అటుగా వెళ్లలేదు. మొదటిరోజు స్థానిక అధికారులు వచ్చి సహాయ చర్యలు చేపట్టి వెళ్లిపోయారు. బాధితులకు నీరు, ఆహారం, విద్యుత్తు తదితర సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాలు కోల్పోయి నిరాశ్రయులైన వారికి పునరావాస కేంద్రాలు కూడా లేవు.

**ఇరుగుపొరుగు ఇళ్లలో..**

మాయాపట్నానికి చెందిన దూడ పుష్ప మాట్లాడుతూ 'మేము ఉండే పూరిగుడిసె కూలిపోయింది. ఇరుగుపొరుగు ఇళ్లలో మా కుటుంబం తలదాచుకుంటున్నాం. ఎవరూ సాయం చేసింది లేదు. పింఛను సొమ్ముతోనే బతుకుతున్నాం. ఇంటికి వెళ్లాలన్నా అంత స్థోమత లేదు' అని వాపోయారు. మరో మహిళ మోసా రాజయ్యమ్మ మాట్లాడుతూ తన తల్లి, కుమార్తెతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నామన్నారు. అలల తాకిడికి ఇల్లంతా పాడైందని, పెంకులు రాలిపోయి, గోడలు నాని కూలే స్థితిలో ఉందన్నారు. భయంతో బయటకు వచ్చి ఇతరుల నివాసంలోని గడపలో తలదాచుకున్నట్లు తెలిపారు. వర్షానికి పొయ్యి కూడా వెలిగించే పరిస్థితి లేదన్నారు.

## ఆపద వేళ.. అత్యవసర సేవలు

దేవరపల్లి : ఈ నెల 20వ తేదీన దేవరపల్లి మండలం గౌరీపట్నం సమీపంలో ఓ కుటుంబం విశాఖపట్నం నుంచి ఏలూరు వైపు వెళ్తుండగా పెట్రోల్ అయిపోవడంతో కారు ఆగిపోయింది. దీంతో అందుబాటులో ఉన్న ఎస్ఓఎస్ బాక్సును ఉపయోగించడంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది పెట్రోల్‌ను తీసుకుని వచ్చి అందజేశారు. నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం గత నెలలో మరమ్మతులకు గురై ఆగిపోయింది. సమీపంలో ఉన్న ఎస్ఓఎస్ బాక్సు బటన్ నొక్కడంతో కంట్రోల్ రూమ్‌కి సమాచారం వెళ్లింది. హైవే సిబ్బంది మెకానిక్‌ని తీసుకుని వెళ్లి మరమ్మతులు చేయించారు. జాతీయ రహదారిలో ప్రయాణిస్తున్నప్పుడు అనేక జాగ్రత్తలు తప్పనిసరి. ఒక్కొక్కసారి సమస్యలు తలెత్తినప్పుడు ఎస్ఓఎస్(సేవ్ అవర్ సోల్స్) బాక్సుల ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారమిచ్చి సహాయం పొందవచ్చు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీటిపై అవగాహన ఎంతో అవసరం. జాతీయ రహదారిలో ప్రయాణం చేసేటప్పుడు నారింజ రంగులో బాక్సులు కనపడుతుంటాయి. వీటినే ఎస్ఓఎస్ బాక్సులు అంటారు. వీటి ద్వారా రోడ్డు ప్రమాదాలు, ఇతర సమస్యలను కంట్రోల్ రూమ్‌కి తెలియజేయవచ్చు. దీంతోపాటు మన చరవాణి ద్వారా 1033కి ఫోన్ చేస్తే హైవే అత్యవసర విభాగం నుంచి సాయం అందుతుంది.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..** తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో రాజమహేంద్రవరం రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పరిధిలో 377 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటిలో ప్రతి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక ఎస్ఓఎస్ బాక్సును ఏర్పాటు చేశారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనం మరమ్మతులకు గురి అయిన, ఇంధనం లేక ఆగిపోయిన, వెళ్లవచ్చిన ప్రాంతం తెలియకపోయినా, ప్రమాదంలో చిక్కుకున్నా, అనారోగ్యం, రోడ్డు ప్రమాదం బారిన పడటంలాంటి ఏ సమస్య ఎదురైనా బాక్సు వద్దకు వెళ్లి బటన్ నొక్కితే సాయం అందుతుంది. గుండుగొలను-కొవ్వూరు 16వ నంబరు జాతీయ రహదారిలోని 70 కిలోమీటర్లలో 50 ఎస్ఓఎస్ బాక్సులు ఉండగా ఏడాదికి 200 మంది వరకు వీటిని ఉపయోగిస్తున్నారు.

**సేవలు పొందవచ్చు..** ఎస్ఓఎస్ బాక్సుల గురించి అవగాహన సదస్సులు పెట్టి వివరిస్తున్నాం. ప్రతి బాక్సు వినియోగంలో ఉండేలాగ చర్యలు తీసుకుంటున్నాం. 1033 నంబరుకి ఫోన్ చేసినా వెంటనే స్పందించి సిబ్బంది సేవలు అందిస్తారు. రోహిత్‌కుమార్, హైవే పీడీ, రాజమహేంద్రవరం

# దివ్యాంగులకు తీపికబురు



నర్సీపట్నం : సదరం సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. దివ్యాంగుల పింఛన్లకు అవసరమైన స్లాట్లు బుక్ చేసుకునేందుకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. వైకాపా హయంలో వీటిల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనర్హులు అడ్డదారిలో కొందరు వీటిని పొందినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వీటి పునఃపరిశీలనకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్లాట్లను తాత్కాలికంగా నిలిపివేసింది. జిల్లాలో సదరం సేవల పునఃప్రారంభంలో జాప్యం చోటు చేసుకుంది. తాజాగా ఇటీవల వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పింఛన్ల కోసం దివ్యాంగులు మళ్లీ ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, నక్కపల్లి, కోటవురట్లలో సదరం సేవలకు ఏర్పాట్లు చేశారు. వీటిల్లో వైకల్యం శాతం ధ్రువీకరణ నిర్ధారణ పత్రాలు జారీ కోసం ఆర్థో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్థోతోపాటు చూపు, వినికిడి తదితర కేటగిరీల పరీక్షలకు స్లాట్ల ఆధారంగా నిర్ణీత రోజుల్లో దివ్యాంగులు తమకు కేటాయించిన ఆసుపత్రుల్లో సేవలు పొందుతున్నారు.

విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో జిల్లా వ్యాప్తంగా 41,824 మంది పింఛన్లు పొందుతున్నారు. గతంలో జిల్లాలో పింఛన్ల కోసం దరఖాస్తులు చేసిన మూడువేల మంది జాబితా పెండింగ్‌లో ఉండేది. అప్పటికే వీటిలో అవకతవకలు బయటపడుతున్న నేపథ్యంలో స్లాట్లు నిలిపివేశారు. వీటిసంఖ్య ఇప్పుడు వెయ్యికి పరిమితం కావడంతో బుకింగ్‌నకు అవకాశం ఇచ్చారు.

కోటవురట్ల ఆసుపత్రిలో ఆర్థో లేనందున నక్కపల్లి నుంచే డాక్టరు ఇక్కడికి వచ్చి సేవలు అందిస్తున్నారు. గతంలో నర్సీపట్నం ప్రాంతాల్లోనూ అనర్హులు అధికంగా పింఛన్లు పొందారన్న విషయమై శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సైతం తీవ్రంగా స్పందించి వీటిలో పక్కా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక పరిశీలనతో పక్కా ఏర్పాట్లు**

జిల్లాలోని నక్కపల్లి ఆసుపత్రుల్లో నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పకడ్బందీ ఏర్పాట్లతో పరీక్షలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఆసుపత్రిలోని వైద్యాధికారులు సైతం వీటిని పర్యవేక్షించేలా మార్గదర్శకాలు జారీ చేశాం. ఏవైనా అవకతవకలు బయటపడితే సంబంధిత ఆర్థో నిపుణులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఒత్తిళ్లకు తలొగ్గి అనర్హులను ఎంపిక చేస్తే కఠిన చర్యలు తప్పవు. డాక్టర్ శ్రీనివాస్, వైద్య విధాన పరిషత్తు సమన్వయకర్త, అనకాపల్లి

# నిఘా నేత్రం.. ఆలయాలకు అభయం



కాకినాడ : జిల్లాలో కరప సమీపంలోని సంపర శివాలయంలో దొంగలుపడి స్వామివారి బంగారు ఆభరణాలు దోచేశారు. ఆలయంలో సీసీ కెమెరా ఉన్నా.. నిర్వహణ లేక పనిచేయలేదు. దాంతో చోరీని ఛేదించడం కష్టంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలోని క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. సీసీ కెమెరా ఉన్నా.. సక్రమంగా పనిచేయలేదు. ఆభరణాలకూ బీమా చేయలేదు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు భద్రతాపరంగా, ఆలయ రక్షణకు కవచంగా ఉపయోగపడేలా నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించింది. పోలీసుశాఖ విజ్ఞప్తి, ప్రభుత్వపరంగా అనుమతులు రావడంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎన్ని ఆలయాలున్నాయి. వాటికి ఎన్ని సీసీ కెమెరాలున్నాయన్న దానిపై అధికారులు నివేదిక తయారు చేశారు.

**జిల్లాలో ఇలా..**

కాకినాడ జిల్లాలో చిన్న, పెద్ద ఆలయాలు 344 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో పలు ఆలయాల్లో ఇప్పటికే 858 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిలేక చాలా కెమెరాలు పనిచేయడం లేదు. మరికొన్ని చోట్ల పాడైపోవడంతో వాటిని మార్చనున్నారు. ఇంకా 1268 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిఉందని ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించారు.

**చర్యలకు సిద్ధం..**

దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని 6 ఏ, 6 బీ కేటగిరిలోని పెద్ద ఆలయాల్లో ఇప్పటికే కెమెరాలున్నాయి. 6 సీ కేటగిరిలోని చిన్నపాటి ఆలయాల్లో ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా దేవతా విగ్రహాల విధ్వంసాలు జరిగినా.. సరైన ఆధారాలు దొరక్క నిందితులపై చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం ఆలయాలకు రక్షణగా ఉండేలా, ఆభరణాలు, హుండీలు చోరీకి గురికాకుండా చర్యలకు శ్రీకారం చుట్టింది. చర్చిలు, మసీదుల్లోనూ నిఘా కెమెరాలు ఉండాలని సూచించింది.

**పర్యవేక్షణ చేయాలి..**

జిల్లాలోని అనేక ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇతర అన్ని ఆలయాల్లో ఏర్పాటుకు కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించాం. కొన్నిచోట్ల అధికారులు సక్రమంగా పర్యవేక్షించడం లేదు. ఈవోలు వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడల్లా తమ సెల్‌ఫోన్‌లలో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలి. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు. కనపర్తి నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయశాఖ అధికారి, కాకినాడ

# పారిశ్రామికవాడలు.. ఉపాధికి అడుగులు



కాకినాడ : ప్రతి నియోజకవర్గంలో ఒక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) లేదా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయం (ఎఫ్ఎఫ్‌సీ) ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. ఎక్కువమందికి ఉపాధి కల్పించేందుకు ఆస్కారమున్న ఈ యూనిట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనువుగా అభివృద్ధి చేస్తున్నారు. కాకినాడ ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం పరిధిలోని రాజానగరం నియోజకవర్గంలో కలవచర్ల పారిశ్రామికవాడను ఇప్పటికే సిద్ధంచేశారు. పెద్దాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు.. జగ్గంపేట, కాకినాడ గ్రామీణం, పిఠాపురం నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణ పనులను కార్యరూపంలోకి తెస్తున్నారు.

**ప్రాధాన్యం వారికే..**

తెదేపా ప్రభుత్వ హయాంలో వేములపల్లి, జేగురుపాడులో పరిశ్రమల అవసరాలకు ఏపీఐఐసీ ద్వారా భూములు సేకరించారు. ముందుకు వచ్చిన 70 మందికి ప్లాట్లు కేటాయించారు. వైకాపా సర్కారు వచ్చాక పేదలకు ఇళ్ల స్థలాలు కోసమంటూ ఆ భూములను తీసుకుని.. ప్రత్యామ్నాయంగా కలవచర్ల వద్ద 110 ఎకరాలు ఏపీఐఐసీకి అప్పగించారు. వాటిలోనే రూ.20 కోట్లతో పారిశ్రామిక వాడ అభివృద్ధి చేసి 390 ప్లాట్లను సిద్ధం చేశారు. గత తెదేపా ప్రభుత్వంలో కేటాయించిన లబ్ధిదారులకు తొలి ప్రాధాన్యం కింద అప్పటి ధరతోనే ఇవ్వాలని భావిస్తున్నారు. మిగతా ప్లాట్ల కోసం ఇప్పటికే 33 మంది దరఖాస్తు చేసుకోగా చ.మీ ధర రూ.3,241 నిర్ణయించారు. జీడి ప్రాసెసింగ్, ఫర్నిచర్, ఫ్యాబ్రికేషన్, ఇంజినీరింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు.

**కీలకం ఇవే..**

జిల్లాలో తీర ప్రాంతాన్ని అనుకుని భారీ పరిశ్రమలు వస్తున్నాయి. వాటికి అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) కంపెనీలతో మరింతమందికి ఉపాధి లభిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ యూనిట్లు స్థాపించొచ్చు.

పెద్దాపురం నియోజకవర్గంలో 29 ఎకరాల్లో రూ.13 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు పనులు మొదలయ్యాయి. 300 చ.మీ చొప్పున 175 ప్లాట్లను అభివృద్ధి చేస్తారు. 79 ఎల్ఈడీ వీధి దీపాలు, విద్యుత్తు నియంత్రికల ఏర్పాటుకు రూ.88 లక్షలతో టెండర్లు పిలిచారు.

పిఠాపురంలో రెండెకరాలు, వాకలపూడిలో మూడు, గండేపల్లి మండలం రంగంపేట వద్ద అయిదు ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలు నిర్మిస్తున్నారు. ఒక్కోదాంట్లో రూ.9.60 కోట్లతో 20 బ్లాక్‌లను ప్లగ్ అండ్ ప్లే విధానంలో అభివృద్ధి చేస్తారు. చ.అ లెక్కన అద్దె నిర్ణయించి యూనిట్లు కేటాయిస్తారు.

**ద్రాక్షారామలో ఇలా..**

కోనసీమ జిల్లాలో తొలివిడతగా ద్రాక్షారామలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇక్కడ భూములు కొంత లోతట్టుగా ఉండడంతో అంచనా విలువ రూ.11 కోట్లకు పెరిగింది. రెండో విడతలో అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తంలో మరో ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణం చేపడతారు. 6.5 ఎకరాల ప్రభుత్వ భూములను ఇప్పటికే గుర్తించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ అన్వేషిస్తున్నారు.

**అన్ని ప్రాంతాలు అభివృద్ధి..** ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలతో ఎక్కువమంది యువతకు ఉపాధి లభిస్తుంది. అన్ని ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి తేవాలని చూస్తున్నాం. రమణారెడ్డి, జడ్ఎం, ఏపీఐఐసీ, కాకినాడ

## వరదాయిని.. వదిలేయకని..!

కడియం : ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి ద్వారా సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఏటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలతో లంకలన్నీ ముంపునీట చిక్కుకుంటాయి. లక్షల ఎకరాల సాగుపై ప్రభావం ఉంటుంది. ఈ సారి జులైలో పెద్దగా ప్రభావం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలను బట్టి ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**ఈ సారైనా దృష్టి సారించాలి..**

ఏటా వరదల సమయంలో కొన్ని లక్షల క్యూసెక్కుల జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. బ్యారేజీ నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలు కాగా పేరుకుపోయిన ఇసుక తిన్నెల కారణంగా అది ప్రస్తుతం రెండు టీఎంసీలకు పడిపోయింది. 175 గేట్లలో 117 తుప్పుపట్టి ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

**అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..**



గోదావరికి 2022 జూన్‌లో తీవ్ర స్థాయిలో వరదలు వచ్చాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 20 అడుగులకు నీటి మట్టం చేరుకోగా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దాదాపు 10 రోజులపాటు ఈ పరిస్థితి కొనసాగింది. సుమారు 30 లక్షల క్యూసెక్కులకుపైగా జలాలను సముద్రంలోకి వదిలారు. దాంతో లంక ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఆ తరువాత 2023, 24లలో జులైలో వరదలొచ్చాయి. ఆయా సమయాల్లో దాదాపు 14, 15 అడుగులకు వరద చేరుకోగా 15 లక్షల నుంచి 20 లక్షల క్యూసెక్కుల జలాలను బ్యారేజీ దిగువకు వదిలేశారు. ఈ ఏడాది తక్కువ వర్షాల కారణంగా కేవలం 10 అడుగుల వరకే ప్రస్తుతం ప్రవాహం ఉంది.

ధవళేశ్వరం బ్యారేజీ సామర్థ్యం సరిలేక ఏటా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు

**వచ్చే నెల 10 తర్వాత**

ఆగస్టు 10 తర్వాత వరదలు వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉన్నారు. ప్రవాహం తగ్గుముఖం పట్టిన తర్వాత మంజూరైన నిధులతో మరమ్మతులు చేయిస్తాం. కె.గోపీనాథ్, గోదావరి హెడ్‌వర్క్స్ ఎస్ఈ, ధవళేశ్వరం

## కమీషన్లపై కన్నేసి.. పనులు ఆ'పేచీ'

కర్నూలు : కర్నూలు నగరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గుత్తేదారుల మధ్య సాగుతున్న కమీషన్ల పంచాయితీ అభివృద్ధికి విఘాతంగా మారింది. కమీషన్లు ఇస్తేనే అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారు.. క్వాలిటీ కంట్రోల్‌ను ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలంటూ ఇప్పటికే గుత్తేదారులు పనులు ఆపేశారు. ఆరు శాతం కమీషన్ ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు తాజాగా సమావేశం పెట్టి మరీ హుకుం జారీ చేయడం కలకలం రేపింది. చిన్న చిన్న పనులు చేయడానికీ పేచీ పెడుతున్నారు.. దీంతో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

**వారు ప్రారంభించరు.. వీరు పట్టించుకోరు**

నగరపాలక పరిధిలో దాదాపు రూ.40 కోట్లలో పనులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కొందరు గుత్తేదారుల చేతిలో రూ.కోట్ల విలువైన పనులు ఉన్నాయి. వారు నెలలు గడుస్తున్నా ప్రారంభించడం లేదు. అభివృద్ధి పనులు పూర్తవక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నగరంలోని కలెక్టరేట్ వద్ద ఎన్టీఆర్ కూడలిలో రూ.8 లక్షలతో చేపట్టిన



పచ్చదనం పెంపు, ఇతర పనులను ఇంతవరకు పూర్తి చేయలేదు. 31వ వార్డులోని బద్రినాథ్‌నగర్, శరీన్‌నగర్‌లో సీసీ కాలువలు, కల్వర్టులు నిర్మించేందుకు రూ.83.90 లక్షలతో ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. ఇంతవరకు నిర్మాణాలు మొదలే కాలేదు.

ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీనది పరివాహక ప్రాంతంలో రూ.10 లక్షలతో ఉద్యానవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నేటికీ పూర్తి కాలేదు.

**30 శాతం లెస్‌కు టెండర్లు**

అభివృద్ధి పనులు చేయాలనుకునే గుత్తేదారులు 5 శాతం కంటే లెస్‌కు టెండర్లు వేయకూడదు. 5 శాతం కంటే తక్కువకు టెండర్లు దక్కించుకుని చేపట్టిన పనులపై క్వాలిటీ కంట్రోల్ బోర్డు నాణ్యతా తనిఖీలు చేశాకే బిల్లులు మంజూరవుతాయి. కానీ కొందరు గుత్తేదారులు నగరంలో చాలా పనులను 30 శాతం వరకు లెస్‌కు వేసి దక్కించుకున్నారు. అసలే భారీ లెస్‌కు వేసిన వారి నుంచీ కమీషన్లు అడుగుతుండటంతో వారు పనులు ప్రారంభించలేదు. పనులు దక్కించుకుని నిర్మాణాలు ప్రారంభించని గుత్తేదారులపైన, లెస్‌కు టెండర్ వేసి పనులు చేయని గుత్తేదారులపై గత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారు కమీషన్లపైనే దృష్టి సారించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 30 శాతం లెస్‌కు దక్కించుకుంటే ఇక ఆ పనుల్లో ఏం నాణ్యత ఉంటుందని కొందరు గుత్తేదారులు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టినా పట్టించుకునే వారు కరవయ్యారు.

# అమ్మ కడుపునకు.. అనవసర కోత

తిరుపతి : సిజేరియన్ ప్రసవాలు కలవరపెడుతున్నాయి. రాష్ట్రస్థాయి కంటే జిల్లాలో ఎక్కువగా నమోదవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రసవాల నిర్దేశిత లక్ష్యానికి ఆమడ దూరంలో ఉండగా ప్రైవేటు ఆసుపత్రులు కత్తెరపోటుతో నిధులవేట సాగిస్తున్నాయి. రాష్ట్రంలో సిజేరియన్లు 42.2 శాతం ఉండగా తిరుపతి జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పరిశీలిస్తే అది ఏకంగా 47.74% ఉంది. సహజ ప్రసవాలు ప్రోత్సహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా ఒత్తిడి చేస్తున్నా ఫలించడం లేదు. డబ్బుల కోసమే కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు సిజేరియన్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా తిరుపతి, గూడూరు ప్రాంతాల్లోని కొన్ని మెటర్నిటీ ఆసుపత్రులు ఇదే వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించినట్లు ఆరోపణలున్నాయి. రూ.లక్ష వరకు బిల్లు తల్లిదండ్రుల చేతుల్లో పెడుతున్నాయి. ఎందుకు సిజేరియన్ చేయాల్సి వచ్చిందో వివరణ కోరే యంత్రాంగం లేకపోవడం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తన విధులను పూర్తిగా విస్మరించడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో అంతకంతకూ పెరుగుతున్నాయి.



**లక్ష్యానికి దూరంగా..** జిల్లాలోని 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకు పది.. ఆరు ఏరియా ఆస్పత్రుల్లో యాభై వరకు కాన్పులు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించగా కనీస లక్ష్యం చేరుకోకపోవడంతో డీసీ్మహెచ్ఎస్ బదిలీ వరకు వెళ్లింది. పీహెచ్సీల్లోని వైద్యులు గర్భిణుల్లో ఏమాత్రం ఇబ్బంది ఉన్నా ఏరియా, జిల్లా ఆస్పత్రులకు సిఫార్సు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

**కంగారు పెట్టి:** బిడ్డ అడ్డం తిరిగింది.. గర్భిణికి రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ నియంత్రణలో లేదంటూ భయభ్రాంతులకు గురిచేసి సిజేరియన్‌కు ఒత్తిడి చేస్తున్నారు. మరికొందరు నొప్పులు భరించలేమని సిద్ధపడుతున్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ కార్డుతో వచ్చే పేదలను డబ్బు కోసం మభ్యపెట్టి సిజేరియన్ అవసరమని నమ్మిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

**మారుతున్న జీవనశైలితో ఇబ్బందులు**

మొదటి కాన్పులో శస్త్రచికిత్స జరిగితే రెండో కాన్పునకు తప్పనిసరి అవుతోంది. వైద్య బీమా ఆసుపత్రులకు కలిసి వస్తోంది. మనం కాదుకదా చెల్లించేది అనే ధోరణితో భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను గుర్తించడం లేదు.

# 'ఆవాస'యోగమెన్నడో

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం పనులు చేపట్టి దాదాపు పూర్తి చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోగా పూర్తైన ఇళ్లకు రంగులు మార్చి చేతులు దులిపేసుకుంది. కనీస వసతులు కల్పించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు ఆనందంలో ఉన్నారు. తమకు ఇళ్లు మంజూరవుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు దసరా నాటికి గృహాలు అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**రూ.123 కోట్లు కేటాయిస్తే..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ పట్టణాల పరిధిలో 30,540 టిడ్కో ఇళ్లు నిర్మించారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.2,262.92 కోట్లు కాగా.. కాగా రూ.1,489.26 కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్లు అంచనా. ఇందులో రూ.1,467.84 కోట్ల విలువైన బిల్లులు చెల్లించారు. మరో రూ.123 కోట్ల మేర నిధులు కేటాయిస్తే పనులు పూర్తవుతాయని అంచనా.

**ఏళ్లుగా నిరీక్షణ**

టిడ్కో ఆధ్వర్యంలో మూడు రకాల ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మొదటి రకం 300 చదరపు అడుగులు, రెండో రకానికి సంబంధించి 365 చ.అ.లు, మూడోదానిని 430 చ.అ. విస్తీర్ణంతో నిర్మించారు. ఇందులో 300 చ.అ. నివాసాలను లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చారు. 365,



430 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి అర్హులైన పలువురు డబ్బులు చెల్లించారు. ఆయా భవనాలకు సంబంధించి కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతోపాటు టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు కల్పించడం.. రవాణా సౌకర్యం తదితర అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది.

**అద్దెలు చెల్లించలేక..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు సొంతంగా డబ్బులు చెల్లించడంతోపాటు బ్యాంకు రుణాలు తీసుకున్నారు. టిడ్కో గృహాలు చేతికందకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తోంది. టిడ్కో ఇళ్లకు సంబంధించి చాలామంది రుణాలు తీసుకుని నగదు చెల్లించారు. ఒకవైపు ఇళ్లు చేతికందకపోగా.. బ్యాంకుకు రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో ఇళ్లకు రూ.130 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరికొంత నిధులు కేటాయించి అసంపూర్తి పనులను పూర్తి చేసి తమకు అందించాలని లబ్ధిదారులు విన్నవిస్తున్నారు.

# పసి హృదయాల్లో వెలుగు రేఖలు..!



పెదవాల్తేరు : బుద్ధిమాంద్యం, మూగ, చెముడుతో పుట్టిన పిల్లలకు శిక్షణ ఇచ్చి సాధారణ జీవితం గడిపేలా కృషి చేస్తోంది పెదవాల్తేరులోని సన్‌ఫ్లవర్ ప్రత్యేక పాఠశాల. 40ఏళ్లుగా వేలాది మంది ప్రత్యేక పిల్లలను ఇక్కడ తీర్చిదిద్దారు. వివిధ థెరపీల ద్వారా శారీరక కదలికలను మెరుగుపర్చడంతోపాటు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. తద్వారా ఎంతో మంది చిరుద్యోగాలు చేస్తూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. ఈ సంస్థ సేవలను గుర్తించిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు ఇటీవల రూ.25లక్షల విలువైన బస్సును వితరణగా అందజేశారు.

**140 మంది దివ్యాంగ బాలలకు శిక్షణ**

పేద విద్యార్థుల కోసం 1986లో సన్‌ఫ్లవర్ పాఠశాలను ఎం.ఎన్.కుమారి ప్రారంభించారు. నాడు నగరంలో మానసిక దివ్యాంగులకు ప్రత్యేక పాఠశాలలు ఉండేవి కావు. వారికి సాధారణ పాఠశాలల్లో ప్రవేశాలు ఇచ్చేవారు కాదు. దీంతో మానసిక దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పనులు మానుకుని వారి ఆలనాపాలనా చూడాల్సి వచ్చేది. వారి దీనస్థితిని చూసి చలించిన ఎం.ఎన్.కుమారి ప్రత్యేక పాఠశాలగా మార్చారు. నాడు ప్రత్యేక ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆమే ఆ బాధ్యతలు స్వీకరించారు. రాన్రాను ఆదరణ పెరగడంతో సన్‌ఫ్లవర్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయి ప్రత్యేక పాఠశాలగా మార్పు చేశారు. ప్రస్తుతం ఇక్కడ 140 మంది మానసిక, ఇతర దివ్యాంగ బాలబాలికలు ఉన్నారు. వారికి ఉచితంగా భోజనం అందిస్తున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది 25 మంది పనిచేస్తున్నారు. పాఠశాలలో ప్రవేశాలు పొందాలనుకునేవారు 98499 12048/98499 12049 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు ఎం.ఎన్.కుమారి కోరారు.

**ఎలాంటి శిక్షణ ఇస్తున్నారంటే..**

బధిర బాలలకు మాటలు వచ్చేలా స్పీచ్ థెరపి ఇస్తున్నారు. తర్వాత అక్షరాలు, పదాలు నేర్పించి సాధారణ స్థితికి తీసుకొస్తున్నారు. పుట్టుకతో కాళ్లు, చేతుల వంకర, సెలబ్రల్ పాల్సీ, పోలియో, అంగవైకల్యంతో పుట్టిన పిల్లలకు ప్రతిరోజు ఫిజియో థెరపి ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు.

ఆటిజంతోపాటు బాగా అల్లరిచేయడం, కుదురుగా కూర్చోకపోవడం, గొడవలు పడటం వంటి లక్షణాలను పిల్లల్లో నియంత్రించడానికి ఆక్యుపేషనల్ థెరపి చేస్తున్నారు.

శారీరక కదలికలు మెరుగైన పిల్లలకు యోగా, డ్యాన్స్, మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, కంప్యూటర్, టైలరింగ్, ప్రమిదల తయారీలో శిక్షణ ఇస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు.

# పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు



రాంబిల్లి : ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) రెండో విడతగా చేపట్టిన భూసేకరణలో వీఆర్ అగ్రహారం గ్రామంలో ఉద్యాన పంటలకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ గ్రామంలోని భూములు కృష్ణంపాలెం రెవెన్యూ పరిధిలోకి వస్తాయి. వీటిని ఎనిమిదో బ్లాక్‌గా గుర్తించారు. 109 ఎకరాల్లో పరిహారం తీసుకోకుండా ఉండిపోయిన సుమారు 55 ఎకరాలకు చెందిన రైతులకు ఇటీవల చెల్లింపులు చేశారు. రాంబిల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ భూములను ఇచ్చేందుకు రైతులు తొలుత నిరాకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎకరాకు రూ.23 లక్షల చొప్పున ఇచ్చేందుకు ముందుకు రాగా రైతులంతా అంగీకరించారు. ఈ భూముల్లో కొంత విస్తీర్ణంలో కొబ్బరి తోటలున్నాయి. పది రోజుల కిందట ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.4,872 చొప్పున విలువ కట్టి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. కొబ్బరి చెట్లను లెక్కించి వాటి విలువను అంచనా వేయడంలో ఉద్యానశాఖ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబరు-59లో ఉన్న స్థలంలో కొబ్బరి తోటలున్నాయి. ఈ స్థలంలో ఉన్న ఒక్కో చెట్టుకు రూ.4,872 చొప్పున అంచనా వేసి ఆ మొత్తాన్ని రైతు ఖాతాలకు జమచేశారు. ఇదే సర్వే నంబరులో 1-60 ఎకరాల విస్తీర్ణంలో లాలం వెంకటలక్ష్మికి ఉన్న కొబ్బరి తోటలో ఒక్కో చెట్టుకు రూ.458 చొప్పున ఆమె బ్యాంకు ఖాతాకు జమచేశారు. ఇదే తరహాలో మరికొందరి రైతులకు జమచేయడంతో వారంతా లబోదిబోమంటున్నారు. లాలం నారాయణమూర్తి, ఆయన సోదరులకు అర ఎకరా విస్తీర్ణంలో కొబ్బరి తోట ఉంది. ఇందులోని చెట్లకు పరిహారం చెల్లించలేదని వారు చెబుతున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతుంటే మాకేం తెలియదంటూ సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. సెజ్ భూసేకరణ స్థలాల్లో ఉన్న కొబ్బరి చెట్లకు పరిహారం చెల్లింపులపై సమగ్ర విచారణ చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

**చెట్లున్నా పరిహారం ఇవ్వడం లేదు..- లాలం వెంకటలక్ష్మి, మహిళా రైతు**

వీఆర్ అగ్రహారం రెవెన్యూలో మా కుటుంబానికి అర ఎకరాలో కొబ్బరి తోట ఉంది. మా పక్క రైతులందరికీ కొబ్బరి చెట్లకు పరిహారం చెల్లించారు. మాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. పరిహారం ఇవ్వాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొబ్బరితోటను పరిశీలించి పరిహారం చెల్లించాలని కోరుతున్నాం.

**ఒక్కో చెట్టుకు రూ.458 లెక్కింపు..- లాలం వెంకటలక్ష్మి, అప్పన్నపాలెం**

సర్వే నంబరు 59-1లో 1.6 ఎకరాల్లో కొబ్బరి తోట ఉంది. రెండు నెలల కిందట ఎకరాకు రూ.23 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. కొబ్బరి చెట్ల ఇటీవల బ్యాంకు ఖాతాకు పరిహారం జమైంది. 20 ఏళ్ల కిందట నాటిన కొబ్బరితోట ద్వారా 15 ఏళ్లుగా ఫలసాయం వస్తోంది. ఒక్కో చెట్టుకు రూ.458 చొప్పున రూ.44 వేలు బ్యాంకు ఖాతాకు జమ చేశారు. పక్కనున్న రైతులకు ఒక్కో చెట్టుకు రూ.4,872 చొప్పున పరిహారం చెల్లించారు. అధికారుల తప్పిదాలతో తీవ్రంగా నష్టపోయా.

**వినతులిస్తే పరిశీలిస్తాం...- అనిత, ప్రత్యేక ఉపకలెక్టర్, ఏపీఐఐసీ భూసేకరణ విభాగం** సెజ్‌కు సేకరించే భూముల్లో ఉన్న ఉద్యాన పంటలకు ఆ శాఖ అధికారులు అంచనావేసి అందించిన జాబితా ప్రకారం రైతుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమ చేశాం. కొబ్బరి చెట్లకు సంబంధించి పరిహారం చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి రాలేదు. భూసేకరణ స్థలంలో కొబ్బరి చెట్లు ఉండి పరిహారం చెల్లించకపోయినా, చెట్లు ఉన్నా వాటిని గుర్తించకపోయినా, నిర్దేశించిన పరిహారం చెల్లించకపోయినా రైతులు అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. వినతులు అందజేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

**తేడాలుంటే న్యాయం చేస్తాం...- రహీమ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అనకాపల్లి జిల్లా** కొబ్బరి చెట్లకు సంబంధించి పరిహారం చెల్లింపుల్లో తేడాలు మా దృష్టికి రాలేదు. వారం రోజుల కిందటే బదిలీపై ఇక్కడకు వచ్చా. కొబ్బరి చెట్లకు పరిహారం చెల్లించేందుకు అంచనాలు రూపొందించిన జాబితాలను పరిశీలించి తేడాలుంటే నివేదికను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

# డ్రోన్ వినియోగం.. సేద్యం సులభతరం



పామిడి : అధునాతన పద్ధతులతో వ్యవసాయాన్ని సులభతరం చేసేలా డ్రోన్ల వినియోగం పెరిగింది. ప్రభుత్వం అందించి డ్రోన్లను రాయితీపై అందించేందుకు కొన్ని విధివిధానాలను ఉన్నాయి.

**విధివిధానాలిగో..!**

రైతులు ఐదుగురు సభ్యులుగా ఉండాలి. అందులో చురుగ్గా ఉన్న వ్యక్తిని పైలట్‌గా ఎంపిక చేస్తారు. ఇతనికి 50 ఏళ్ల లోపు వయస్సు ఉండాలి. కనీసం ఇంటర్మీడియట్ విద్యార్హతతో పాటు పాస్‌పోర్టు కలిగి ఉండాలి. పైలట్‌గా ఎంపిక కాబడిన రైతుకు గుంటూరు, హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తారు. శిక్షణకు అవసరమయ్యే రూ.75 వేలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. డ్రోన్ల కొనుగోలుకు డ్రోగో, విహంగ కంపెనీలను ఎంపిక చేశారు.

**రాయితీపై అందజేత**

డ్రోన్ల కొనుగోలుకు ప్రభుత్వ 80 శాతం, రైతు 20 శాతం వాటా చెల్లించాలి. ప్రభుత్వం డ్రోన్ల రాయితీ రుణానికి యూనియన్ బ్యాంకును నోడల్ బ్యాంకుగా కేటాయించారు. మరి ఇతర బ్యాంకుల్లోనైనా తీసుకునే అవకాశం ఉంది. డ్రోన్‌ను రైతు బృందానికి అందజేసిన తర్వాత బ్యాంకు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది కలిసి డ్రోన్ పనితీరును పర్యవేక్షిస్తుంటారు.

**ఉపయోగాలు :** ఇది వరకు పురుగుమందు పిచికారీతో రైతులు అనారోగ్య సమస్యలకు గురయ్యేవారు. డ్రోన్లతో ఆ పనులు చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు.

డ్రోన్ల వినియోగం ద్వారా 25 శాతం రసాయనాలు ఆదా అవుతాయి. స్ప్రేయర్లతో ఎకారకు 200 లీటర్ల నీరు అవసరమైతే డ్రోన్‌తో 10లీటర్ల సరిపోతుంది. డ్రోన్ 10 లీటర్ల పురుగు మందులను మోసుకెళ్లే డ్రమ్ము ఉంటుంది. ఎకరాకు మందులు పిచికారీ చేయడానికి కనీసం 8-10 నిమిషాల్లోపు సమయం పడుతుంది. ఎకరా పొలానికి మందు పిచికారీ చేడానికి రూ.600 తీసుకుంటున్నారు.

# అనుసంధానం.. అభివృద్ధికి మార్గం

నందికొట్కూరు : కర్నూలు-నందికొట్కూరు రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. కర్నూలు నగరంలో నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం 340సీ జాతీయ రహదారి వరకు గతంలో విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో తీవ్ర జాప్యం నెలకొంది. వివిధ సమస్యల నేపథ్యంలో గత రెండేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

**పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రస్తుతం రహదారి విస్తరణ పనులకు అన్ని చర్యలు చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించడం ద్వారానే పనులు ముందుకు సాగే అవకాశాలున్నాయి. బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడంతోపాటు మిగిలిన అడ్డంకులు తొలగిపోతే పనుల్లో వేగం పెరిగే అవకాశముంది. రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు సైతం తొలగిపోతాయి.

**కట్టడాల తొలగింపు**

కూటమి ప్రభుత్వ ఆదేశాలతో రహదారి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కర్నూలు-గుంటూరు రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాలు, పొలాలను స్వాధీనం చేసుకున్నారు. రహదారి ఆనుకుని ఉన్న ఇళ్లను పడగొట్టారు. భూపాల్ నగర్‌లో గృహాలు, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద దుకాణాలను తొలగిస్తున్నారు. ఈ పనులు



చురుగ్గా సాగుతున్నాయి. గార్గేయపురం చెరువు సమీపాన సైతం కొంతమేర కట్టడాలను తొలగించారు. ప్రస్తుతం విస్తరణ పనులు ప్రారంభమవడంతో నందికొట్కూరుకు వెళ్లే మార్గంపై సునాయాసంగా ప్రయాణించే అవకాశం ఏర్పడుతుంది. ఏడాదిలోగా పనులు పూర్తి కావొచ్చని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

కర్నూలు నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం శివారు వరకు 340సీ జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకుగాను రూ.87 కోట్ల వ్యయంతో 10 కి.మీ. మేర విస్తరణ పనులు చేపట్టారు. పనులు అసంపూర్తిగా ఉండటం.. దీనికితోడు భూసేకరణలో జాప్యం కారణంగా ముందుకు కదలలేదు. పనులు మధ్యలో ఆగిపోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద పనులు అసంపూర్తిగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

# ఫేకర్ శాశ్వత కార్మికులకు ఆర్థిక ప్యాకేజీ

గరివిడి : గరివిడి ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ (ఫేకర్)లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న 56 మంది కార్మికులకు యాజమాన్యం ఆర్థిక ప్యాకేజీని ఇచ్చి వారిని విధుల నుంచి తొలగించింది. దీనిపై కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ), పరిశ్రమ యాజమాన్యం ఇరు పక్షాలు పలు దఫాలు చర్చించి, చివరకు ఆర్థిక ప్యాకేజీపై పరస్పరం ఒక అంగీకారానికి వచ్చాయి. కార్మికులు కూడా సమ్మతించడంతో తొలగింపు ప్రక్రియ ముగిసింది.

దేశంలో 1956లో ఏర్పడిన మొట్టమొదటి ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ గరివిడి ఫేకర్. పారిశ్రామిక ముఖ చిత్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ పరిశ్రమ జిల్లాకే తలమానికంగా నిలిచింది. కాలక్రమేణా ఎదురైన సవాళ్లను తట్టుకోలేక ఆర్థిక సంక్షోభంలో కూరుకుంది. 2023 నవంబరు 15వ తేదీ నుంచి ఫేకర్‌కు శతశాతం లేఆఫ్‌ను ప్రకటించి మూత వేశారు. అప్పటి నుంచి పరిశ్రమలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులకు నెలకు 13 రోజుల చొప్పున లేఆఫ్ వేతనాలను యాజమాన్యం చెల్లిస్తూ వచ్చింది. ఇక పరిశ్రమ నిర్వహణ సాధ్యం కాదని, శాశ్వత కార్మికులకు ఆర్థిక ప్యాకేజీని ఇస్తామని, వారంతా విధుల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలన్న ప్రతిపాదన కార్మిక సంఘాల ముందు పెట్టింది. దీనిపై రెండు కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి యాజమాన్యంతో చర్చలు జరపగా అవి ఫలప్రదమయ్యాయి.

**పరిహారం ఇలా..**

యాజమాన్యంతో కుదిరిన పరిహారం ఒప్పందం మేరకే శాశ్వత కార్మికులు సర్వీసు నుంచి వైదొలగడానికి అంగీకరించినట్లు జేఏసీ నేతలు అంబళ్ల గౌరినాయుడు, కంది రామారావు తెలిపారు. మొత్తం 56 మంది శాశ్వత కార్మికులకు మిగిలి ఉన్న సర్వీసు కాలం రెండేళ్లలోపు ఉంటే ఆ కాలానికి నెలకు 15 రోజుల చొప్పున వేతనం లెక్కకట్టి మొత్తాన్ని చెల్లించేందుకు.. రెండేళ్లు పైబడి సర్వీసు ఉండే కార్మికులకు నెలకు 11.5 రోజుల చొప్పున లెక్కకట్టి మిగులు సర్వీసుకు మొత్తాన్ని చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. కార్మికులు అంగీకరించారని, యాజమాన్యం పరిహారం చెల్లింపులు చేస్తోందని తెలిపారు. పరిశ్రమలో కొన్ని సంవత్సరాల క్రితం రెగ్యులర్ అయిన మరో 116 మందికి కొత్తగా ఏర్పాటు చేస్తున్న మెటల్ రికవరీ ప్లాంటులో ఉపాధి అవకాశాలు కల్పించడానికి అంగీకరించారన్నారు. అంత వరకు వారికి లేఆఫ్ వేతనాలు చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు.

# వసతి కేంద్రాలు సిద్ధం

మయూరి : గత ప్రభుత్వం వసతి గృహాలను పట్టించుకోలేదు. దీంతో ప్రవేశాలు తగ్గిపోయాయి. కూటమి రాకతో పరిస్థితి మారింది. ఇప్పటికే సమస్యలను గుర్తించింది. తొలి దశలో మౌలిక వసతులు, భవనాలు, నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కళాశాల, పాఠశాలలకు సంబంధించి 47 బీసీ కేంద్రాలున్నాయి. 18 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన వాటికి పక్కా భవనాలున్నాయి. వీటిల్లో 20 కేంద్రాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. 19 చోట్ల పనులు పూర్తి కాగా.. మరోచోట తుదిదశకు చేరుకున్నాయి.

**రూ.3 కోట్లతో ప్రతిపాదనలు** పిరిడి, విజయనగరం, గంట్యాడ, అలుగోలు, జొన్నవలస, భోగాపురం ప్రాంతాల్లో కొత్త భవనాల కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. పరిపాలన పరంగా ఇంకా అనుమతులు రాలేదు. విజయనగరం, జొన్నవలసలోని వసతి గృహాల కోసం ఇటీవల ఎమ్మెల్యే అదితి గజపతిరాజు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

**రూ.4.65 కోట్లు మంజూరు** జిల్లాలో 30 ఎస్సీ వసతి కేంద్రాలున్నాయి. పీఎం అజయ్ పథకం ద్వారా గజపతినగరం, ఎస్.కోట బాలికల కేంద్రాలకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. ఆమోదం దక్కింది. 23 భవనాల మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు గతేడాది రూ.4.65 కోట్లు మంజూరయ్యాయి. 75 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

# క్రీడా మైదానాలా.. వ్యాపార కేంద్రాలా?

ఎలమంచిలి : జగన్ ప్రభుత్వం క్రీడా మైదానాలకూ వాణిజ్య విలువలు అద్దింది. ఆదాయార్జనే ధ్యేయంగా ఇండోర్ స్టేడియాలను లీజుకిచ్చింది. క్రీడాకారుల కోసం ఏర్పాటైన వీటిని అద్దె ప్రాతిపదికన కేటాయించడంతో ఆర్థికంగా బలంగా ఉన్న క్రీడాకారులే స్టేడియాలను ఉపయోగించుకుంటున్నారు. ఏడాది కిందట వైకాపా పాలన ముగిసింది. ఇండోర్ స్టేడియాల లీజు కాలపరిమితి జులై నెలాఖరుతో ముగియనుంది. కూటమి ప్రభుత్వం వీటిని అందరికీ ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎలమంచిలి, పోతినమల్లయ్యపాలెం, గోపాలపట్నంలలో ఇండోర్ స్టేడియాలు ఉన్నాయి. 2013లో పూర్తయిన వీటిని



జగన్ ప్రభుత్వం అధికారంలో రాగానే టెండర్లు పిలిచి లీజుకిచ్చింది. ఎలమంచిలిలోని స్టేడియంకు నెలకు రూ.17 వేల చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. పోతినమల్లయ్యపాలెం, గోపాలపట్నంలోని స్టేడియాలను నెలకు రూ.లక్షకుపైగా అద్దె వచ్చేలా లీజుకు ఇచ్చారు. మూడు స్టేడియాలను లీజుకు ఇవ్వడంతో క్రీడాకారులు డబ్బులు చెల్లించి షటిల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ తదితర ఇండోర్ క్రీడలు ఆడుకోవాల్సి వస్తోంది. లీజు కంటే ఆదాయం తక్కువగా వస్తుండటంతో పోతినమల్లయ్యపాలెం, గోపాలపట్నం స్టేడియం గుత్తేదారులు అద్దె చెల్లించలేమని చేతులెత్తేశారు. ఎలమంచిలి స్టేడియం గుత్తేదారు నష్టాలొస్తున్నా అద్దె చెల్లిస్తున్నారు. స్టేడియం ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిలో జనరేటర్లను ఉంచుతున్నారు. స్టేడియం చుట్టూ ఉన్న ఖాళీ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తే కబడ్డీ, వాలీబాల్ ఆడుకునేందుకు అనువుగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియాల లీజును పొడిగించడమో, పునరుద్ధరించడమో చేయకుండా క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముంది.

# పచ్చదనం.. సంరక్షిద్దాం



అనంతపురం : హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పచ్చదనం పెంచేందుకు సామాజిక వన విభాగం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా రైతుల పొలాల్లో, జనావాసాల మధ్య భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఒక్కో రైతుకు వంద మొక్కల చొప్పున ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

**12 నర్సరీల్లో.. 30 లక్షల మొక్కల పెంపకం**

జిల్లాలో సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో 12 నర్సరీల్లో 30 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. గుమ్మఘట్ట మండలం అడిగుప్ప, కుందుర్పి మండలం ఎనుములదొడ్డి నర్సరీల్లో 2,85 లక్షలు చొప్పున, రాయదుర్గం మండలం బొందనకల్లు నర్సరీలో 2.10 లక్షలు, తాడిపత్రి మండలం వైజీ పల్లిలో 2.75 లక్షలు, పెద్దవడుగూరు నర్సరీలో 2.35 లక్షలు, యాడికి మండలం తుట్రాళ్లపల్లి నర్సరీలో 2.10 లక్షలు, గార్లదిన్నె నర్సరీలో 2.85 లక్షలు, ఎస్‌కేయూ నర్సరీలో 1.25 లక్షలు, ఉరవకొండ మండలం పెన్నహోబిలం నర్సరీలో 2.67 లక్షలు, విడనపకల్లు నర్సరీలో 50 వేలు, శింగనమల మండలం సలకంచెరువు నర్సరీలో 3.22 లక్షలు, పుట్లూరులో 1.50 లక్షలు, యల్లనూరులో 1.25 లక్షలు, బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురంలో 1.25 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. ప్రధానంగా వేప, కానుగ, ఉసిరి, ఎర్రచందనం, నేరేడు, టేకు, ఎర్రతురాయి, అక్షతురాయి, నిద్రగన్నేరు, బొప్పాయి, దిరేశనం తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

**పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్ ఉంటేనే..**

పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు ఉన్న రైతులకు మొక్కలు పంపిణీ చేస్తారు. ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పెంచుకునే వారికి ఉచితంగా మొక్కలు పంచుతారు. ప్రైవేటు పరిశ్రమలు, ఇతరత్రా వాటికి మాత్రం బ్యాగు సైజు 4-7 ఉంటే రూ.5, 5-9 బ్యాగుకు రూ.8, 6-12 బ్యాగుకు రూ.10 చొప్పున సొమ్ము చెల్లించాలి. మొక్కలు కావాల్సిన వారు నంబరులో 83175 72080 సంప్రదించాలి.

**మొక్కల సంరక్షణే ముఖ్యం**

మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో.. వాటిని సరంక్షించడం అంతే ముఖ్యం. ప్రతి ఒక్కరు దీన్ని దృష్టిలో ఉంచుకుని చెట్లను కొట్టేయొద్ధు సంరక్షిద్దాం అన్న నినాదంతో పచ్చదనం పెంచేందుకు ప్రతిఒక్కరు సహకారం అందించాలి. దివాకర్, డీఎఫ్‌వో (సామాజిక వన విభాగం)

# వైకాపా పాపం పం(మం)డుతోంది...

చిత్తూరు : జిల్లాలో అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నప్పటికీ తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో విద్యుత్తు వినియోగం మరింత పెరిగింది.. గృహ, వ్యవసాయ సర్వీసుల వినియోగం పెరగడంతో ఉప కేంద్రాలు, నియంత్రికలపై లోడు అధికమై అవి మండుతున్నాయి. మే, జూన్ నెలలో ఇప్పటి వరకు 1,060 నియంత్రికలు దగ్ధమైనట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఎస్‌పీడీసీఎల్‌లో నాటి పాలకుల నుంచి అధికారుల వరకు ఇష్టానుసారంగా దోచుకోవడమే తప్ప సంస్థ బాగోగులు, వినియోగదారుల గురించి పట్టించుకోకపోవడంతోనే ప్రస్తుతం ఇబ్బడి ముబ్బడిగా నియంత్రికలు దగ్ధమవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

వైకాపా పాలనలో విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రాలు, నియంత్రికల నిర్వహణను పూర్తిగా విస్మరించారు. వాటి విద్యుత్తు శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనే అవసరం లేకున్నా ఉపకేంద్రాల ఏర్పాటుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఉపకేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఆగిపోగా లైన్ల నిర్వహణ పూర్తిగా మరిచారు. ఈ నిర్లక్ష్యం ఫలితంగా వేసవిలో సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజి సమస్యలు అధికమయ్యాయి. మే, జూన్ నెలలో ఇప్పటి వరకు చిత్తూరు కేంద్రానికి 550,



పలమనేరుకు 260, పుంగనూరుకు 250 నియంత్రికలు తరలించారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖ ప్రక్షాళనపై దృష్టి సారించింది. లో ఓల్టేజీ, సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాలకు తరలిస్తున్న నియంత్రికలకు వెంటనే మరమ్మతులు చేసి వినియోగదారులకు అందజేస్తున్నారు.

**ఎందుకిలా..?**

ఏపీ ఎస్‌పీడీసీఎల్‌లో వైకాపాకు అంటకాగిన అధికారుల హవానే నేటికీ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే ఉద్దేశంతో కొందరు ఉన్నతస్థాయి అధికారులు అనాలోచిత నిర్ణయాలు, పర్యవేక్షణ లోపించడం, తప్పు చేసిన అధికారులను తప్పించగా మళ్లీ బాధ్యతలు అప్పగిస్తున్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో లైన్లు, నియంత్రికల నిర్వహణ గాలికొదిలేశారు. పుంగనూరు, పలమనేరు సబ్-డివిజన్లతో పాటు కార్వేటినగరం తదితర మండలాల్లో ఏఈలు, సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని కట్టడి చేయాల్సిన ఉన్నతాధికారులు తమకేమీ పట్టన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఫెయిల్యూర్లు తగ్గించేందుకు చర్యలు..** - ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

నియంత్రికల ఫెయిల్యూర్లు మరింతగా తగ్గించేందుకు దృష్టి సారించాం. విద్యుత్తు లైన్ల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నాం.

# సాగు పత్రం.. నిబంధనల చట్రం

కర్నూలు : కౌలుదారులకు అండగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంటసాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) అందించాలని ఆదేశించింది. కానీ నిబంధనలు గుదిబండలా మారాయి. సీసీఆర్‌సీ పత్రాలు పొందేందుకు భూ యజమాని అంగీకార పత్రం తప్పనిసరి. దీనికి చాలామంది భూ యజమానులు ససేమిరా అంటున్నారు. వీరు సుముఖత వ్యక్తం చేసినా శాఖల మధ్య సమన్వయ లోపంతో కౌలు రైతులకు కార్డులు అందడం గగనంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాల పంపిణీ నత్తనడకన సాగుతోంది. ఏప్రిల్, మే నెలల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో గ్రామాల్లో సభలు నిర్వహించి సీసీఆర్‌సీ పత్రాలు జారీ చేయాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 వేల మందికి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది.

**నిబంధనల చిక్కుముళ్లు**

కౌలు చట్టం నిబంధనలు సాగుదారులకు అడ్డంకిగా మారాయి. 2009 సంవత్సరానికి ముందు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులు ఇచ్చేవారు. సీసీఆర్‌సీ వచ్చిన తర్వాత యజమాని అంగీకార పత్రం తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో చాలామంది భూ యజమానులు నిరాకరిస్తున్నారు. తమ భూమిపై హక్కు కోల్పోతామని అనుమానిస్తున్నారు.

**ముందుకు సాగని ప్రక్రియ**

సీసీఆర్‌సీ కార్డుల కాలపరిమితి 11 నెలలు మాత్రమే. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 వేల సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం



లక్ష్యం నిర్దేశించింది. గడిచిన రెండున్నర నెలల వ్యవధిలో 9,422 కార్డులను మాత్రమే పంపిణీ చేశారు. ఇందులోనూ రెన్యూవల్స్ ఎక్కువగా ఉండగా.. కొత్తగా పంపిణీ చేసింది కేవలం రెండు వేల లోపే ఉండటం గమనార్హం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు.

**బాధ్యత ఎవరిది?**

రైతులు ఇప్పటికే విత్తుకు సన్నద్ధమవుతున్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో ఏప్రిల్ నుంచి మే నెలాఖరులోగా కౌలుదారులు, భూ యజమానులతో గ్రామసభలు ఏర్పాటుచేసి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ ముందుకొచ్చినా రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదు.

**రుణ పంపిణీ అంతంతే**

ఉమ్మడి జిల్లాలో గతేడాది 50 వేల మందికిపైగా కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. 2024-25లో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రూ.150 కోట్లకుపైగా పంట రుణాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలివ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్ణయించారు. చాలా బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. గతేడాది రూ.4 కోట్లు కూడా మంజూరు చేయలేదన్న విమర్శలున్నాయి. 2025-26లో రూ.150 కోట్ల మేర ఇవ్వాలని నిర్ణయించారు. మరి ఎంతమందికి ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

# 'బాబోయ్ దండు'కోవడమే!



విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్లానింగ్ విభాగం తీరుపై విమర్శలు వస్తున్నాయి. కొందరు అక్రమ వ్యవహారాలను పక్కా ప్రణాళికతో సాగిస్తున్నారు. అనుమతుల పేరుతో బాహాటంగానే వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాస్టర్‌ప్లాన్ పునఃపరిశీలనను అడ్డంపెట్టుకొని భారీగా దండుకుంటున్నారు. పలువురు ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్)లు కీలక అధికారులతో కలిసి తెరవెనుక ఉండి కథ నడిపిస్తున్నారు. 'వీఎంఆర్‌డీఏ'కు కూతవేటు దూరంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో అక్రమాలకు వ్యూహ రచన సాగిస్తున్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ, అనుమతులకు ఇక్కడే బేరాలు సాగిస్తున్నారు. అన్ని సక్రమంగా ఉన్న దస్త్రాలకూ ఈ బెడద తప్పడం లేదు. తాజాగా బృహత్తర ప్రణాళికలో మార్పులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి.. దరఖాస్తుదారులతో మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా భూవినియోగ మార్పిడి, రోడ్ల వెడల్పు తగ్గించడం, పెంచడం వంటి అంశాలపై లావాదేవీలు సాగిస్తున్నారు.

**ఇలా అయితే ఎలా?:** కూటమి ప్రభుత్వం విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పట్టాలెక్కించేందుకు శ్రమిస్తోంది. బృహత్తర ప్రణాళిక రోడ్లు, మెట్రో రైలు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ అనుసంధాన రోడ్లు వంటివి ఇందులో ఉన్నాయి. వీటిలో వీఎంఆర్‌డీఏది క్రియాశీలక పాత్ర. ఇంతటి ముఖ్య సమయంలో ఆ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు కొన్ని అనుమతుల విషయంలో సంబంధంలేనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యలకు పరిష్కారమార్గాలు చూపకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తోంది.

మరో వైపు మాస్టర్‌ప్లాన్‌పై వచ్చిన అభ్యంతరాలను ఏ విధంగా పరిష్కరిస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం ఉన్నవారికి గతంలో పనిచేసిన అనుభవం లేకపోవడంతో ఇబ్బందులు మరిన్ని ఎక్కువయ్యేలా ఉన్నాయి. ఈ విభాగంలో కొందరు ఒకే పోస్ట్‌లో ఏళ్లుగా పనిచేయడం, బదిలీలు లేకపోవడం గమనార్హం.

**ఫిర్యాదులకు పరిష్కారమేది?**

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోవడంలో అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాని విమర్శలొస్తున్నాయి. ఫలితంగానే ప్రతి సోమవారం జరిగే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి వచ్చినవారే వస్తున్నారు. కొద్ది రోజుల కిందట లేఅవుట్ ప్లాన్ విషయంలో ఓ తహసీల్దార్ ఈ కార్యాలయం చుట్టూ రెండు నెలలు తిరిగినా పట్టించుకోలేదు. లిఖితపూర్వకంగా వినతిచ్చినా చేయలేదు. మధురవాడలోని సదాశివనగర్ ప్లాట్ యజమానులు నిర్మాణాలకు అనుమతివ్వాలని కార్యాలయం చుట్టూ తిరిగినా పక్కనపెట్టేశారు. చివరికి సమస్య సీఎంవో దృష్టికి వెళ్తేగాని ఎన్‌వోసీ మంజూరు చేయలేదు. పెండింగులోని కోర్టు కేసుల పరిష్కారంలోనూ తాత్సారం చేస్తున్నారు. ఎల్‌టీపీలు, మధ్యవర్తులు కార్యాలయానికి రావొద్దని కమిషనర్ చెప్పడంతో వారంతా బయట కొత్త కార్యాలయాలను తెరిచి వసూళ్లకు తెగిస్తున్నారు.

# పంటల బీమా.. రైతుకు ధీమా

తిరుపతి : ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోకుండా ప్రభుత్వం రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఖరీఫ్ సీజన్-2025కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పునర్నిర్మించిన వాతావరణ పంటల బీమా (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) అనే రెండు పథకాలను ప్రవేశ పెట్టింది. రైతు లు గడువులోపు ఈ బీమాలను తీసుకుని పంట నష్టపోయినప్పుడు ఆర్థికంగా సాయం పొందొచ్చు.


**పీఎంఎఫ్‌బీవై..** ఈ పథకం కింద దిగుబడి ఆధారంగా వరి, సజ్జ రెండు పంటలను ఖరీఫ్ కాలానికి గుర్తించారు. వరి పంటకు గ్రామాన్ని బీమా యూనిట్‌గా, సజ్జ పంటకు జిల్లాను బీమా యూనిట్‌గా పరిగణిస్తా రు. తిరుపతి జిల్లాలో ఫ్యూచర్ జనరలీ అనే కంపెనీ ఏజెన్సీగా బీమాకు పనిచేయనుంది.

**నమోదు విధానం**

నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ)లో ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చు. బ్యాంకులో జూన్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంక్ సిబ్బంది పంటకు ఇచ్చిన రుణం నుంచి ప్రీమియం సొమ్ము, బీమా కోసం జమచేస్తారు. పంట బీమా వద్దనుకున్న రైతులు ఒక దరఖాస్తు ఫారంలో బ్యాంక్ వారికి చివరి తేదీకి వారం ముందే సమర్పించాలి. తర్వాత బ్యాంక్‌లు ప్రీమియం సొమ్మును అమలు చేస్తే కంపెనీకి జమ చేస్తాయి.

**కావాల్సిన పత్రాలు**

ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, కౌలురైతులు సీసీఆర్‌సీ పత్రం, రైతు డిక్లరేషన్ లేని పక్షంలో పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం, రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సిబ్బంది జారీ చేస్తారు. ఇ-పంట నమోదు చేసుకున్న పత్రం, మొబైల్ నంబరు, రైతు సేవింగ్ బ్యాంక్ ఖాతా మొదటి పేజీ పత్రాలు అవసరం.



**ప్రీమియం వివరాలు**

వరి పంటకు ఇన్సూరెన్స్ రూ.1,05,000 హెక్టారుకు. రైతులు కట్టాల్సిన ప్రీమియం సొమ్ము రూ.420 హెక్టారుకు లేదా ఎకరానికి రూ.168. సజ్జ పంటకు ఇన్సూరెన్స్ రూ.40 వేలు హెక్టారుకు, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం రూ.160 హెక్టారుకు లేదా ఎకరానికి రూ.64 ఉంటుంది. రైతులు ప్రీమియం చెల్లించాల్సిన చివరి తేదీలు వరి పంటకు 15 ఆగస్టు 2025, సజ్జ పంటకు 31 జులై 2025లోపు చెల్లించాల్సి ఉంది.

**రుణం తీసుకోని రైతులు**

పంట రుణం తీసుకోని రైతు లు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు.

**ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్..** పథకం కింద తిరుపతి జిల్లాలో వేరుసెనగ, నిమ్మ పంటలు గుర్తించారు. మండలాన్ని యూనిట్‌గా గుర్తించారు. వేరుసెనగ పంటకు ఇన్సూరెన్స్ రూ.70వేలు హెక్టారుకు, రైతులు చెల్లించవలసిన ప్రీమియం రూ.1400 హెక్టారుకు లేదా రూ.560 ఎకరానికి. 15 జులై లోపు చెల్లించాలి. నిమ్మ పంటకు ఇన్సూరెన్స్ రూ.1.25 లక్షలు హెక్టారుకు, రైతులు చెల్లించాల్సినది రూ.6250 హెక్టారుకు లేదా రూ.2500 ఎకరానికి. 15 జులై లోపు చెల్లించాలి.

# కళ్లెదుట ప్లాంట్లు.. నీరు రాక పాట్లు




విశాఖపట్నం : జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో రక్షిత తాగునీరు అందుబాటులో లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వైకాపా హయాంలో నాడు-నేడు పథకంలో కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నెలకొల్పారు. మొదటి దశలో పనులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత కొరవడింది. దీంతో చాలా ప్లాంట్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దాతల సహకారంతో పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్లదీ అదే దుస్థితి. వేసవి సెలవుల్లో ఎక్కువ రోజులు వినియోగించకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. జోన్ 8లో పెందుర్తి, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ తాగునీరు సరఫరా చేస్తుండగా.. మిగిలిన పాఠశాలల్లో కుళాయి నీరే దిక్కవుతోంది. ఎక్కువ శాతం పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచే నీళ్ల సీసాలు తెచ్చుకుంటున్నారు. ఇక్కడా అవస్థలే: రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలగా పేరుగాంచిన మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 3 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. తాగునీటి సమస్యను అధిగమించడానికి 2015, 2019లో వివిధ సంస్థల ఆధ్వర్యంలో రెండు నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటుచేశారు. ముందు ఏర్పాటుచేసిన ప్లాంటు మూలకు చేరింది. 2019లో అమర్చిన ప్లాంటు పలుమార్లు మరమ్మతులకు గురికావడంతో అప్పట్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి.. గతేడాది ఉద్యోగ విరమణ చేసిన ఎం.రాజబాబు సొంత నిధులతో వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆ ఆర్వో ప్లాంటు నుంచే ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు మంచినీళ్లు పట్టుకుని దాహం తీర్చుకుంటున్నారు. అధిక శాతం ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు.

**రూ.12 కోట్లతో పనులు:** రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో తాగునీటి సరఫరా కోసం దాదాపు రూ.12 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. 11 మండలాల్లోని 165 పాఠశాలల్లో 116 తాగునీటి ట్యాంకులు అమర్చారు. అప్పట్లో నాణ్యత పట్టించుకోకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వేపగుంట జడ్పీ పాఠశాలకు నాడు-నేడు కింద మంజూరైన ప్లాంట్లు కొద్దిరోజులకే మూలకు చేరాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహణకు సరిపడా నిధులు రాకపోవడంతో ఉపాధ్యాయులు బాగుచేయించలేక వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పరిస్థితి మారలేదు. గతంలో రెడ్డీస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అందించిన మరో ఆర్వో ప్లాంటు కూడా పనిచేయట్లేదు.

**పరిష్కారానికి చర్యలు -చంద్ర శేఖర్, ఏపీసీ, సమగ్రశిక్షా**

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరిచే సమయానికే అన్ని స్కూళ్లలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. సమగ్ర శిక్షా పరిధిలోని ఇంజినీర్లు పాఠశాలల్లో సాంకేతిక సమస్యలు గుర్తించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్లాంట్లు పనిచేయని విషయం మా దృష్టికి రాలేదు. వీలైనంత త్వరగా పరిశీలించి.. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా చూస్తాం.




## తమన్నా ఏమి చేసింది నేరం.. ఆమెపై ఎందుకు కన్నడ కోపం?

మైసూర్ శాండల్ సోప్ ఎంతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే. అలాంటి సోప్ బ్రాండ్ అంబాసిడర్ గా నటి తమన్నా ఎంపికయ్యారు. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. రెండేళ్ల కాలానికి రూ. 6.2 కోట్లు చెల్లించేలా "కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ సంస్థ" (కే.ఎస్.డీ.ఎల్) ఆమెతోఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఈ విషయం కన్నడ నాట కొత్త రచ్చకు తెరలేపింది. అవును... మైసూర్ శాండిల్ సోప్ కు బ్రాండ్ అంబాసిడర్ గా తమన్నాతో కే.ఎస్.డీ.ఎల్. ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సోప్ తో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉత్పత్తులకు కూడా ఆమె ప్రకటనలు చేయనున్నారు. దీంతో.. కన్నడనాట వివాదానికి తెరలేచింది. కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎందుకు ఎంచుకున్నారంటూ విమర్శలు మొదలయ్యాయి. ఈ సమయంలో సోషల్ మీడియా వేదికగా కొంతమంది ఆమెను అభినందిస్తుంటే.. మరికొంతమంది మాత్రం కర్ణాటక ప్రభుత్వంతో పాటు ఆమెపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. కన్నడ ప్రజల మనోభావాలను



దెబ్బతీసిందంటూ విమర్శిస్తున్నారు. కర్ణాటకలో ఉన్న ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో... కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. ఈ సబ్బులపై రాష్ట్రంలో ఇప్పటికే మంచి డిమాండ్ ఉందని.. ఈ నేపథ్యంలో ఈ ప్రొడక్ట్ ని దేశ వ్యాప్తంగా విస్తరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరణ ఇచ్చారు. పలువురు వాణిజ్య నిపుణుల సలహాతోనే తమన్నాను ఎంపిక చేసినట్లు మంత్రి క్లారిటీ ఇచ్చారు. అయితే.. ఈ వివాదంపై తమన్నా ఇంకా స్పందించ లేదు! కాగా... 1990 సంవత్సరంలో మైసూర్ రాజు కృష్ణరాజ్ వడియార్-4.. మైసూర్ శాండిల్ సోప్ సంస్థను బెంగళూరులో స్థాపించారు. ఈ క్రమంలో 1916లో సబ్బుల తయారీలో వేగవంతమైన ఈ సంస్థ... కర్ణాటకతో పాటు దక్షిణ భారతదేశంలో ఎంతో పేరు తెచ్చుకుంది. అలాంటి చరిత్ర కలిగిన సంస్థకు తమన్నాను బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేయడం.. అమె కెరీర్ లో మైలురాయి అని అంటున్నారు. అయితే... ఈ ఎంపికను కొంతమంది కన్నడిగులు మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు! కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎంచుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

## ఇన్నర్‌లో సిద్ధిక రెబల్ యాటిట్యూడ్

సిద్ధికా శర్మ పరిచయం అవసరం లేదు. నేచురల్ స్టార్ నాని సరసన పైసా వసూల్ చిత్రంలో నటించింది. కానీ టాలీవుడ్ లో ఈ భామకు కలిసి రాలేదు. అటు హిందీ పరిశ్రమలో ప్రయత్నించినా కానీ, ఆశించినంతగా పాపులర్ కాదు. అడపాదడపా పంజాబీ మ్యూజిక్ ఆల్బమ్ లతో అభిమానులకు మాత్రం టచ్ లో ఉంది. తాజాగా సిద్ధిఖి శర్మ మరో పంజాబీ సింగిల్ తో అభిమానుల ముందుకు వచ్చింది. అయితే సిద్ధిక శర్మ సోషల్ మీడియాల్లో తన అభిమానులకు కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్నర్ సొగసును ఎలివేట్ చేస్తూ, కుర్రకారు హృదయాలను స్పర్శించింది. బ్లాక్ కలర్ ఇన్నర్, కాంబినేషన్ బ్లాక్ ట్రాక్ ని ధరించిన సిద్ధిక రెబలియన్ స్టైల్లో ఫోజులిచ్చింది. బ్లాక్ ఇన్నర్ పై కవరింగ్ కోట్ ని కూడా ధరించింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే సిద్ధిక సినిమాలు,



సిరీస్ లతో బిజీగా ఉంది. మరోవైపు సింగిల్స్ లోను నర్తిస్తోంది. ఇటీవలే విడుదలైన ఓయే మఖ్నా నుండి రొమాంటిక్ ట్రాక్ ఎన్హా అంఖియాన్ చ్ పావా కివే కర్రా%-%లో కొత్త జంట సిద్ధికా శర్మ - అమ్మీ విర్క్ పై గీతం. ఇప్పుడు టి సిరీస్ భూషణ్ కుమార్ నిర్మించిన తాజా ఆల్బమ్ లో సిద్ధిక మరోసారి మెరిసింది. అద్భుతమైన ఎమోషన్స్ పలికిస్తూ మంచి సాహిత్యంతో పాటల్ని స్వరపరిచే గాయకుడు-స్వరకర్త మనన్ భరద్వాజ్ రొమాంటిక్ గీతం మై తేరే సంగ్ లో సిద్ధికకు అవకాశం కల్పించారు. ఇది ఒక అందమైన రొమాంటిక్ సాంగ్. ఒక చిన్న టౌన్ లో అందంగా మలిచారు. మానవ్ తో సిద్ధిక రొమాన్స్ గొప్పగా పండింది. ఈ పాటకు సాహిల్ బఘ్రా దర్శకత్వం వహించారు. ఇప్పుడు అన్ని స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది. బాలీవుడ్ - పంజాబీ మ్యూజిక్ సర్క్యూట్‌లో ఇప్పటికే సుపరిచితమైన పేరు మనన్ భరద్వాజ్, యానిమల్ నుండి అర్జన్ వైల్లీ, యారియన్ 2 నుండి ఊంచి ఊంచి దీవారేన్ లతో పాపులరయ్యాడు. అతడి నుంచి లేటెస్ట్ సాంగ్ మై తేరే... ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## బీస్ట్ మోడ్ లో శివాత్మిక






హీరోయిన్ అంటే ఎవరైనా సరే తప్పనిసరిగా ఫిట్‌నెస్ మెయిన్‌టెయిన్ చేయాల్సిందే. ప్రస్తుతం సినిమాల్లేవు కదా అని ఇష్టమొచ్చినట్టు తిని కూర్చోడానికి లేదు. అందుకే హీరోయిన్లు ప్రతీరోజూ జిమ్ చేస్తూ తమ బాడీని ఫిట్ గా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. టాలీవుడ్ లో ఎంతోమంది ఫిట్‌నెస్ ఫ్రీక్స్ ఉండగా ఇప్పుడు ఆ లిస్ట్ లోకి యాంగ్రీ హీరో రాజశేఖర్ కూతురు శివాత్మిక కూడా చేరింది. ఆనంద్ దేవరకొండతో కలిసి దొరసాని సినిమాతో వెండితెర అరంగేట్రం చేసిన శివాత్మిక రాజశేఖర్ చివరిగా రంగ మార్తాండలో కనిపించింది.

ఆ సినిమా తర్వాత శివాత్మిక మరో సినిమాను అనౌన్స్ చేసింది లేదు. అయితే శివాత్మిక సిల్వర్ స్క్రీన్ కు దూరంగా ఉన్నప్పటికీ సినీ ఇండస్ట్రీకి మాత్రం దూరం కాలేదు. తాజాగా శివాత్మిక షేర్ చేసిన జిమ్ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బ్లాక్ షార్ట్, బ్లాక్ కలర్ ఫుల్ స్లీవ్స్ టీ షర్ట్ వేసుకుని శివాత్మిక జిమ్ వీడియోను పోస్ట్ చేస్తూ దానికి ప్రెట్టీ లిటిల్ జిమ్ మర్డర్ అనే క్యాప్షన్ ను రాసుకొచ్చింది. ఈ వీడియోలో శివాత్మిక బీస్ట్ మోడ్ లో బరువులతో స్క్వాట్స్ చేయడం పెద్ద విషయమేమీ కాదన్నట్టు చేసి అందరినీ ఆకర్షించింది. వీడియోలో శివాత్మిక ఎనర్జీ, తన ఫోకస్ అందరినీ తన వైపు తిప్పుకునేలా చేస్తున్నాయి. దాంతో పాటూ లెగ్ మెషీన్ తో మరో క్లిప్ ను కూడా శివాత్మిక దానికి జోడించి జిమ్ లో తను పడే కష్టాన్ని అందరికీ తెలిసేలా చేసింది. అయితే శివాత్మిక జిమ్ వీడియో మనం రెగ్యులర్ గా చూసే బాలీవుడ్ భామల జిమ్ వీడియోలా లేదు.

ఈ వీడియోలో శివాత్మిక ఎలాంటి మేకప్, గ్లామరస్ లుక్ లో కాకుండా పూర్తిగా చెమటలతో కనిపిస్తూ తన పోస్ట్ ను మరింత స్పెషల్ గా మార్చింది.

## డెకాయిటే ముందొస్తాడా?




టాలీవుడ్ లోని టాలెంటెడ్ నటుల్లో అడివి శేష్ కూడా ఒకడు. అతన్నుంచి సినిమా వస్తుందంటే అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. శేష్ ఒక సినిమా చేశాడంటే ఆ సినిమాలో మంచి కంటెంట్ ఉంటుందనే పేరుని అతను సంపాదించుకున్నాడు. అలాంటి శేష్ హీరోగా సినిమా వచ్చి చాలా రోజులవుతుంది. ప్రస్తుతం శేష్ రెండు సినిమాలు చేస్తున్నాడు. అందులో ఒకటి గూఢచారి2 (జీ2) కాగా మరొకటి డెకాయిట్. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం ప్రొడక్షన్ లోనే ఉన్నాయి. అయితే గూఢచారి2 మరియు డెకాయిట్ సినిమాల్లో ముందుగా జీ2 సినిమానే రిలీజవుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తూ జీ2 కంటే ముందు డెకాయిట్ సినిమానే రిలీజవుతున్నట్టు తెలుస్తోంది. డెకాయిట్ సినిమాకు షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నాడు. షానియల్ డియో అంటే మరెవరో కాదు, శేష్ నటించి సూపర్ హిట్లు అందుకున్న క్షణం, గూఢచారి సినిమాలకు అతను సినిమాటోగ్రఫర్ గా పని చేశాడు. డెకాయిట్ రిలీజ్ డేట్ గురించి ట్రేడ్ వర్గాల్లో ఓ వార్త వినిపిస్తోంది. ఈ సినిమా 2025 డిసెంబర్ లో రిలీజ్ కానుందని వార్తలు వినిపిస్తున్నాయి. డెకాయిట్ రిలీజ్ డేట్ కు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ను మేకర్స్ సోమవారం రోజున ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఈ సినిమాలో ముందుగా శృతి హాసన్ ను హీరోయిన్ గా తీసుకుని కొంత భాగం షూటింగ్ కూడా చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి డెకాయిట్ నుంచి తప్పుకోగా ఆ స్థానంలోకి మృణాల్ ఠాకూర్ వచ్చింది. డెకాయిట్ సినిమాతో ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ లోకి నటుడిగా అడుగుపెడుతున్నారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా కు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, డెకాయిట్ తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతోంది.

## రెండేళ్ల దాకా భాగ్య శ్రీ బిజీ బిజీ..!

ఏ ముహూర్తాన తెలుగు తెరకు పరిచయం అవ్వాలని అనుకుందో కానీ ఇప్పుడు ఆమె నెక్స్ట్ స్టార్ హీరోయిన్ గా అవతరించబోతుంది. వరుస స్టార్ ఛాన్స్ లు ఆమెకు వస్తున్నాయి. ఇంతకీ ఎవరా లక్కీ హీరోయిన్ అని అనుకుంటున్నారు కదా ఇంకెవరు ఆమె మన భాగ్యం అదే అండి భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో ఒక సినిమా చేసిన ఆమె మన డైరెక్టర్ హరీష్ శంకర్ దృష్టిలో పడింది. ఆయన సినిమాల్లో హీరోయిన్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. అంతేకాదు హరీష్ శంకర్ హిట్ ఇచ్చిన హీరోయిన్స్ కెరీర్ టాప్ రేంజ్ కి వెళుతుంది. శృతి హాసన్, పూజా హెగ్డే లాంటి హీరోయిన్స్ కి మొదటి బ్రేక్ ఇచ్చిన డైరెక్టర్ ఆయనే. భాగ్య శ్రీ ని కూడా మిస్టర్ బచ్చన్ సినిమాతో పరిచయం చేసిన హరీష్ శంకర్ ఆమె లోని గ్లామర్ యాంగిల్ తో ఆడియన్స్ ని ఫిదా చేశాడు. ఐతే మిస్టర్ బచ్చన్ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. అయినా సరే భాగ్య శ్రీకి వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం అమ్మడు మూడు క్రేజీ సినిమాలతో బిజీగా ఉ






ంది. అందులో ఒకటి విజయ్ దేవరకొండ కింగ్డమ్ కాగా మరోటి ఎనర్జిటిక్ స్టార్ రామ్ తో చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా ఉంది. ఈ రెండిటితో పాటు దుల్కర్ సల్మాన్ రానా నటిస్తున్న కాంత సినిమా కూడా తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్ మూవీగా వస్తుంది. ఈ 3 సినిమాలతో భాగ్య శ్రీ ఆడియన్స్ కు మరింత దగ్గర కానుంది. ఐతే ఈమధ్య ఒక సినిమా కోసం భాగ్య శ్రీని దర్శక నిర్మాతలు కలిస్తే మరో ఆరు నెలల దాకా ఏమి చెప్పలేనని అన్నదట. ఆల్రెడీ అమ్మడికి మరో రెండు సినిమాలు లైన్ లో ఉన్నాయి. సో హిట్ లేకపోయినా సక్సెస్ ఖాతా తెరవకపోయినా కూడా భాగ్య శ్రీ డిమాండ్ అలా ఉంది. భాగ్య శ్రీ మూమెంట్ చూస్తుంటే తప్పకుండా టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ మెటీరియల్ అయిన ఈ అమ్మడిని మన మేకర్స్ ఏమేరకు ఆమె టాలెంట్ వాడుకుంటారన్నది చూడాలి. రాబోతున్న మూడు సినిమాల్లో ఒక్కటి హిట్టు పడినా కూడా భాగ్య శ్రీని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు.

## అందాల రాక్షసిలా అనసూయ హొయలు

గ్లామర్‌కు మరో పేరు అనసూయ అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. టెలివిజన్ షోలకు యాంకర్‌గా ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, సూపర్ గ్లామరస్ ఇమేజ్‌తో వెలుగొందుతోంది. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పుష్ప చిత్రంలోని దాక్షాయణి పాత్రతో మంచి గుర్తింపు పొందిన అనసూయ, ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని మరో మెట్టు ఎక్కిస్తూ దర్శనమిచ్చింది. ఈ సారి అనసూయ ఫుల్ బ్లాక్ థీమ్‌లో ఉండే బ్లౌజ్, పుష్పగుచ్ఛాల డిజైన్‌తో ఉన్న ఫ్లోరల్ చీరతో మెరిసింది. నైట్ లైట్స్‌లో ఆమె కరెంట్ కట్‌లా మెరిసిపోయింది.



ప్రత్యేకంగా ఆమె పెట్టుకున్న గ్రీన్ నోస్ రింగ్, డిఫరెంట్ హెయిర్ స్టైల్‌తో అందరూ సూపర్ గ్లామర్ అని కామెంట్లు చేస్తున్నారు. ఫోటోషూట్‌లో అనసూయ చేసిన పోజులు బోల్డ్‌గా, సెన్సేషన్‌గా ఉండటంతో నెటిజన్స్ ఆకర్షితులయ్యారు. ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్‌కి మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. అనసూయ కెరీర్ విషయానికొస్తే, 'క్షణం' సినిమా ద్వారా తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్, 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్త పాత్రతో మరో లెవెల్ కు వెళ్ళింది. ఆ తర్వాత 'పుష్ప'లో దాక్షాయణిగా రఫ్ అండ్ టఫ్ రోల్ చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. టీవీ యాంకరింగ్‌లో వచ్చిన అనుభవాన్ని సినిమాల్లో ఉపయోగిస్తూ, బోల్డ్ గా ఉండే పాత్రలను ఎంచుకుంటూ ముందుకెళ్తోంది. ఇప్పుడు సోషల్ మీడియాలోనూ అనసూయ అంతే యాక్టివ్. ఎప్పటికప్పుడు ఫ్యాషన్‌కి సంబంధించిన ఫోటోషూట్లు, రీల్స్ షేర్ చేస్తూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ముఖ్యంగా ఈ కొత్త ఫోటోషూట్‌లో అనసూయ చూపించిన బోల్డ్ లుక్ చూసిన అభిమానులు 'అందాల రాక్షసిలా ఉంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికే తన నటనతో సినిమాల్లో విలక్షణ గుర్తింపు తెచ్చుకున్న అనసూయ.. ఇప్పుడు ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇస్తూ మరోసారి ఫ్యాన్స్‌ని ఊపేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536